www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 15 No | విజయవాడ, మంగళవారం 15 జనవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.

గెలిస్తేనే నిలిచేది

నేడు ఆసిస్‌తో రెండో వన్డే

12

ప్రజాశక్తి పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు

సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతి పండుగ సందర్భంగా నేడు పత్రికా కార్యాలయానికి సెలవు. పున:దర్శనం గురువారం

\- ఎడిటర్



తొలగించాల్సిందే!



సివిసి తీరుపై విమర్శల వెల్లువ
సిబిఐ వ్యవహారంలో మరో మలుపు

న్యూఢిల్లీ : సిబిఐ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. సిబిఐ డైరక్టర్‌గా తొలగింపునకు గురైన అలోక్‌వర్మ విషయంలో కేంద్ర విజిలెన్స్ కమిషనర్ (సివిసి) కెవి చౌదరి ఇచ్చిన నివేదిక తాజాగా వివాదాస్పదంగా మారింది. దీంతో ఆయన్ను ఆ పదవి నుండి తప్పించాలన్న డిమాండ్ పెరుగుతోంది. కాంగ్రెస్, సిపిఎంలతో పాటు మరికొన్ని పార్టీలు కూడా సివిసిని తొలగించితీరాలని డిమాండ్ చేస్తున్నాయి. బిజెపి నేత సుబ్రహ్మణ్యస్వామి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం విశేషం. నరేంద్రమోడీ ప్రభుత్వ చేతిలో తోలుబొమ్మగా సివిసి కెవి చౌదరిని కాంగ్రెస్ పార్టీ అభివర్ణించింది. అలోక్‌వర్మ వ్యవహారంలో చౌదరి పాత్రపై పూర్తిస్తాయి విచారణ నిర్వహించాలని సిపిఎం డిమాండ్ చేసింది. సివిసి దురుద్దేశ్య పూర్వకంగా వ్యవహరించారని సుబ్రహ్మణ్యస్వామి వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో జరిగిన హైపవర్ కమిటీలో సివిసి ఇచ్చిన నివేదిక ఆధారంగానే అలోక్‌వర్మను సిబిఐ డైరక్టర్‌గా తొలగించాలన్న మెజార్టీ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే, అలోక్‌వర్మ అవినీతికి పాల్పడినట్లు సాక్ష్యాధారాలు లేవని, సివిసి ఇచ్చిన నివేదికకు తనకు సంబంధం లేదని సివిసి విచారణకు పర్యవేక్షణాధికారిగా వ్యవహరించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పట్నాయక్ బాహాటంగానే ప్రకటించారు. అదేసమయంలో సిబిఐలో నెం.2గా ఉండి, వివాదానికి కేంద్రబిందువుగా ఉన్న రాకేష్ ఆస్థానాకు అనుకూలంగా అలోక్‌వర్మను ప్రలోభపెట్టడానికి కూడా చౌదరి ప్రయత్నించారన్న వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌గా ఆయన్ను తొలగించాలన్నడిమాండ్ విపక్షాల నుండి పెరుగుతోంది. మరోవైపు సిబిఐ తాత్కాలిక డైరక్టర్‌గా నాగేశ్వరరావును కేంద్ర ప్రభుత్వం నియమించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

జస్టిస్ పట్నాయక్ నివేదిక ఏదీ ? ఖర్గే

అలోక్‌వర్మ వ్యవహారంలో జస్టిస్ పట్నాయక్ ఇచ్చిన నివేదిక ఎక్కడుంది? దానిని ఎందుకు బయటపెట్టరు? అని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే తాజాగా ప్రశ్నించారు. 'సివిపి ఇచ్చిన నివేదికతో నాకు సంబంధం లేదు. నేను ఇచ్చిన నివేదికలో అన్ని అంశాలను, నా అభిప్రాయాలను వివరించాను' అంటూ పట్నాయక్ చేసిన వ్యాఖ్యలను ఆయన తాజాగా ప్రస్తావించారు. ప్రధానమంత్రి నేతృత్వంలోని హైపవర్ కమిటీ ముందుకు సివిసి నివేదిక మాత్రమే వచ్చిందని. దానిని తాను వ్యతిరేకించానని

మిగతా 9లో

కోడిపందేల జోరు



సంక్రాంతి సందర్భంగా తొలిరోజైన సోమవారం రాష్ట్రంలో పలు జిల్లాల్లో కోడిపందేల జోరు కొనసాగింది. ఉభయగోదావరి జిల్లాల్లో దాదాపు 800 చోట్ల, కృష్ణా, గుంటూరులో దాదాపు 300లకు పైగా ఏర్పాటు చేసిన బరుల్లో దాదాపు రూ.100 కోట్ల పందేలు నడిచినట్లు చెపుతున్నారు. ఇవి కాకుండా హోటల్స్‌లో బస, మంచినీళ్లు, భోజనం, రవాణా తదితర రూపాల్లో కోట్లాది రూపాయలు వ్యాపారం జరిగింది. సోమవారం ఉదయం వరకూ హడావుడి చేసిన పోలీసులు ఆ తరువాత చాలా చోట్ల కన్పించలేదు. పై నుండి వత్తిడితో పోలీసులు నిర్వాహకుల వద్ద మూమూళ్లు తీసుకుని యథేచ్ఛగా వదిలేశారని సమాచారం.

'ఉపాధి హామీ'
నిర్వీర్యం



- ఎంపీలు, నిపుణుల ఆందోళన
- ప్రధానికి 160 మంది లేఖ

9

టెన్త్ అంతర్గత మార్కుల తనిఖీకి కమిటీలు

- మూడు స్థాయిల్లో ఏర్పాటు
- 28 నుంచి తనిఖీలు ప్రారంభం

9

కన్నయ్యపై దేశద్రోహం అభియోగం

- మూడు నెలల్లో వేయాల్సిన ఛార్జిషీట్‌కు 3 సంవత్సరాలు..

9



యథాతథంగా టోల్ వసూలు

- సాయంత్రానికి తగ్గిన రద్దీ

9

సంక్రాంతి అందరికీ ఆనందాన్ని పంచాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలనీ, తెలుగు సంప్రదాయాలకు అద్దంపట్టేలా సంక్రాంతి అందరికీ ఆనందాన్ని పంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు, రిపబ్లికన్‌పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి తదితరులు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి లక్ష్మి తెలుగు లోగిళ్లలో సిరులు కురిపించాలనీ, కనుమ కోలాహలం రైతన్నల్లో సంతోషాన్ని ఇనుమడింపచేయాలనీ కాంక్షిస్తున్నట్లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.



బోగిమంటలు

గుంటూరు జిల్లాలోని మంగళగిరిలో బోగిమంటలు వేస్తున్న దృశ్యం

విశాఖ జిల్లా మునగపాకలో గుర్రపు పందేలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు





మరికొన్నాళ్లు రాత్రివేళ చలి తీవ్రత

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

సంక్రాంతి తర్వాత కూడా రాత్రి వేళల్లో చలి తీవ్రత కొనసాగనుంది. పశ్చిమ ఆటంకాలు ఇంకా తూర్పు వైపునకు పయనిస్తుండటమే దీనికి కారణం. వాటివల్ల ఉత్తర భారతదేశంలో తీవ్రమైన చలి పరిస్థితులు నెలకొన్నాయి. దాని ప్రభావం రాష్ట్రంపై పడుతోందని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత శాస్త్రజ్ఞులు రాళ్లపల్లి మురళీకృష్ణ తెలిపారు. అయితే, పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని, దాని వల్ల పగలు పెద్దగా చలి ప్రభావం చూపబోద న్నారు. భోగి మంటల కారణంగా సోమవారం కోస్తా, సీమల్లో పలుచోట్ల పొగమంచు, ఎత్తైన ప్రాంతాల్లో మంచు కురిసిన సంగతి తెలిసిందే. మంగళవారం ఉదయం కూడా కోస్తా జిల్లా లన్నింటా, రాయలసీమలోని చిత్తూరు జిల్లాలో పొగమంచు, అటవీ ప్రాంతాల్లో చలి మంచు కురుస్తుందని హైద రాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్న అటవీ, కొండ ప్రాంతాల్లో చలి మంచు కురుస్తుందని, మైదాన ప్రాంతాల్లో తేమ శాతం తక్కువగా ఉండటం, కాలుష్యం ఎక్కువగా ఉండటంతో పొగమంచు కురుస్తుందని రాళ్లపల్లి వివరించారు.

మరోవైపు కొమురిన్, మాల్దీవుల నుంచి కేరళ మీదుగా కర్నాటక వరకు ద్రోణి ఏర్పడినట్లు భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే దీని ప్రభావం రాష్ట్రంపై ఉండబోదని నిపుణులు తెలిపారు.

ప్రజ్ఞ

1. ఏ రాష్ట్రంలో లా కమిషన్‌ను ఏర్పాటు చేశారు?
2. రాజస్థాన్ రాయల్స్ చీఫ్ కోచ్‌గా ఎవరిని నియమించారు?
3. సహస్త్రా సీమబల్‌కి నూతన డైరెక్టర్ జనరల్ ఎవరు?
4. అతిపెద్ద సింగిల్ లేన్ స్టీల్ కేబుల్ బ్రిడ్జ్‌ను భారత్‌లో ఎక్కడ ప్రారంభించారు?
5. ఏ దేశ సరిహద్దుల్లో 44 వ్యూహాత్మక రహదారులు వేయాలని భారత్ నిర్ణయించిది?

సమాధానాలు 7లో

ఆదాయం పెరిగినా తగ్గని నష్టాలు

- ఆర్టీసికి ప్రభుత్వం ఇవ్వాల్సింది చెల్లించనందునే
- నష్టాల సాకుతోనే వేతన సవరణకు బ్రేక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా రవాణాలో ముందంజలో ఉన్న ఎపిఎస్ ఆర్టీసికి చట్ట ప్రకారం ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్ము ఇవ్వకపోవడం వల్లనే ఆ సంస్థ నష్టాల్లో కొనసాగుతోంది. దీంతో ఆదాయం పెరిగినా ఆర్టీసి నష్టాలు మాత్రం తగ్గడం లేదు. ఈ నష్టాల సాకుతో ఆర్టీసి ఉద్యోగుల వేతన సవరణకు యాజమాన్యం మోకాలడ్డుతోంది. 2014 నాటికి ఆర్టీసికి ఏడాదికి రూ.3,500 కోట్ల ఆదాయం వచ్చేదల్లా 2018కి సుమారు రూ.5,500 కోట్లకు పెరిగింది. ఆక్యుపెన్సీ రేషియో(ఒఆర్) కూడా 66 శాతం నుంచి 76.71 శాతానికి పెరిగింది. సంస్థలోని కండక్టర్లు, డ్రైవర్లతో పాటు సిబ్బంది మొత్తం కష్టపడటంతో ఎర్నింగ్ పర్ కిలోమీటర్(ఇపికె) గతేడాది కన్నా 6.16 శాతం, ఎర్నింగ్ పర్ బస్(ఇపిబి) రూ.10,751 పెరిగింది. ఇన్ని విధాలుగా ఆర్టీసి అభివృద్ధి చెందినా అప్పులు, వడ్డీలతో కలిపి సుమారు రూ.6,250 కోట్ల నష్టాల్లో వుంది.

ఆర్టీసి చట్టం (1950) ప్రకారం 1:2 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసికి కేపిటల్ కంట్రిబ్యూషన్ చెల్లించాల్సి ఉంది. దాన్ని కూడా ఆర్టీసికి చెల్లించడం లేదు. కేరళ ప్రభుత్వం ఆర్టీసికి వచ్చే నష్టం మొత్తాన్ని ఏ ఏడాదికి ఆ ఏడాది బడ్జెట్ నుంచి చెల్లిస్తోంది. ఎపిలో మాత్రం చిన్న చిన్న రాయితీల మాత్రం తిరిగి చెల్లిస్తూ రూ.290 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తోంది. ఇవ్వాల్సింది ఇవ్వకపోగా పన్నుల



రాయితీలు కూడా ఇవ్వడం లేదు. దీంతో ఆర్టీసికి వచ్చే ఆదాయంలో దాదాపు రూ.2,100 కోట్లు పన్నులకే చెల్లించాల్సి వస్తోంది. విమాన ఇంధనంపై ఒక శాతం పన్ను ఉండగా ఆర్టీసికి డీజిల్‌పై 26.24 శాతం పన్ను విధిస్తున్నారు. ఆర్టీసిలో పది లక్షల కిలోమీటర్లు దాటిన బస్సులు 3500, 15లక్షల కిలోమీటర్లు దాటిన బస్సులు 1500 ఉన్నాయి. వాటి స్థానాల్లో కొత్త బస్సులను తీసుకొచ్చేందుకు కనీసం రూ.2వేల కోట్లు కావాలి. ప్రభుత్వం బస్సుల కొనుగోలుకు సాయమందించకపోవడంతో అద్దె బస్సుల కోసం ఏడాదికి రూ.వెయ్యి కోట్లు చెల్లించాల్సి వస్తోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా పెంచాల్సిన మరో వెయ్యి బస్సులను పెంచాలంటే రూ.700 కోట్లు అదనంగా కావాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బస్సుల కొనుగోలు పేరుతో కేవలం రూ.200 మాత్రమే ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించింది. డీజిల్ ధరలు పెరగడంతో ఏడాదికి రూ.900 కోట్లు ఆర్టీసిపై భారం పడుతోంది. వీటిని ప్రభుత్వమే భరిస్తే ఆర్టీసికి నష్టాలే ఉండవని అధికారులు చెబుతున్నారు. ఆర్టీసిని ఆదుకోవాలని కోరుతూ ఎమ్‌డి రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. నష్టాల సాకుతో వేతన సవరణను జాప్యం చేయడం తగదని, ఈ నెల 18న జరిగే వేతన సవరణ కమిటీ భేటీ తరువాత యాజమాన్యం తీరును బట్టి సమ్మె కార్యాచరణ ప్రకటిస్తామని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు.

ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలి

ఆర్టీసి నష్టాల నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వంలో విలీనం చేయాలి. ఆర్టీసికి వచ్చే నష్టాలను ఏ ఏడాదికి ఆ ఏడాది బడ్జెట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలి. లాభ నష్టాలతో సంబంధం లేకుండా ప్రజల కోసం పనిచేస్తున్న ఆర్టీసిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రజా రవాణా వ్యవస్థ నిర్వీర్యమైతే ప్రయివేటు దోపిడీ పెరుగుతుంది. ఆ పరిస్థితి రాకుండా చర్యలు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- పలిశెట్టి దామోదరరావు, ఇయు ప్రధాన కార్యదర్శి

నష్టాన్ని పూడ్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

ఆర్టీసికి వచ్చే నష్టాలను పూడ్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ఆదాయం, ఖర్చుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని (వయబుల్ గ్యాప్ ఫండింగ్‌ను) ప్రభుత్వం చెల్లించాలి. ఆర్టీసిని ఆదుకునేందుకు విలీనం పరిష్కారం కాదు. నష్టాలతో సంబంధం లేకుండా వేతన సవరణ చేయాలి. సవరణ వల్ల పెరిగే భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి.

- సిహెచ్ సుందరయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి

కృష్ణానది లంకల్లో పర్యాటకాభివృద్ధి

- త్వరలో సవివర ప్రణాళిక
- అమరావతి పర్యాటకంపై ప్రభుత్వం కసరత్తు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని పరిధిలోని కృష్ణానది లంకల్లో పర్యాటకాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. మాస్టర్‌ప్లానులో పర్యాటకానికి కొంత ప్రాంతాన్ని కేటాయించిన ప్రభుత్వం అమలుకు చర్యలు చేపట్టింది. కీలకమైన ఐకానిక్ వంతెన, వైకుంఠపురం బ్యారేజీ, ప్రభుత్వ భవనాల నిర్మాణం, అంబేద్కర్ పార్కు, ఎన్‌టిఆర్ స్మృతివనం ప్రాజెక్టులు చేపడుతున్న నేపథ్యంలో దానికి అనుబంధంగా పర్యాటకాన్ని పెంచాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా రాయపూడి, ఉద్దండ్రాయునిపాలెం, వెంకటపాలెం, ఉండవల్లి పరిధిలోని లంకల్లో కార్యకలాపాలు పెంచాలని ఆలోచన చేస్తోంది. దీనికోసం ఇప్పటికే డిపిఆర్ తయారీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం విజయవాడలో ఉద్యోగుల ఆహ్లాదానికి వీలైన ప్రాంతాలు లేవు. ఎక్కువ మంది ఉద్యోగులు హైదరా బాద్ వెళ్లిపోతున్నారు. విదేశీ పర్యాటకులొచ్చినా హైదరాబాద్ కేంద్రంగానే విడిది చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్యాటకాన్ని పెంచుకోవడంతోపాటు, అమరావతికి మార్కెటింగ్ చేయాలంటే పర్యాటకం ప్రధానమార్గంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. విజయవాడలో ఉన్న భవానీద్వీపం ప్రస్తుతం పర్యాటకుల అవసరాల్ని తీర్చలేకపోతోంది. అంతర్జాతీయ స్థాయిలో ఇక్కడ సంస్థలు ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకాన్ని పెంచుకోవాలని ఇటీవల ముఖ్యమంత్రి సిఆర్‌డిఎ సమావేశంలో అధికారులకు సూచించారు. ముఖ్యంగా కృష్ణానది బ్యారేజీ వద్ద నుండి వైకుంఠపురం వరకూ లంకల్లో సుమారు 6వేల ఎకరాల మేరకు దిబ్బలున్నాయి. వీటిమధ్యలోనే బ్యారేజీ, ఐకానిక్ వంతెన, జాతీయ రహదారుల విభాగం నిర్మించబోయే వంతెన రానున్నాయి. ఐకానిక్, జాతీయ రహదారుల విభాగం వంతెనల మధ్యలో ఉన్న లంకల్లో పర్యాటకాన్ని పెంచితే రవాణాకూ, రాజధానికి నగరానికి అనుకూలంగా తయారవుతాయి. సింగపూర్‌కు చెందిన పలు కంపెనీలు ఇంతకుముందు దీనిపై చర్చించాయి. అయితే వాటిని పక్కనపెట్టారు. ప్రస్తుతం మరోసారి తెరమీదకు తీసుకొచ్చారు. దీని ప్రకారం తొలిదశలో రూ.2000 కోట్లతో ప్రాజెక్టులు చేపట్టేందుకు అవకాశముందని అంచనా వేసిన ప్రభుత్వం, వాటన్నిటినీ పిపిపి పద్ధతిలో ఇచ్చేయనున్నారు. హోటల్, పర్యాటక రంగంలో ఉన్న పలు కంపెనీలు ప్రభుత్వానికి చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అవసరమైతే నదీ పాయల్లో హోటల్ నిర్మించే అంశాలను పరిశీలించాలని సిఆర్‌డిఎ అధికారులకు సూచించినట్లు తెలిసింది. రవాణా ప్రాజెక్టులో భాగంగా నాలుగోదశలో కాకినాడ నుండి చెన్నై వరకూ మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందులోనే ప్రకాశం బ్యారేజీ నుండి జగ్గయ్యపేటకు జలరవాణాను కల్పించను న్నారు. భారీ నౌకలు వెళ్లేందుకు వీలుగా కృష్ణానదిలో పూడిక తీయనున్నారు. దీనికోసం ఇప్పటికే బారీ డ్రెడ్జర్లను తెప్పించారు. ఇదే మార్గంలో జల రవాణాను ప్రోత్సహించడంతోపాటు, జల పర్యాటకానికి వీలవు తుందని అంచనా వేస్తున్నారు. తొలిదశలో ప్రకాశం బ్యారేజీ నుండి పవిత్ర సంగమం వరకూ పర్యాటక రవాణాకు అవకాశమివ్వాలని నిర్ణయించారు. ఈ నెలాఖరులోపు దీనికి సంబంధించిన సమగ్ర కార్యాచరణ మొదలయ్యే అవకాశముంది.

ప్రత్యేకం

చదువు చెప్పేదెలా...

- టీచర్లపై పెరుగుతున్న ఒత్తిడి
- టెన్త్‌లో వంద శాతం ఫలితాలు సాధ్యమేనా?



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలలో విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులపై పనిభారం రోజురోజుకు పెరిగిపోతోంది. బోధనేతర కార్యకలాపాలకు ఒక పక్క కేటాయిస్తూ మరో పక్క సిలబస్ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలిస్తోంది. పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని ప్రభుత్వం వెంటపడుతోంది. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులపై మరింత ప్రభావం పడుతోంది. బోధనేతర కార్యక్రమాలకు టీచర్లు దూరంగా ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతున్నప్పటికీ, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అనేక కార్యక్రమాలకు వీరు వారధులవుతున్నారు. ఈ నెల 2 నుంచి 11 వరకు నిర్వహించిన జన్మభూమిలో తరగతుల్లో బోధన జరగలేదు. జన్మభూమి జరుగుతున్న రోజుల్లో విద్యార్థులకు వ్యాసరచన వంటి పోటీలు నిర్వహించడానికే సమయం సరిపోయింది. ఇప్పుడు గణతంత్ర దినోత్సవం సందర్భంగా వ్యాసరచన వంటి పోటీలను నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. వీటితో పాటు సిఎం చంద్రబాబు ఈ విద్యాసంవత్సరంలో నిర్వహించిన ధర్మపోరాట దీక్షలకు, జ్ఞానభేరీలకు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు ముఖ్యంగా పాఠశాల విద్యార్థులనే తరలించారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం ప్రవేశపెట్టినా పాఠశాలలను ప్రచార వేదికలుగా మార్చేసిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

అమ్మఒడివెన, విద్యార్థుల చేతులు కడిగించడం, నులిపురుగుల మాత్రలు వేయించడం, పల్లె నిద్ర , స్వచ్ఛభారత్ ర్యాలీలు, అమ్మకు వందనం, రికార్డులు రాయడం, గ్రామాల్లో మరుగుదొడ్ల సర్వే, పాఠశాలల్లో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం మరుగుదొడ్ల ఫొటోలు పంపడం, గ్రామాల్లో మొక్కల్ని నాటించడం, స్కీమ్‌ల సమాచారం అప్‌లోడ్ చేయించడం, నెలనెలా టెలికాన్ఫరెన్స్‌లు, సిసిఇ విధానం మార్కుల అప్‌లోడింగ్, మధ్యాహ్న భోజనం వివరాలు పంపడం వంటి పనులు తలకు మించిన భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క రికార్డు అసిస్టెంట్‌గా కూడా పని చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. మధ్యాహ్న భోజనం లెక్కలు, పరీక్షల మార్కులు, విద్యార్థుల హాజరు, విద్యార్థి సామర్థ్యాలు ఇలా అనేక అంశాలపై ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నివేదికలు తయారు చేస్తూనే ఉండాలి. ఆ నివేదికలను ప్రతి నెలా ఉన్నతాధికారులకు అందజే యాల్సి ఉంటుంది. ఇలా ప్రతి పాఠశాలలోనూ సుమారు 20 రికార్డుల వరకు రాయాల్సిన అవసరం ఉంది. రికార్డులు రాసే బాధ్యత ప్రతి టీచర్‌పైనా ఉంది. తమ క్లాసుల్లోని విద్యార్థులకు సంబంధించి వివరాలను పొందుపరచడంతోపాటు సబ్జెక్టుల వారీగా వివరాలను నమోదు చేయాలి. ఉపాధ్యాయులకు ఇలా బోధనేతర కార్యక్రమాలు ఎక్కువ కావడంతో విద్యార్థులకు నష్టం జరుగుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మరోపక్క పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాల్సిందేనని టీచర్లకు కలెక్టర్లు లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. లేదంటే మెమోలు అందుకోడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. దీంతో టీచర్లు, విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడి పెరిగిపోతోంది. అదనపు పనులు చేస్తూ హడావిడిగా పరీక్షలు నిర్వహించడంతో ఆ ప్రభావం విద్యార్థులపై పడుతోందని, వీటి నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాబురెడ్డి డిమాండ్ చేశారు.

ఆగని పెట్రో వడ్డన

వరుసగా ఐదో రోజూ బాదుడే..

పెట్రోల్ పై రూ. 0.40, డీజిల్‌పై రూ. 0.53 పైసలు పెంపు



న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదలతో ఇంధన ధరలు మళ్లీ భగ్గుమంటు న్నాయి. ఈ ఏడాదిలో వరుసగా ఐదో రోజూ, మొత్తంగా ఆరోసారి పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగాయి. పెంపు పైసలలోనే కనిపిస్తున్నా.. దాని ప్రభావం వినియోగదారులపై తీవ్రంగా పడుతోంది. దీంతో, దేశవ్యాప్తంగా ఇప్పటికే లీటరు పెట్రోల్, డీజిల్‌పై ధరలు రూ. 2 కు పైగా పెరిగాయి. కాగా, లీటరు పెట్రోల్‌పై రూ. 0.40, డీజిల్‌పై రూ. 0.53 పైసలు పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. ధరలు వరుసగా పెరుగుతుండటంతో మరోసారి చమురు ఉత్పత్తుల ధరలు ఆకాశాన్ని అంటుతాయేమోనని సామాన్య జనం ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ప్రారంభమై పదిహేను రోజులు గడవకముందే పెట్రో ధరలు రూ. 2 పెరగడమే దీనికి నిదర్శనం. గతేడాది ఆగస్టు మాసాంతం నుంచి వరుసగా నలభై రోజుల పాటు ఇంధన ధరలు పెరిగిన సంగతి తెలిసిందే. గతానుభవాల దృష్ట్యా మరోసారి పెట్రో పోటు తప్పదని జనం భయాందోళనలో ఉన్నారు. ఇప్పట్లో కేంద్ర, రాష్ట్ర ఎన్నికలు కూడా లేకపోవడంతో మోడీ సర్కారు చమురు ఉత్పత్తుల ధరలను తగ్గించే యోచన చేయబోదని వారు భావిస్తున్నారు.

ఇంధన ధరల పెంపుతో ఢిల్లీలో లీటరు పెట్రోల్ ఈ ఏడాది తొలిసారి రూ. 70.13ల మార్కు దాటింది. డీజిల్ రూ. 64.18గా ఉంది. ముంబయిలో ఇవే ధరలు రూ. 75.77, రూ. 67.18గా నమోదయ్యాయి. హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ రూ. 74.40గా ఉంది. డీజిల్ రూ. 69.77కు చేరింది. పెట్రో ధరల వరుస పెంపుతో పండుగ పూట తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనున్నారు.

సహకార సంఘంలో 2వేల కోట్ల కుంభకోణం

మాజీ మేనేజర్‌ను అరెస్టు చేసిన ఈడీ అధికారులు

న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని ఓ సహకార సంఘంలో 2వేల కోట్ల కుంభకోణం చోటుచేసుకుంది. ఆ సహకార సంఘం మాజి మేనేజర్ మచింద్ర ఖాడేను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆదివారం అరెస్టు చేసింది. సహకారం సంఘం నుంచి డబ్బులు కాజేసి లాండరింగ్‌కు పాల్పడినందుకు అతన్ని అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈడీ అ ధికారులు తెలిపిన వివరాల ప్రకారం... గతంలో మహారాష్ట్రలోని రేణుకామాత మల్టీ స్టేట్ కో- ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో మేనేజర్‌గా నిందితుడు పనిచేశాడు. ఆ సమయంలో ఖాతాదారుల నుంచి ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకున్నాడు. సొసైటీ నుంచి డబ్బులను విత్‌డ్రా చేశాడు. అనంతరం విదేశాల నుంచి వజ్రాలను దిగుమతి చేసుకుంటున్నట్టు నకిలీ పత్రాలు సృష్టించాడు. దిగుమతి సుంకాల నిమిత్తం సదరు కంపెనీలకు డబ్బులు చెల్లించాలని పత్రాలను సృష్టించాడు. అనంతరం ముంబయిలోని ఇండస్‌లాండ్ బ్యాంకు ద్వారా ఈ చెల్లింపులను చేశాడు. ఈ బ్యాంకు ద్వారా హంకాంగ్‌లోని వివిధ అకౌంట్లకు 2వేల కోట్లు బదిలీ చేశారు. ఈ కేసులో రఘుకుల్ దాస్ డైమండ్స్ కంపెనీ డైరెక్టర్ సంజయ్ జైన్‌ను, స్కైలైట్ కంపెనీ డైరెక్టర్ సురభ్ పండిట్‌లను ఈడి అధికారులు అరెస్టు చేశారు. కాగా నిందితునికి చెందిన 20 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

మోడీ పర్యటన కోసం...

ఒడిషాలో వందలాది చెట్లు నరికివేత

భువనేశ్వర్ : మోడీ సర్కారు చేపట్టిన స్వచ్ఛ భారత్ ప్రచార కార్యక్రమాలకు ఎక్కడికెళ్లినా పచ్చదనం కోసం చెట్లను నాటాలని.. ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలను కాపాడాలని ప్రధాని సెలవిస్తారు. కానీ, మోడీ పర్యటన నిమిత్తం ఒడిషాలో వందలాది చెట్లను నరికేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభానికి గానూ ఆయన నేడు (జనవరి 15) బాలాంగిర్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలిక హెలిప్యాడ్ నిర్మాణం కోసం ఇక్కడి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న వందలాది చెట్లను అధికారులు కొట్టివేసారు. ఈ చెట్లు రైల్వే శాఖ పరిధిలోనే ఉన్నా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వాటిని రైల్వే అధికారులు కొట్టివేస్తున్నారని జిల్లా అటవీశాఖ అధికారి సమీర్ సత్పతి అన్నారు. దీనిపై విచారణ చేపట్టామని రైల్వే శాఖ విచారణ కోరామని తెలిపారు.

తిరుగు ప్రయాణానికి 3,020 ప్రత్యేక బస్సులు

ఆర్టీసి ఇడి జయరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతి తర్వాత ప్రయాణికుల్ని తమ నివాస ప్రాంతాలకు చేర్చేందుకు 3,020 ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేశామని ఆర్టీసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్స్) జి జయరావు తెలిపారు. ఈనెల 16నుండి 20 వరకు ఈ బస్సులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చెన్నై , బెంగళూరు, హైదరాబాద్ వంటి రాష్ట్రేతర ప్రాంతాలతోపాటు విశాఖ, విజయవాడ, రాజమండ్రి, అమలాపురం మొదలైన ప్రాంతాలకు ముఖ్యంగా ఈ బస్సులు నడపనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి హైదరాబాద్ నగరానికి 1,115 బస్సులు నడుపుతున్నామనీ, వాటిలో విజయవాడ నుండి 275, గుంటూరు నుండి 150, ఒంగోలు నుండి 160, తూర్పుగోదావరి నుండి 150, కర్నూలు నుండి 100 ,పశ్చిమగోదావరి నుండి 75 బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. బెంగళూరుకు 570 బస్సులు నడుపుతున్నామనీ, వాటిలో చిత్తూరు నుండి 200, కడప నుండి 110, కర్నూలు నుండి 90, నెల్లూరు నుండి 55, అనంతపురం నుండి 50, మిగిలిన ప్రాంతాల నుండి మరికొన్ని బస్సుల్ని నడుపుతున్నట్లు పేర్కొన్నారు. చెన్నై నగరానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి 202 బస్సులు నడుపుతున్నామనీ, వీటిలో విజయవాడ నుండి 35, నెల్లూరు నుండి 35, కడప నుండి 35 బస్సులున్నాయనీ స్పష్టం చేశారు. విశాఖపట్నానికి 219 బస్సులు నడుపుతున్నామనీ, ఇవి ప్రధానంగా విజయనగరం, శ్రీకాకుళం నుండి 110, తూర్పుగోదావరి నుండి 72 బస్సులు ఏర్పాటు చేశామనీ తెలిపారు. విజయవాడ నుండి అమలాపురం, రాజమండ్రి వైపు 175 బస్సులు నడపాలని సంస్థ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తూర్పుగోదావరి నుండి విజయవాడకు 123 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సుల సంఖ్యను పెంచడానికి అధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

నీట్ దరఖాస్తుల సవరణకు 31 వరకు గడువు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎంబిబిఎస్, బిడిఎస్‌లలో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు తప్పుల్ని సరిదిద్దుకునేందుకు అవకాశాన్ని కల్పించారు. ఈ నెల 31లోగా దరఖాస్తును ఎడిట్ చేసుకొని తప్పుల్ని సరిదిద్దుకోవచ్చునని నేషనల్ టెస్ట్ ఏజెన్సీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. నీట్‌పోర్టల్‌లో లాగిన్ అయ్యి ఫొటోతో పాటు సంతకం, పరీక్ష లాంగ్వేజ్, ఎక్కడ రాయాలనుకంటున్నారు వంటి వివరాలను కూడా మార్చుకోవచ్చునని తెలిపింది. మార్పులు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని, ఒక్కసారి కరక్షన్ విండో క్లోజ్ చేస్తే మరలా మార్పులకు అవకాశం ఉండదని సూచించింది.

ఎన్‌బిఇ సభ్యుడిగా డాక్టర్ రమేష్ బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ సభ్యుడిగా, దక్షిణ భారతదేశం నుంచి ప్రతినిధిగా, తనను భారత ప్రభుత్వం నియమించిందని, డాక్టర్ రమేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌బిఈ డైరెక్టర్ డాక్టర్ రష్మీకాంత్ దవే నుంచి తనకు నియామక పత్రం అందిందని తెలిపారు. వైద్య విద్యార్థుల పరీక్షల నిర్వహణ, ప్రశ్నా పత్రాలు తయారు చేయడం, ప్రాక్టికల్స్ వంటి పలు విషయాలపై బోర్డు తరపున సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యకు తత్సమానంగా డిప్లోమాట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ అందించే సర్టిఫికేట్‌లకు విలువ ఉందని తెలిపారు. గత దశాబ్ద కాలంగా రమేష్ హాస్పిటల్స్, విజయవాడలో సూపర్ స్పెషాలిటీ కోర్సులైన కార్డియాలజీ, న్యూరాలజీలలో డిఎన్‌బి వైద్య విద్యా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. గుంటూరు రమేష్ హాస్పిటల్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, సూపర్ స్పెషాలిటీలలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ, గైనకాలజీ, యూరాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ, అనస్తీషియాలలో కోర్సులను అందించటానికి తాము పెట్టుకున్న అప్లికేషన్ పరిశీలన పూర్తయ్యిందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి పైన పేర్కొన్న కోర్సులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో రమేష్ హాస్పిటల్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, సూపర్ స్పెషాలిటీలలో అన్ని రకాల వైద్య విద్యా కోర్సులను అందుబాటులోనికి తీసుకొచ్చామని పేర్కొన్నారు.



కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో భారీ బరి

తొలిరోజు రూ.100 కోట్లకు పైనే

- ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరుల్లో కోడి పందేల జోరు
- డింకీ పందేలను ప్రారంభించిన ఎమ్మెల్యేలు
- బరుల వద్ద గుండాట, మూడు ముక్కలాట, మద్యం జోరు
- పత్తాలేని పోలీసులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఊహించినట్లుగానే కోడిపందేలు ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో యథేచ్ఛగా, మిగిలిన జిల్లాల్లో సోమవారం అక్కడక్కడా కొనసాగాయి. . బైండోవర్ కేసులు, బరుల ధ్వంసమంటూ హడావుడి చేసిన పోలీసులు సోమవారం పత్తా లేరు. మరికొన్ని చోట్ల ఉదయం కన్పించి తీరా పందేలు మొదలయ్యాక అక్కడ నుండి వెళ్లిపోయారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతం చినగరువు, కాళ్ల మండలం సీసలి, జంగారెడ్డిగూడెం వంటి ప్రాంతాల్లో ఫ్లడ్ లైట్లు అమర్చి మరీ భారీ ఎత్తున కోడిపందేలకు ఏర్పాట్లు చేశారు. చినగరువు బరివద్ద బౌన్సర్లను సైతం ఏర్పాటు చేశారు. కాళ్ల మండలం సీసలిలో ఉండి ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు రిబ్బన్ కట్ చేసి మరీ పందేల బరిని ప్రారంభించారు. కొద్దిసేపు కత్తులు కట్టకుండా పందేలను వేశారు. టిడిపి నేత రఘురామకృష్ణంరాజు అదే గ్రామంలో డింకీ పందేల పేరిట కోళ్లను వదిలారు. పోలవరం ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో బరి వద్దకు వచ్చి కాసేపు పందేలను తిలకించి వెళ్లారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో కోడిపందేల్లో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నట్లు తెలిసింది. పాలకొల్లు మండలం పూలపల్లిలో వైసిపికి చెందిన మాజీ ఎంఎల్సి మేకా శేషుబాబు తన ఆధీనంలో ప్రత్యేక బరిని ఏర్పాటు చేసి పందేలను ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 400కుపైగా బరుల్లో పందేలు ప్రారంభమయ్యాయి. ఈ ఒక్కరోజే రూ.30 కోట్లకుపైగా పందేలు సాగినట్లు అంచనా వేస్తున్నారు. పందేల వద్ద గుండాట, మూడుముక్కలాట, మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పందెంరాయుళ్లు ఇచ్చిన మామూళ్లే రూ.కోటికిపైగా ఉన్నట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పోలీసులు సోమవారం ఉదయం బరుల వద్దకు వెళ్లి పందేలు ఆడితే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు పనిచేయడంతో కోనసీమ, మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో భోగి రోజు మధ్యాహ్నం నుంచి కోడిపందేలు, గుండాట, పేకాట, మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగాయి. జిల్లాలో భోగి రోజు రూ.30 కోట్ల మేర పందేలు, జూదాలు జరిగాయని అంచనా.జిల్లాలో సుమారు 90కిపైగా బరుల్లో కోడి పందేలు సాగాయి. కోనసీమలోని ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో పందేలు యథేచ్ఛగా జరిగాయి. కాట్రేనికోన మండలంలో ఉదయం నుంచీ పోలీసులు పికెటింగ్ నిర్వహించి 11.30 గంటల తరువాత వెళ్లిపోయారు. కాట్రేనికోన, ఐ పోలవరం, ఉప్పలగుప్తం, జగ్గపేట, ఆనపర్తి, ఆత్రేయపురం, పిఠాపురం, సామర్లకోట, రంపచోడవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, వై.రామవరం, దేవీపట్నం మండలాల్లోనూ, దివాన్‌చెరువు, రాజానగరం, నరేంద్రపురం, పుణ్యక్షేత్రం, కొత్తపేట, కిర్లంపూడి తదితర ప్రాంతాల్లోనూ పందేలు సాగాయి. కృష్ణాజిల్లాలో మొదటిరోజునే సుమారు రూ.10 కోట్లకు పైగానే చేతులు మారినట్లు చెప్పుకుంటున్నారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లులో టిడిపికి చెందిన రెండు గ్రూపుల వారు పందేల విషయంలో గొడవ పడి కొట్టుకోవడంతో స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని చెదరగొట్టి బరిని తొలగించారు. నందిగామ, చందర్లపాడు మండలాల్లో టీడీపీ, వైసీపీ నాయకులు వేర్వేరుగా శిబిరాలు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్ మండలం అంపాపురంలో పెద్ద బరిని ఏర్పాటు చేసి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పందేలను ఏర్పాటు చేశారు. నూజివీడు, ఆగిరిపల్లి, మచిలీపట్నం,కైకలూరు ప్రాంతాల్లో పందేలు ఏర్పాట్లయ్యాయి. కంకిపాడు మండలం ఈడుపుగల్లు, గొడవర్రు, కందలంపాడు గ్రామాల్లో కోడిపందాలు జరిగాయి.

ఈడుపుగల్లులో జాతీయ రహదారి నుంచి బరులు ఉండే ప్రదేశానికి రెండు కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ వెళ్లటానికి సుమారు గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది. బరుల వద్ద ఏర్పాటు చేసుకున్న పలు దుకాణాలకు సైతం రోజుకు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు నిర్వాహకులు అద్దె చెల్లిస్తున్నారు. పది ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న పంట పొలాల్లో కోడి పందేలు, పేకాట, లోనా - బయటా, గుండాట, పెద్దబజారు చిన్నబజారు లాంటివి నిర్వహిస్తున్నారు.

గన్నవరం మండలం గోపవరపుగూడెం, తెంపల్లి, మర్లపాలెం, చిన ఆవుటపల్లి, కేసరపల్లి, అంపాపురం, తేలప్రోలు, ఇందుపల్లి, నున్న, రామచంద్రాపురం, అడవి నెక్కలం గ్రామాల్లో కోడి పందేల శిబిరాలు వెలిశాయి. రోజులో మొత్తం 30 కోడి పందేలు వేస్తే 15 వేలు, పేకాట నుండి రూ.10 వేలు, ఇతర జూదాల నుండి రూ.3 వేలు వెరసి నిర్వాహకులకు రోజు ఆదాయం రూ.28 వేలు వస్తుందని చెబుతున్నారు. గోపవరపుగూడెంలో జరుగుతున్న జూదం నిర్వాహకులు రోజుకు రూ.40 వేలు దాకా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐదు వేల నుండి లక్ష రూపాయల వరకు పందెం కాస్తున్నారు. కోత ముక్కలో కొందరు చేతి వాటం ప్రదర్శిస్తున్నారనే వాదన వినిపిస్తోంది.

భోగి మంటల సందడి

- విశాఖలో గుర్రపు పందేలు
- నారావారిపల్లెలో బాబు కుటుంబం
- జాతరతో ఏలూరులో కానరాని సందడి
- ముమ్మరంగా ఆటల, ఎడ్ల పోటీలు
- గుంటూరులో మోడీ దిష్టిబొమ్మ దహనం



నారావారి పల్లెలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి యంత్రాంగం

సంక్రాంతి పండగ తొలిరోజైన సోమవారం భోగి మంటలు రాష్ట్ర వ్యాపితంగా వెలిగాయి. భోగి పండ్ల పూజ, గంగిరెద్దుల ప్రదర్శన, రంగవ ల్లులతో కూడి గొబ్బెమ్మలు హరిదాసుల సంకీర్తనలు, భోగి మంటలు, చిన్నారుల కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎడ్లపందేలు, ఆటలపోటీలు ప్రజలను ఆకట్టుకున్నాయి. భోగి రోజు చిన్నారులు అనేక ప్రాంతా ల్లో కోలాటం ప్రదర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో అనపర్తి ఎంఎల్ఎ నల్లమల్లి రామకృష్ణారెడ్డి భోగి మంటలను వెలిగించి, సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. గ్రామానికి చెందిన వెంకటరెడ్డి ఏర్పాటుచేసిన 58 అడుగుల వెడల్పు, 16 అడుగుల ఎత్తులో 38 టన్నుల కట్టెలను వెలిగించి భోగిమంటను ఏర్పాటు చేశారు. కాకినాడ రూరల్‌లోని ఇంద్రపాలెంలో డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యాన ముగ్గులు, పలు సాంస్కృతిక పోటీలను నిర్వహిం చారు. గాంధీనగర్‌లో స్థానిక కార్పొరేటర్, జనసేన వీర మహిళా నాయకురాలు శేషుకు మారి ఆధ్వర్యాన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. జనసేన జనబాట ఇన్‌ఛార్జి పంతం నానాజీ విజేతలకు బహుమతులం దించారు. ఎటపాక గుండాల కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఐద్వా నాయకురాలు ఐ.పద్మ మాట్లాడారు పశ్చిమగోదావరి జిలా ఏలూరు నగరంలో గంగానమ్మ జాతర నేపథ్యంలో అమ్మవారిని సాగనంపే వరకూ ఎటువంటి ఉత్సవాలూ, శుభకార్యాలూ చేయరు. దానిలో భాగంగా నగరంలో ఎక్కడా భోగి మంటలు కానరాలేదు. పడమరవీధి గంగానమ్మ జాతర నవంబర్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇది ఫిబ్రవరి 9, 10, 11వ తేదీల్లో జరిగే కార్యక్రమాలతో ముగుస్తుంది. అప్పటి వరకూ నగరంలో పెళ్లిళ్ళు, పండుగలు నిర్వహించరు. దీంతో నగరానికి కొత్త అల్లుళ్ల రాక సైతం తగ్గింది ఆకివీడులో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన చెడుగుడు రాష్ట్రస్థాయి, వాలీబాల్ రెండు జిల్లాలస్థాయి పోటీలను జిల్లా పరిషత్ ఉపాధ్యక్షు రాలు మన్నె లలితాదేవి, ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షులు బలరామ ప్రతాప్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ పోటీలు 15 నుంచి 17 వరకూ మూడు రోజులు నిర్వహించనున్నారు. జిల్లాలో పలుచోట్ల డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన పోటీలు నిర్వహిస్తున్నారు.నెల్లూరు జిల్లాలో కోవూరులోని కొత్తూరులో ఎడ్ల పందేలు నిర్వహించారు. ఈ పోటీల్లో గంగపట్నంకు చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. మనుబోలు హైస్కూల్లో సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు జరిగాయి నెల్లూరులో డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో పలుచోట్ల క్రికెట్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మరో రెండ్రోజులు పాటు ఈ పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్దల పండుగ సందర్భంగా బోడిగాడితోటలోని హిందూ శ్మశాన వాటికను నగర కార్పొరేషన్ అధికారులు శుభ్రం చేయించారు. విశాఖ సిటీ సింహాచలం దేవ స్థానం అనువంశిక ధర్మకర్త, మాజీ కేంద్ర మంత్రి పి.అశోక్‌గజపతిరాజు దంపతులు సింహగిరిపై భోగి మంటలను సంప్రదాయంగా ప్రారంభిం చారు. అనంతరం కొత్త పంటతో జావ చేసి అందరికీ పంపిణీ చేశారు. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు భోగి మంటల్లో పిడకలు వేశారు. పాత నగరం 25వ వార్డులోని శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విజయనగరం జిల్లాలో ప్రధానంగా కనుమ రోజు కోడి పందేలు ఎక్కువగా జరుగుతుంటాయి. కొత్తవలస, వేపాడ, ఎల్.కోట, ఎస్.కోటతోపాటు ఏజెన్సీ ప్రాంతాల్లోనూ కోడిపందాలకు ఏర్పాట్లు జరిగినట్లు తెలిసింది. గుమ్మలక్ష్మీపురం మండలం సరిహద్దు గ్రామమైన కేదారిపురంలో కోడి పందాలు ఆడుతున్న 11 మందిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఏడు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో భోగి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గుంటూ రులో అర్బన్ ఎస్పీ విజయరావు వేడుకల్లో పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కమిషనర్ శ్రీకేష్ లఠ్కర్ పాల్గొన్నారు. చెరుకుపల్లి, సత్తెనపల్లి, మంగళగిరి, బాపట్ల, తదితర మండలాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రంగవల్లులు, ఇతర పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

తెలుగు యువత ఆధ్వర్యంలో గుంటూరు లోని బృందావన్ గార్డెన్స్‌లో భోగి మంటల్లో ప్రధాని నరేంద్రమోడీ, బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా దిష్టిబొమ్మల చిత్ర ప్రతులను దహనం చేశారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు.

విశాఖ జిల్లా మునగపాక మండల కేంద్రంలో జిల్లాస్థాయి గుర్రాల పందేల పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, జనసేన నాయకులు సుందరపు విజయ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 10 గుర్రాలు పాల్గొన్నాయి. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గబ్బర్ సింగ్ గుర్రం ప్రథమ స్థానంలో నిలిచింది. పెద్దాపురం గుర్రం ద్వితీయ స్థానంలో నిలిచింది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత గ్రామం నారావారిపల్లిలో సంక్రాంతి పండగ సందర్భంగా బుధవారం వేకువజామున భోగి మంటలు వేశారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి, ఆయన కుమారుడు దేవాన్ష్ పాల్గొన్నారు. అనంతరం నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర జిల్లా ప్రజలకు మకర సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు బయల్దేరి వెళ్లారు. ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ రెండు రాష్ట్రాల ప్రజలకు భోగి, మకర సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు.



17న 'తెలుగు భాష- వాస్తవ చరిత్ర' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

ప్రాచీన శాసనాల ఆధారాలతో 'తెలుగు భాష - వాస్తవ చరిత్ర' అనే సంకలన గ్రంథాన్ని రాసినట్లు రచయిత, విశ్రాంత సహాయ వాణిజ్య పన్నుల అధికారి పివిఎల్ఎన్ రాజు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను రాసిన ఈ గ్రంథాన్ని జనవరి 17వ తేదీన విజయవాడ గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో సాయంత్రం 6 గంటలకు ఆవిష్కరిస్తామని చెప్పారు. ఈ పుస్తకాన్ని సినీ నటులు కౌశిక్‌బాబు ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

యువతి కిడ్నాప్‌కు యత్నం

ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)

ఇంటి ముందు ముగ్గు వేస్తున్న యువతిని కిడ్నాప్ చేయబోయిన ఇద్దరు యువకులకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సోమవారం గుంటూరు జిల్లా బాపట్లలో కలకలం సృష్టించిన ఘటనపై పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కాకుమాను గోపినాథ్, జిలకర కమలాకర్ స్థానిక ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తుంటారు. పట్టణంలోనే కోళ్ళపూడి వారివీధికి చెందిన యువతి ఎంబిఎ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా బెంగుళూరులోని తమ బంధువుల ఇంట్లో ఉంటోంది. సోమవారం తెల్లవారుజామున ఇంటి ఎదుట ముగ్గు వేస్తుండగా గోపినాథ్, కమలాకర్ అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చి యువతిని బలవంతంగా తీసుకెళ్లేందుకు యత్నించారు. గమనించిన స్థానికులు యువకులకు దేహశుద్ధి చేయడంతోపాటు పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గంజాయి నిందితుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం క్రైం

గంజాయి కేసులో పట్టుబడ్డ ఓ నిందితుడు సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. గామన్ బ్రిడ్జి వద్ద ఓ వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను బొమ్మూరు పోలీసులు ఆదివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఒకరిని రాజానగరం పోలీస్ స్టేషన్‌కు, నడింపల్లి సీతారామరాజును బొమ్మూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోమవారం తెల్లవారుజామున స్టేషన్‌లో సీతారామరాజు ఒక పదునైన ఆయుధంతో పీక కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

సేద్యపు విభాగంలో మెట్లపల్లి జతకు ప్రథమస్థానం

ప్రజాశక్తి - గుడివాడ

ఎన్‌టిఆర్ 2 వైఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా గుడివాడలో జరుగుతున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు ప్రదర్శన సోమవారానికి నాల్గో రోజుకు చేరుకుంది. బండలాగుడు పోటీలలో సేద్యపు విభాగంలో పోటీలు జరిగాయి.

సేద్యపు విభాగంలో కృష్ణాజిల్లా గన్నవరం మండలం మెట్లపల్లికి చెందిన చలకపాటి రాజీవ్ ఎడ్ల జత 5138.1అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం, గుంటూరు జిల్లా కారంపూడి మండలం గాదేవారిపల్లెకు చెందిన వెదురుకూరి లక్ష్మారెడ్డి ఎడ్ల జత 4888.6 అడుగుల దూరంతో ద్వితీయ స్థానం, ఘంటసాల మండలం ఘంటసాలపాలేనికి చెందిన మేకా కృష్ణమోహన్, వేమూరి మౌర్యచంద్రలకు చెందిన ఎడ్లజతలు 4727.3అడుగుల దూరంతో తృతీయ స్థానం, ఘంటసాల మండలం దాలిపర్రుకు చెందిన శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఎడ్లజత 4686.11 అడుగుల దూరంతో నాల్గో స్థానం, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవలూరుకు చెందిన బి.ఎన్.ఆర్ నంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్‌కు చెందిన ఎడ్ల జత 4525.20 అడుగుల దూరంతో ఐదో స్థానం, ఘంటసాల మండలం దాలిపర్రుకు చెందిన శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఎడ్లజత 4500 అడుగుల దూరంతో ఆరో స్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలేనికి చెందిన శ్రీవిజయలక్ష్మీ నంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్‌కు చెందిన ఎడ్ల జత 4437.6అడుగుల దూరంతో ఏడో స్థానం, గుంటూరు జిల్లా రెంటచింతల మండలం తుమ్మకోటకు చెందిన ఎన్.వి.ఆర్ నంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్ నెల్లూరి జయకృష్ణచౌదరి ఎడ్లజత 4343.9 అడుగుల దూరంతో 8వ స్థానం, పెనమలూరు మండలం కానూరుకు చెందిన పసుపులేటి సాంబయ్యకు చెందిన ఎడ్ల జత 4304.9అడుగుల దూరంతో 9వ స్థానం సాధించింది.



ప్రథమస్థానంలో నిలిచిన గన్నవరం జత

'బొమ్మరిల్లు' ఆస్తులు వేలానికి ఏర్పాట్లు

- న్యాయస్థానం ఆదేశాలు జారీ
- డిపాజిట్‌దార్లకు సమాన నిష్పత్తిలో పంపిణీ
- సిఐడి సిఐ ఎం.బుచ్చిరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ



విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు ఉత్తర్వుల మేరకు ఉత్తరాంధ్రలోని బొమ్మరిల్లు ఆస్తులను వేలం వేయనున్నామని సిఐడి సిఐ మనుకోటి బుచ్చిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర్వుల ప్రకారం... 2010లో బొమ్మరిల్లు ఫామ్స్ అండ్ విల్లాస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్‌ను హైదరాబాద్‌లో స్థాపించిన సంస్థ డైరెక్టర్లు 19 బ్రాంచ్‌ల ద్వారా ప్రజల నుంచి రూ.95.11 కోట్లు డిపాజిట్లు సేకరించారు. డైరెక్టర్లు రూ.47.67 కోట్లు స్వాహా చేసి, సుమారు 45 వేల మంది డిపాజిట్‌దారులను మోసం చేశారు. 2014లో ఖాతాదారుల ఫిర్యాదుపై రాష్ట్ర వ్యాప్తంగా ఏడు కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వం ఈ కేసులను సిఐడికి బదలాయించింది. దర్యాప్తు అనంతరం నిందితులుగా డైరెక్టర్లను, బాధ్యులైన వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. సంస్థకు సంబంధించిన స్థిర, చరాస్తులను ప్రభుత్వం పలు జిఒల ద్వారా అటాచ్ చేసింది. ఈ ఆస్తులను వేలం వేసి, డిపాజిట్‌దారులకు సమాన నిష్పత్తిలో జమ చేయాలని ఈ నెల 11న న్యాయస్థానం సిఐడికి ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అటాచ్ చేసిన 153 ఎకరాల భూమిని, సుమారు 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంగల ప్లాట్లను బహిరంగ వేలం వేయనున్నారు. శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం డోల గోవిందపురంలోని 93 ఎకరాలు, వజ్రపుకొత్తూరు మండలం పూండీ వద్ద గల కళింగరాజ్యం లేఅవుట్‌లోని స్థలాలు, సీతంపేట మండలం పులిపుట్టి వద్ద 25 ఎకరాల భూమి, విజయనగరం జిల్లా ఎస్.కోట వద్ద కొత్తబంగారులోకం లేఅవుట్ స్థలాలు, కొత్తవలసలోని సంస్కృతి గార్డెన్ లేఅవుట్ స్థలాలు, డెంకాడ మండల కేంద్రంలో 49 ఎకరాల భూమిని బహిరంగ వేలం వేయనున్నారు. బహిరంగ వేలానికి సంబంధించి జిల్లాల వారీగా తేదీలు ఖరారు చేస్తామని ఈ ప్రకటనలో సిఐ పేర్కొన్నారు. వీటితోపాటు ప్రభుత్వం అటాచ్ చేసిన మరికొన్ని భూములు కూడా న్యాయస్థానం పరిశీలనలో ఉన్నాయని, కోర్టు తీర్పునకు అనుగుణంగా వాటికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువకుడి ఘాతుకంతో యువతి మృతి

ప్రజాశక్తి- రాయదుర్గం రూరల్

ఓ యువకుడు తన కామవాంఛ తీర్చమని ఓ యువతిపై ఒత్తిడి చేయగా ఆమె తిరస్కరించింది. ఈ విషయాన్ని గ్రామంలో అందరికీ చెబుతుందని భయపడిన యువకుడు ఆమెకు బలవంతంగా పురుగుల మందు తాగించిన సంఘటన ఈ నెల 8న అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం నాగలాపురంలో చోటుచేసుకోంది. బాధితురాలు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... డి.హీరేహాళ్ మండలం నాగలాపురం గ్రామానికి చెందిన యశోద (19) పొలంలో వ్యవసాయ పనులు చేసు కుంటుండగా అదే గ్రామానికి చెందిన శివకుమార్ తన కోరిక తీర్చమని వేధించసాగాడు. ఆమె తిరస్కరించింది. ఈ విషయం గ్రామంలో చెబుతుందని భయపడిన శివకుమార్ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందును బలవంతంగా తాగించాడు. పక్క పొలాల్లో పని చేసుకుంటున్న రైతులు కొందరు ఈ విషయాన్ని గమనించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలికి చేరుకొని ఆమెను చికిత్స నిమిత్తం కర్నాటక లోని బళ్లారి విమ్స్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందింది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎపి నిట్ వర్క్‌షాప్ ప్రారంభం

వచ్చే ఏడాదికి సొంత భవనాల్లో తరగతులు

ప్రజాశక్తి-తాడేపల్లిగూడెం

దేశంలోని 31 జాతీయ సాంకేతిక విద్యాలయాల్లో ఎపి నిట్‌ను ప్రథమ స్థానంలో నిలుపుతామని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యం చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఎపి నిట్ ప్రాంగణంలో తొలి దశలో రూ.206 కోట్లతో నిర్మించిన వర్క్ షాప్ కాంప్లెక్స్, ఎస్టేట్ ఆఫీస్‌లను ఆయన సోమవారం ప్రారంభించారు. ఫేజ్-1బిలో భాగంగా రూ.174 కోట్లతో తరగతి గదులు, అకడమిక్ బిల్డింగ్, డైరెక్టర్ భవనం, వసతి గృహాలకు ఆయన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిట్ ప్రాజెక్టు నమూనాను పరిశీలించి, నిర్మాణాలు, మౌలిక వసతులు అందే విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీతో తాడేపల్లిగూడెంలోని ఎపి నిట్ భవనాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. దీని నిర్మాణం పూర్తయితే దేశంలోని జాతీయ సాంకేతిక విద్యాలయాల కన్నా ఎపి నిట్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దుతామన్నారు. దేశంలోని మిగిలిన నిట్‌లతో పోల్చుకుంటే ఎపి నిట్‌లో నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి సుమారు రెండు వేల మంది విద్యార్థులకు సొంత భవనాల్లో తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి నిట్ డైరెక్టర్ సి.సూర్యప్రకాశరావు, వరంగల్ నిట్ డైరెక్టర్ ఎన్.వి.రమణారావు, ప్రముఖులు పాల్గొన్నారు.

పాడి రైతుల వల్లే 'హెరిటేజ్' ఫస్ట్

సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-చంద్రగిరి



పాల ఉత్పత్తులలో హెరిటేజ్ ప్రథమ స్థానంలో ఉందని, ఇదంతా పాడిరైతులు అందిస్తున్న ప్రోత్సాహమేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. చంద్రగిరి సమీపంలోని కాకిపెంట్లహెరిటేజ్ సంస్థలో సోమవారం ఈటిబి ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థ ఛైర్మన్ నారా భువనేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దేశంలో 10 లక్షల మంది వినియోగదారులకు హెరిటేజ్ పాల పదార్థాలను అందజేస్తున్నామన్నారు. 3 లక్షల మంది రైతుల నుంచి పాలు సేకరించి 15 రోజులకు ఒకసారి వారికి డబ్బులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంతోమంది మాపైన బురద చల్లాలని ప్రయత్నించారని, వారి మీదే బురద పడిందన్న విషయం గుర్తించాలని అన్నారు. పండ్ల తోటల ఆదాయంలో చిత్తూరు జిల్లా 2వ స్థానంలో ఉందన్నారు. ప్రపంచం మొత్తంలో ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయని, ప్రజలు ఎక్కువగా పండ్లు, కూరగాయలను తింటున్నారన్నారు. 11 శాతం వ్యవసా యంలో అభివద్ధి సాధించామని రాష్ట్రంలో రైతులు ప్రభుత్వానికి చాలా సహకారాన్ని అందిస్తున్నారన్నారు. అమరావతిలో రాజధాని నిర్మాణం కోసం రైతులు 34 వేల ఎకరాలను ఇచ్చినట్లు గుర్తు చేశారు. సంక్రాంతి సందర్భంగా రైతులందరికీ శుభాకాంక్షలను తెలిపారు. టెక్నాలజీ వచ్చాక త్వరితగతిన అన్నీ ఆన్‌లైన్‌లోనే చేసుకుని ముందుకెళుతున్నామన్నారు. హెరిటేజ్ ఫుడ్ లిమిటెడ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెరిటేజ్ సంస్థకు రావడంతో ఉద్యోగులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని చంద్రన్న సంక్రాంతి కానుక అందజేస్తున్నామని తెలిపారు. పలువురు టిడిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్ పులివర్తి నాని, మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమ ణ్యం నాయుడు, ఎంపిటిసి గౌస్ బాష తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అధికారం కోసం ఎందాకైనా...

రానున్న సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తపర్చి కర్తవ్య బోధ చేసేందుకు ఢిల్లీ వేదికగా శుక్ర, శని వారాల్లో నిర్వహించిన బిజెపి జాతీయ సమ్మేళనం తమ నాలుగున్నరేళ్ల ఏలుబడి మూటగట్టుకున్న వైఫల్యాలను కప్పెట్టింది. తిరిగి అధికారం కోసం ఎంతకైనా బరితెగించాలని దిశా నిర్దేశం చేసింది. అధికార పార్టీ ఎన్నికలను ఎలా ఎదుర్కొంటుందోనన్న ఉత్సుకత అందరినీ ఆ వైపునకు దృష్టి సారింపజేసింది. ప్రభుత్వ నాయకుడు ప్రధాని మోడీ, అధికార పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా ఇరువురూ రెండు రోజుల్లో చేసిన ప్రసంగాల్లో సర్కారు సాధించిన విజయాలు, వాటితో జనబాహుళ్యానికి చేకూరిన మేలు రేఖామాత్రమైనా పేర్కొనలేదు. హామీల ఉల్లంఘనపై ప్రాయశ్చిత్తమూ పడలేదు. తమకు నరేంద్ర మోడీ రూపంలో పెద్ద నాయకుడున్నారని ప్రతిపక్షాల మహా కూటమికి నాయకుడెవరో తెలీదని పాత పాటే పాడారు. తామైతే బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని, విపక్ష కూటమి బలహీనమైన సర్కారును నెలకొల్పుతుందని తాడూ బొంగరం లేని విమర్శలు వండి వార్చారు. మొత్తమ్మీద సమగ్రాభివృద్ధి దిశగా సుస్థిర ప్రభుత్వాన్ని తామే అందిస్తామని ఇద్దరు ప్రముఖులూ వీపులు చరుచుకున్నారు. అవినీతి మచ్చ పడని తమ సర్కారును దించేందుకు అవినీతి పరులందరూ ఏకమవుతున్నారని విపక్షాలను షరామామూలే అన్నట్లు తూలనాడారు. ఏతావాతా బిజెపి సమ్మేళనంలో అగ్ర నాయకులు ఆత్మవిమర్శ జోలికి పోకుండా కేవలం పరనిందకు తమ శక్తియుక్తులను వెచ్చించారు. కాగా తమకు ఎదురే లేదంటున్న బిజెపి నేతలది మేకపోతు గాంభీర్యమేనని వారి మాటల్లో తెలుస్తుంది.

తమ పాలనను ప్రస్తుతిస్తూ సమ్మేళనంలో బిజెపి నాయకులు చేసిన ప్రసంగాలు వారి పార్టీ శ్రేణుల్లో ఎంత ఉత్సాహం నింపాయో తెలీదుకాని 'సబ్ కా సాథ్ సబ్‌కా వికాస్' 'అచ్చే దిన్' వంటి హామీలు వాస్తవంలో అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు తప్ప ప్రజలకు కాదని నిర్ధారణ అయింది. యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు గాలిలో ఉన్నాయి. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్, డిజిటల్ ఇండియా వంటివి వాగాడంబరానికి పనికొచ్చాయి. నల్లధనం వెలికి తీసి ప్రజల బ్యాంక్ ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున వేస్తామన్న వాగ్దానం ఏ మూలన నక్కిందో తెలీదు. రైతుల ఆదాయాల రెట్టింపు, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు పెద్ద ఫార్స్. వీటన్నింటినీ తలదన్నేది పెద్ద నోట్ల రద్దు వ్యవహారం. నోట్ల రద్దు వలన కార్మికులు, కర్షకులు, చిన్న ఉత్పత్తిదారులు ఆర్థికంగా సర్వనాశనమయ్యారు. నోట్ల రద్దు వలన ఒనగూరతాయన్న ప్రభుత్వ లక్ష్యాలు వమ్మయ్యాయి. ఆదరాబాదరగా ప్రవేశపెట్టిన వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) చిన్న పరిశ్రమలు, వర్తకుల మనుగడకు శరాఘాతమైంది. పారిశ్రామిక రంగం, అందులోనూ తయారీ రంగం కుదేలైంది. పెట్రో ఛార్జీల పెంపు ప్రజల గోళ్లూడగొడుతోంది. రాఫెల్, బ్యాంక్ కుంభకోణాలు ఉండనే ఉన్నాయి. వ్యవస్థల ధ్వంసం, సిబిఐలో పరిణామాలు ప్రభుత్వ రాజకీయ జోక్యానికి పరాకాష్ట. ఈ వైఫల్యాలను, వైపరీత్యాలను బిజెపి సమ్మేళనంలో మాట మాత్రం చర్చించలేదు. వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభాలకు, నిరుద్యోగం తాండవించగానికి, క్రోనీ కేపిటలిజం వేళ్లూనుకోడానికి, అవినీతి పెచ్చరిల్లడానికి కారణమైన ఆర్థిక విధానాలపై కించిత్తు పునరాలోచన చేయలేదు.

ఓట్ల కోసం ప్రజల్లో చీలికలు పెట్టే హిందూత్వ సిద్ధాంతానికి బిజెపి సమ్మేళనం బాగా సాన పెట్టింది. ఎన్నికలను పానిపట్ యుద్ధంగా నేతలు అభివర్ణించారు. ఆ యుద్ధంలో ఓటమి వలన దేశం పరాయి పాలనలోకి వెళ్లిందంటూ ఇప్పుడు కూడా బిజెపిని గెలిపించకపోతే అంతేనని జాతీయత ముసుగులో మతపు విష బీజాలు నాటింది. అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని తాము కోరుకుంటుండగా కాంగ్రెస్, విపక్షాలు అడ్డు పడుతున్నాయని రెచ్చగొట్టింది. ఉగ్రవాద నిరోధానికి బుల్లెట్‌ను బుల్లెట్‌తోనే ఎదుర్కోవాలంటూ కాశ్మీర్ సమస్యను వివాదాస్పదం చేసింది. అంతగా ప్రాధాన్యత లేని అగ్రవర్ణాల పేదలకు పది శాతం రిజర్వేషన్ల అంశాన్ని సైతం ఓట్లకు ముడిపెట్టింది. మళ్లీ బిజెపి వస్తే కేరళ సహా దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని అధికారంలోకి తెస్తామని తమ కుటిలత్వాన్ని చాటింది. గత ఎన్నికల సమయాన ఎన్‌డిఎలో 28 పార్టీలుండగా ఈ కాలంలో టిడిపితో సహా 16 పార్టీలు బయటికొచ్చాయి. నాడు బిజెపి స్వంతంగా 282 సీట్లు గెలవగా వివిధ ఉప ఎన్నికల్లో పరాజయాల దరిమిలా పార్టీ బలం 270కి పడిపోయింది. కర్నాటకలో పప్పులు ఉడకలేదు. ఇటీవలి ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఘోరంగా భంగపడింది. యూపి, మహారాష్ట్ర సహా ఇతర బిజెపి పాలిత రాష్ట్రాలు ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయి. ఇన్ని ప్రతికూల సంకేతాలు కానవస్తున్నా వాటిని లక్ష్యపెట్టకుండా మళ్లీ తమదే గెలుపు అని మోడీ, షా ద్వయం ప్రకటించిన తీరు చూస్తుంటే వారిది ప్రచారార్భాటంతో ప్రజలను బురిడీ కొట్టించవచ్చన్న అతి విశ్వాసమా? లేక ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే కుట్రలేమైనా దాగున్నాయా అన్న సందేహం తలెత్తుతోంది. తన అధీనంలోని నిఘా సంస్థలకు ప్రజలందరి వ్యక్తిగత సమాచారం సేకరించే హక్కు ఇస్తూ జారీ చేసిన ఆదేశాలు ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ఈ దేశంలో ప్రజాస్వామ్యశక్తులు సరైన చైతన్యాన్ని ప్రదర్శించి తమ చేవను మరోమారు రుజువు చేసుకుంటాయని ఆశిద్దాం.

ఇదీ విషయం




తెలుగువాకిళ్ల నేదెస విలోకించినను
కలయంపిజల్లు కన్నెలు కానుపించేరు
సిగలలో బంతులను చేమంతులను నిల్పి
జలతారుటంచు వల్వలు సొగసుగా దాల్చి
నెలతలీ సంక్రాంతి తెలుగుపండుగ నాడు
నడయాడు గొబ్బిదేవతలె యనిపించేరు

- సినారే

విశ్లేషణ

రిజర్వేషన్లు సరే - ఉద్యోగాలెక్కడ?

మరో నాలుగు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తమవుతున్న తరుణంలో ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపికి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. బిజెపికి బలమైన మూడు రాష్ట్రాల్లో ఓటమి చెందటంతో ఆందోళన చెందిన మోడీ బృందం వెంటనే నష్ట నివారణ చర్యలకు పూనుకున్నది. 2019 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతూ పార్లమెంటు సమావేశాల చివరి రోజున అకస్మాత్తుగా, హడావుడిగా అగ్ర వర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టింది. మోడీ ప్రభుత్వ ఉద్దేశాలు, లక్ష్యాలు ఏమైనప్పటికీ ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రాధాన్యత కల్పించాలి అనడంలో ఎవరికీ భిన్నాభిప్రాయం లేకపోవటంతో బిల్లు ఆమోదం పొందింది. అయితే మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ చట్టం రాజ్యాంగ పరీక్షకు, న్యాయ సమీక్షకు ఎంతవరకు నిలబడుతుంది? ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని ఆమోదిస్తాయి? దీన్ని అమలు చేయడంలో రాజకీయ పార్టీలకు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిది? అన్న అంశం కాలగమనంలోనే తెలుతుంది.




జె ప్రభాకర్

ప్రేమ ప్రజల మీదనా? వారి ఓట్ల మీదనా?

మండల్ కమిషన్ సమయం నుండి అగ్ర కులాల రిజర్వేషన్లపై చర్చలు సాగుతూనే ఉన్నాయి. అడపాదడపా కొన్ని ప్రయత్నాలు కూడా జరిగాయి. అయితే సుప్రీం కోర్టు ఆ ప్రయత్నాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం అని ప్రకటించడంతో ఆచరణ రూపం దాల్చలేదు. ఏ తరగతికైనా రిజర్వేషన్లు కల్పించాలి అంటే దానికి సంబంధించిన శాస్త్రీయ అధ్యయనం జరగాలి. ఉదాహరణకు గిరిజనులు, దళితులు, బీసీలకు వారి జనాభా నిష్పత్తి ఆధారంగా రిజర్వేషన్లు కల్పించారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు నిర్ణయించడానికి ఏ శాస్త్రీయ ప్రతిపాదిక లేదు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల్లో ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల వారు ఎంతమంది ఉన్నారనే లెక్కలు కూడా ప్రభుత్వం దగ్గర లేవు. ఇవేమీ చేయకుండా కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలను మోసగించడానికే ఈ రిజర్వేషన్ తీసుకువచ్చారు.

ఈ చట్టం ద్వారా అగ్రకుల పేదలు, మధ్య తరగతిపై తమకు అమితమైన ప్రేమ ఉందని ప్రభుత్వం వారిని నమ్మించే ప్రయత్నం చేస్తున్నది. రానున్న ఎన్నికల్లో తమ ఓటు బ్యాంకును పెంచుకోవడమే అసలు ఈ చట్టం వెనుక ఉద్దేశం. ఆర్థిక వెనుకబాటుకు కేంద్రం చెప్పిన నిర్వచనం ఈ విషయాన్ని రుజువు చేస్తుంది. రూ.8 లక్షల లోపు సంవత్సర ఆదాయం, ఐదెకరాలలోపు భూమి ఉన్న కుటుంబాలను ఆర్థికంగా వెనుకబడిన పేదలుగా గుర్తిస్తారు. సంవత్సరానికి కుటుంబ ఆదాయం రూ.8 లక్షలంటే నెలకు రూ.66,666 ఆదాయం వచ్చిన కుటుంబాలు పేద కుటుంబాలే. వారందరికీ రిజర్వేషన్ల అర్హత ఉంటుంది. 'నేషనల్ శాంపిల్ సర్వే నివేదిక' (2011-12) ప్రకారం దేశంలోని 95 శాతం కుటుంబాల నెలసరి ఆదాయం రూ.23,375. 99 శాతం కుటుంబాల నెలసరి ఆదాయం రూ.48,833. అంటే సుమారు ఒక శాతం కంటే తక్కువకాగా, మినహా మిగిలిన వారందరూ రిజర్వేషన్లకు అర్హులే. దేశంలో 99 శాతం ప్రజలు రిజర్వేషన్లకు అర్హత పొందితే, మరి వారికి 10 శాతం రిజర్వేషన్ కేటాయించడంలో ఉన్న ఆంతర్యమేమిటో పాలకులే సెలవివ్వాలి. అదేవిధంగా మన దేశంలో 86 శాతం మంది రైతులు ఐదెకరాలలోపు ఉన్నవారే. వీరిలో కూడా సారవంతమైన భూములు కలిగినవారు, కరువు ప్రాంతాల వారు, మెట్ట, మాగాణి అందర్నీ ఒకే గాటన కట్టడం ఏవిధంగా సబబు? ఒక వైపు సంవత్సరానికి రూ.27,000 కంటే తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలను మాత్రమే బిపిఎల్ కింద గుర్తిస్తున్నారు. మన రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించాలంటే కుటుంబ వార్షికాదాయం రూ.75,000 లోపు మాత్రమే ఉండాలి.

రిజర్వేషన్లకు రూ.8 లక్షలు పరిధి విధించిన మోడీ ప్రభుత్వం ఇన్‌కమ్‌టాక్స్ మినహాయింపు మాత్రం రూ.2.5 లక్షలకే పరిమితి విధించింది. నిజంగా పేద, మధ్యతరగతి ప్రజలపై మోడీ ప్రభుత్వానికి ప్రేమ ఉంటే ఇన్‌కమ్‌టాక్స్ మినహాయింపును రూ.8 లక్షలకు పెంచాలి. మరో వైపు నెలకు కనీస వేతనం రూ.18,000 ఉండాలన్న కార్మికుల డిమాండ్‌ను మోడీ ప్రభుత్వం తిరస్కరించింది. వేగంగా విస్తరిస్తున్న ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్లను సైతం లెక్కచేయడం లేదు. ఇవన్నీ గమనిస్తే బిజెపి ప్రభుత్వానికి ప్రజలపై ప్రేమ కన్నా వారి ఓట్లపైనే ఎక్కువ ప్రేమ ఉన్నట్లు కనపడుతోంది.



ప్రజల ఆర్థిక స్థితిని మార్చే విధానాలు అమలు జరపకుండా ఏదో కంటితుడుపుగా చేపట్టే తాత్కాలిక ఉపశమనాలు వారిని దారిద్ర్యం నుండి బయట పడేయలేవు. రిజర్వేషన్లు వచ్చాయని సంబరపడిపోవడం కంటే ఆ రిజర్వేషన్లు అమలు జరగాలంటే ఉండాల్సిన ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలి, ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేయాలి. వీటి సాధనకు యువత ప్రభుత్వాలను, పార్టీలను నిలదీయాలి. నూతన రాజకీయ ప్రత్యామ్నాయ విధానాలతోనే నేటి పరిస్థితిని మార్చగలం. అప్పుడే దేశ భవిష్యత్తు మారుతుంది. యువత ఆశయాలు నెరవేరతాయి.

రిజర్వేషన్ల వల్ల దక్కేది ఎంత?

ఏదేమైనా తమకు రిజర్వేషన్లు దక్కాయని అగ్రకులాల యువత సంతోషపడవచ్చు. కానీ వీటివల్ల నిజంగా వారికి లభించే ప్రయోజనం ఏపాటిది? వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మార్చేంత చేయూత ఈ రిజర్వేషన్లు అందిస్తాయా? రిజర్వేషన్లు ప్రభుత్వ రంగంలోనే అమలౌతున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు అమలు చేయాలని నిబంధనలు ఉన్నా వాటిని అమలు చేయకుండా కోర్టుల్లో పిటీషన్లు వేశాయి. గత 28 ఏళ్ల గా దేశంలో అమలు చేస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాల నేపథ్యంలో రోజురోజుకూ ప్రభుత్వ రంగం కుంచించుకు పోవడం వలన ఉద్యోగాలు తగ్గి పోతున్నాయి. సాక్షాత్తు ప్రభుత్వాలే ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రభుత్వ విద్య కనుమరుగవుతుంటే కార్పొరేట్ విద్య అగ్రస్థానాన్ని ఆక్రమిస్తోంది. 'ఆలిండియా సర్వే ఆఫ్ ఇండియా హయ్యర్ ఎడ్యుకేషన్ నివేదిక' (2017-18) ప్రకారం దేశంలో ఉన్న ఉన్నత విద్యాసంస్థల్లో 70 శాతం వాటా ప్రైవేటు సంస్థలదే. మన రాష్ట్రంలో రేషనలైజేషన్ పేరుతో సుమారు 6 వేల పాఠశాలలు, 400లకు పైగా ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ళు మూసివేశారు. మరోవైపు ప్రభుత్వ రంగ పరిశ్రమలు మూతబడటం లేదా కార్పొరేట్ కంపెనీల హస్తగతమవుతున్నాయి. గతేడాది ఎస్‌బిఐ విలీనం వలన దేశంలో 1500 నుండి 1600 వరకు స్టేట్‌బ్యాంక్ బ్రాంచీలు మూత బడ్డాయి. ఆ మేరకు ఉద్యోగాలు తగ్గిపోయాయి. వేగంగా విస్తరిస్తున్న ప్రైవేటు రంగం రిజర్వేషన్లను పాటించాల్సిన సామాజిక అవసరం తమకు లేదంటూ ప్రకటిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, పరిశ్రమలు మూసివేస్తూ మరోవైపు రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చట్టాలు చేయడం వల్ల ఒనగూరేది ఏంటి?

ఓట్లకు గాలం - ఉద్యోగాలకు మంగళం

తాము అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014 ఎన్నికల్లో వాగ్దానం చేసిన నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో గానీ, బాబు వస్తే జాబు వస్తుందని ప్రచారం చేసిన చంద్రబాబు ప్రభుత్వ హయాంలో గానీ చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పించిన పాపాన పోలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేయకుండా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిని ప్రవేశపెట్టాయి. దేశంలో సుమారు 25 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవి భర్తీకి నోచుకోవడంలేదు. రాష్ట్ర విభజన నాటికి ఆంధ్రప్రదేశ్‌లో కమల్‌నాథ్ కమిటీ నివేదిక ప్రకారం 1,42,827 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ కాలంలో సుమారు 60 వేల మంది రిటైర్ అయ్యారు. ఇవేవీ భర్తీకి నోచుకోలేదు. మరోవైపు రాష్ట్రంలోని వివిధ పరిశ్రమల మూత, యాంత్రీకరణల వల్ల సుమారు 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గాయి. ఉన్న ఖాళీలనే భర్తీ చేయకుండా, కేవలం కాగితాల్లో రిజర్వేషన్లు కల్పిస్తే మాత్రం ప్రయోజనం ఏమిటి అన్నది ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. కేంద్రంలో, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అవే సరళీకరణ విధానాలను అమలు పరుస్తూ ప్రైవేటీకరణ జపం చేస్తున్నాయి. ఉన్న ఖాళీలను భర్తీ చేసే విధానం ఏ పార్టీ వద్దా లేదు. ఫలితంగా ఉద్యోగాల కల్పన కేవలం ఎన్నికల నినాదంగానే మారిపోయింది.

ఈ నాలుగేళ్ళలో మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమైంది. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగ సమస్య వల్ల యువత తీవ్ర అసంతృప్తితో ఉంది. వారి అసంతృప్తిని పక్కదారి పట్టించి తమ ఓటు బ్యాంకుగా మార్చుకోవాలన్న బిజెపి ఎన్నికల ఎత్తుగడల్లో భాగంగానే ఈ రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చింది. తమ ఓట్లను కాపాడుకోవాలనే మిగిలిన అన్ని పార్టీలు దీనికి ఆమోద ముద్ర వేశాయి. నిజానికి పేద ప్రజలను ఉద్ధరించే ఆలోచన ఈ పార్టీలకు లేదు, వాటి విధానాల వల్ల అది సాధ్యం కూడా కాదు. ప్రజల ఆర్థిక స్థితిని మార్చే విధానాలు అమలు జరపకుండా ఏదో కంటితుడుపుగా చేపట్టే తాత్కాలిక ఉపశమనాలు వారిని దారిద్ర్యం నుండి బయట పడేయలేవు. రిజర్వేషన్లు వచ్చాయని సంబర పడిపోవడం కంటే ఆ రిజర్వేషన్లు అమలు జరగాలంటే ఉండాల్సిన ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలి, ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేయాలి. వీటి సాధనకు యువత ప్రభుత్వాలను, పార్టీలను నిలదీయాలి. నూతన రాజకీయ ప్రత్యామ్నాయ విధానాలతోనే నేటి పరిస్థితిని మార్చగలం. అప్పుడే దేశ భవిష్యత్తు మారుతుంది. యువత ఆశయాలు నెరవేరతాయి. ఎన్నికల నినాదాలకు మోసపోకుండా అందరికీ ఉచిత విద్య, ప్రభుత్వ రంగాన్ని బలపర్చడం వంటి విధానాలతో తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే నూతన రాజకీయ ప్రత్యామ్నాయ విధానాలకు రానున్న ఎన్నికల్లో మద్దతు తెలపటమే యువత ముందున్న కర్తవ్యం.

సందర్భం

శ్రామిక నాయకురాలు

జి ప్రియాంక

రోజా లగ్జంబర్గ్... ఈమె పేరు వినగానే యావత్ ప్రపంచం గుర్తు తెచ్చుకునేది అంతర్జాతీయ మహిళా దినోత్సవం. కానీ రోజా లగ్జంబర్గ్ లాంటి గొప్పవారిని మహిళా దినోత్సవానికి మాత్రమే పరిమితం చేయటం అంటే వాస్తవాలను వెలికి తీయకపోవడమే అవుతుంది. హిట్లర్ గడ్డ జర్మనీపై ఎర్రజెండాను రెపరెప లాడించిన వీర వనిత రోజా లగ్జంబర్గ్. యావత్తు ప్రపంచం మొదటి ప్రపంచ యుద్ధానికి సిద్ధమవుతున్న రోజుల్లో ధైర్యంగా ఆ యుద్ధాన్ని వ్యతిరేకించిన ధీర వనిత ఈమె. యుద్ధ కాలంలో కార్మిక మహిళలను ఉద్యోగాల నుండి తొలగించటమే నిరుద్యోగ సమస్యకు పరిష్కారమని భావిస్తున్న రోజుల్లో మహిళా కార్మికుల ఉపాధి కోసం గొంతు విప్పిన శ్రామిక నాయకురాలు ఈమె.

మార్చి 5వ తేదీ 1871వ సంవత్సరం లో దిగువ మధ్యతరగతి కుటుంబంలో 5వ సంతానంగా పోలాండ్‌లో జన్మించారు. న్యాయ శాస్త్ర విద్యను, రాజకీయ అర్థశాస్త్రం అభ్యసించి, 1898వ సంవత్సరంలో డాక్టరేట్ పొందారు.

పారిస్ కమ్యూన్ ఓడిపోయిన తరువాత జర్మనీ కేంద్రంగా అంతర్జాతీయంగా కార్మిక ఉద్యమాలు వెల్లువెత్తిన రోజులవి. రోజా లగ్జంబర్గ్, క్లారా జెట్కిన్ వంటి మహిళా నేతలు శ్రామిక మహిళా సంఘాలను నడిపిన నాటి సంగతులవి. అప్పటికి జర్మనీలో బూర్జువాలు, భూస్వాముల ప్రయోజనాలు కాపాడేటటువంటి ప్రభుత్వాలు ఉన్న రోజులు. కమ్యూనిస్టుల పట్ల పరిమితులు విధించిన రోజులు. క్రమేపీ 1950వ సంవత్సరం వచ్చే నాటికి కార్మిక సంఘా లంటే వేతన పోరాటాలకు, రాజకీయాలంటే ఓటు వేయడానికే పరిమితమై పోయిన పరిస్థితుల్లో క్లారా జెట్కిన్, రోజా లగ్జంబర్గ్ వంటి వారు నిజమైనటువంటి కార్మిక పోరాటాల దిశగా పయనించాల్సిన అవసరం ఉందని నొక్కివక్కాణించారు. పార్టీ పద్ధతులకు లోబడి మహిళలను సంఘటితం చేయడంలో వీరిరువురూ తలమునకలయ్యా రు. శ్రామిక మహిళలు సంఘాలుగా ఏర్పడటానికి నిషేధం ఉన్నప్పటికీ వీరి చొరవతో శ్రామిక మహిళా సంఘాలు ఏర్పడటమే కాకుండా కార్మిక సంఘంలో మహిళల సభ్యత్వ సంఖ్య ఊహించని విధంగా పెరిగింది. శ్రామిక మహిళల సమస్యలను చేపట్టేందుకు ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. వారు మహిళలకు పని హక్కు కోసం, సమాన వేతనం కోసం, వేతనంతో కూడిన ప్రసూతి సెలవు కోసం, ఉచిత పిల్లల సంరక్షణ కోసం, విద్య కోసం పోరాడారు. నిజంగా మహిళ లంటే ఇంటిని, పిల్లల్ని చూసుకునే పాత్ర మాత్రమేనని భావించే పురుష వాదులు రోజా లగ్జంబర్గ్, క్లారా జెట్కిన్‌పై భౌతికంగా దాడి చేశారు. 1914వ సంవత్సరం కీలకంగా మారింది. యుద్ధం వలన కుటుంబాలు నాశనం అవుతాయని, ప్రపంచం అల్లకల్లో లంగా మారుతుందని ఆందోళన చెందారు. జర్మనీకి ఉన్న ఈ యుద్ధ దాహం వలన ధనికులు, పెట్టుబడిదారులు, భూస్వాములు లాభ పడతారేమో గాని సామాన్య ప్రజానీకం కష్టాలపాలౌతారని ఆందోళన చెందారు. దీంతో 1915వ సంవత్సరం మార్చిలో రోజా లగ్జంబర్గ్, క్లారా జెట్కిన్ యుద్ధానికి వ్యతిరేకం గా అంతర్జాతీయ మహిళా సదస్సును నిర్వహించారు. వీరి నిర్ణయం నచ్చని అనేక మంది వీరిని ఒంటరి చేశారు. ఇబ్బందులను అధిగమిస్తూ యుద్ధానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుని 1918లో 'జర్మన్ కమ్యూనిస్టు పార్టీ'ని స్థాపించారు. పార్టీలో మహిళా సభ్యుల సంఖ్యను పెంచడానికి ఎంతో శ్రమించారు. కొన్నాళ్ళకి స్పార్టకస్ లీగ్‌ను స్థాపించారు. స్వేచ్ఛ అంటే పాలకుల స్వేచ్ఛ కాదని ప్రజల స్వేచ్ఛ అని గట్టిగా నినదించారు.




నేడు రోజా లగ్జంబర్గ్ శత వర్ధంతి

మరో పక్క యుద్ధానంతరం నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. ఈ నిరుద్యోగ సమస్యను నియంత్రించకుండా పాలన సాధ్యం కాదనే భయంతో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మహిళా ఉద్యోగాలను తొలగించటమే లక్ష్యంగా పెట్టుకున్నారు ఆనాటి పాలకులు. ఈ కుతంత్రాన్ని రోజా లగ్జంబర్గ్, క్లారా జెట్కిన్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. 'మహిళా కార్మికులారా ఏకం కండి' అని నినదిస్తూ మహిళా ఉద్యోగాల రక్షణకు యత్నించారు.

రోజా లగ్జంబర్గ్ ఒక మంచి ఉపన్యాసకు రాలు. ఆమె ఉపన్యాసాలతో ఎంతోమందిని ఉత్తేజపరుస్తూ కార్మిక ఉద్యమాల వైపు నడిపించారు. అంతర్గత, బహిర్గత పోరాటాల్లో ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ఎదుర్కొని నిలబడ్డారు. జీవితంలో వచ్చిన ఇబ్బందులను సైతం అధిగమించి విప్లవ కార్యాచరణ వైపు ముందుకు సాగారు. ఒకానొక సందర్భంలో గృహిణిగా ఉంటూ పిల్లల్ని పెంచటమా? లేదా విప్లవం కోసం ముందుకు సాగటమా? అన్న మీమాంస ఎదురైనప్పుడు రెండింటినీ సమానంగా నడపగల సామర్థ్యం తనకు ఉందని భర్తతో వాదిస్తారు రోజాలగ్జంబర్గ్. చివరకు వ్యక్తిగత జీవితంలో వచ్చిన ఇబ్బందులను అధిగ మించి తన జీవితాన్ని విప్లవానికి అంకితం చేశారు. జనవరి15, 1919వ సంవత్సరంలో జర్మనీలోని బెర్లిన్లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత ఆమె పార్థివదేహాన్ని లెండర్ నదిలో విసిరేశారు. ఒక నెల తర్వాత ఆ శవాన్ని గుర్తించారు. ఆమె తన జీవితం మొత్తాన్ని విప్లవం కోసం, కార్మికుల కోసం, శ్రామిక మహిళల కోసం అంకితం చేశారు. నేటికి ఆమె మరణించి ఒక శతాబ్దం పూర్తవుతున్న ప్పటికీ ఆమె ఏ ఆశయం కోసమైతే నినదించారో, నేటికీ ఆ ఆశయం నెరవేరక పోవడం దురదృష్టకరం. నాడు మొదటి ప్రపంచ యుద్ధానికి వ్యతిరేకంగా ఆమె నినదిస్తే, నేడు అమెరికన్ సామ్రాజ్యవాదం మూడో ప్రపంచ యుద్ధానికి సిద్ధమవటం శోచనీయం. ఆనాడు మహిళా ఉద్యోగులను తొలగించటం ద్వారా నిరుద్యోగ సమస్యలు అధిగమించాలను కుంటే, నేడు బిజెపి పాలకులు మహిళలు ఉద్యోగాలకు పోటీ పడటం వలన పురుషులకు ఉద్యోగాలు కరువై పోయా యనటం మహిళా లోకానికి అవమానకరం. ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు నిరుద్యోగిత వైపు నెట్టివేస్తూ మరోవైపు దానికి మహిళలే కారణం అని చెప్తున్నారు. వారు తప్పించుకోవటానికి మహిళలను నిందితు లుగా చూపుతున్నారు. శ్రామిక మహిళా ఉద్యమానికి సమర శంఖారావం పూరించిన రోజా లగ్జంబర్గ్‌ను ఆదర్శంగా తీసుకొని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే వరకు నినదించడమే రోజా లగ్జంబర్గ్‌కి మనం అర్పించే నిజమైన నివాళి.

సమీక్ష

జన్యు మార్పిడి విత్తనాలకున్న పరిమితులు



దేశంలో విశ్వవిద్యాలయాలు నిరుపయోగ, అనుకరణ పరిశోధనలకు నిలయాలుగా మారటాన్ని చూస్తున్నాం. పూర్వుల ప్రయోజకత్వాన్ని పురాణాల ద్వారా చూసే స్థాయి నుండి దేశం బయట పడాలి. ఆర్యభట్ట, వరాహమిరుడు, చరకుడు వంటి వారు తమ కాలాల్లో అనేక శాస్త్ర జ్ఞాన క్రోడీకరణలు చేసుండవచ్చు. తద్వారా ఆ కాలానికి అవసరమైన సాంకేతికాలు రూపొందించి వుండవచ్చు. కానీ ఆ ఒరవడిని సమాజం అందిపుచ్చుకోలేక పోవటానికి ముఖ్య కారణం మతాల నీడ సైన్స్‌పై పడటమే.

ఈ మధ్య కాలంలో (డిసెంబర్ 2018) ప్రొ॥స్వామినాథన్ పరిశోధనా ఫౌండేషన్ నుండి మరోసారి జన్యుమార్పిడి పంట విత్తనాలపై విశ్లేషణా వ్యాసం (రివ్యూ ఆర్టికల్) ప్రచురిత మైంది. ఈ వ్యాసం ప్రఖ్యాత సైన్స్ పక్షపత్రిక 'కరెంట్ సైన్స్'లో ప్రచురించటం వల్ల ఎక్కువ మంది శాస్త్రవేత్తల దృష్టికొచ్చింది. ఆ వ్యాసం ద్వారా డా॥ శివరామన్-స్వామినాథన్‌లు కృత్రిమ జన్యు మార్పిడి ప్రక్రియ వాడకానికి పరి మితులున్నాయనీ, దానిని పరిమితంగా వాడాలనీ వివరించారు. భారతదేశ వ్యవసాయ పరిశోధనా రంగం పరిపుష్టమై, నియంత్రణా వ్యవస్థలు తగిన స్థాయిలో ప్రభుత్వ రంగంలో రూపొందిన దశలలోనే అటువంటి కృత్రిమ డిఎన్ఎ మార్పిడి సాంకేతికాలకు వెళ్లాలన్నారు. ఆ సాంకేతికాల్ని కూడా, మొక్కల్ని నిర్జీవ (ఎబయాటెక్) ఒత్తిళ్ల నుండి తప్పించేందుకు, అంటే భూక్షార లేక చౌడుకు తట్టుకొనేందుకు, అధిక ముంపు, దీర్ఘకాల బెట్టను తట్టుకొని నిలబడేందుకు వాడాలని సూచించారు. ఇప్పుడు విచ్చలవిడిగా వాడబడుతున్న పురుగుల్ని కలుపు మొక్కల్ని అణచివేయగల బిటి సాంకేతికాలు దీర్ఘకాలంలో అనర్థాలకు దారితియ్యగలవని వివరిం చారు. పైగా ఈ రకమైన సాంకేతికాలు ప్రభుత్వ సంస్థల నుండి గాక ప్రైవేట్ సంస్థల నుండి తయారవ్వటం వల్ల అవి గుత్త సొమ్ముగా మారిన స్థితిని చూశాం. ఆ స్థితి కలగకుండా ఉండా లంటే, ప్రభుత్వ నియంత్రణా వ్యవస్థలు, పరిశోధనా సంస్థలు ఆధునీ కరించబడాలి. అంటే తగిన ఆర్థిక, మానవ వనర్లు ఇవ్వగల విధానాలు ప్రభుత్వం అమలుపరచాలి. అయితే దీనికి భిన్నంగా ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సలహాదారు డా.విజయరాఘవన్, భారత శాస్త్రజ్ఞాన సంస్థ (ఐఐఎస్‌సి) బెంగుళూరు మాజీ నిర్దేశకుడు, డా॥పద్మనాభన్‌లు స్పందించారు. స్వామినాథన్, శివరామన్‌ల విశ్లేషణ లను తిరస్కరించాలని సెలవిచ్చారు. విజయ రాఘవన్ తన అవగాహ నని విపులంగా తరువాత వెల్లడించగలనని ప్రకటిస్తే, పద్మనాభన్ కృత్రిమ జన్యు మార్పిడి ప్రక్రియ భారత వ్యవసాయ రంగాన్ని కాపాడగల ఆధునిక సాంకేతికమని ది హిందూలో వ్యాసం ద్వారా సెలవిచ్చారు. అంతటితో ఆగక దాన్ని వ్యతిరేకించే వాళ్ల అభివృద్ధి నిరోధకులనే స్థాయికి వెళ్లారు. ఆ సందర్భంగా ఆయన బిటి ప్రత్తి విత్తనాల ద్వారా భారత దేశానికి ఎంతో ప్రయోజనం ఒనగూడిందని పేర్కొన్నారు. బిటి వంగ, ఆవాలు వంటి వాటికి అడ్డుకట్ట వేసి, దేశ వ్యవసాయ రంగ అభివృద్ధికి నష్టం కలిగించినట్లు వివరించారు. ఈ తరహా అభిప్రాయాల్ని ఎందరో నోబెల్ బహుమతి శాస్త్రవేత్తలు కలిగి వున్నారని తెలియజేశారు. ప్రఖ్యాత సిసియంబి శాస్త్రవేత్త డా॥ డి.బాలసుబ్రహ్మణ్యన్ కూడా ఇంచుమించు ఈ అభిప్రాయాన్నే వ్యక్తపరుస్తూ వచ్చారు. వారి ఒరవడిలోనే ప్రముఖ జీవ రసాయన శాస్త్రవేత్తలైన, సంతు శాంతారాం, ఏఆర్ రెడ్డిలు స్వామినాథన్ సంస్థ నిపుణుల అభిప్రాయాల్ని ఖండించారు.



ప్రొ॥ఎన్ వేణుగోపాలరావు

ప్రఖ్యాత శాస్త్ర పరిశోధకుడు, జీవ (జన్యు) శాస్త్రవేత్తగా నోబెల్ బహుమతి పొందిన డా॥వెంకట రామన్ రామకృష్ణన్, వీటిపై తాజాగా స్పందించారు. సైన్స్- సాంకేతికాలపై విపులంగా చర్చిస్తూ ఆయన తన 'జీన్ మెషిన్ ద రేస్ టు డెసిఫర్ ది సీక్రెట్స్ ఆఫ్ రైబోసోమ్' సైన్స్ గ్రంథం ద్వారా సాంకేతికాల ముఖ్య ప్రయోజనాలను తడిమారు. భారతదేశ పరిశోధనలు, ప్రపంచ స్థాయిలో జరగాలంటే ప్రభుత్వ ధోరణి మారాలని వివరించారు. ముఖ్యంగా పురాణ ఘట్టాలను సైన్స్‌గా అభివర్ణించే ధోరణి మారాలన్నారు. అలానే జన్యుమార్పిడి అంటే కేవలం బిటి జన్యువు ఆధారిత పంట రకాలనే ధోరణి పోవాలన్నారు. ఇప్పటి వరకు ఈ సాంకేతికాన్ని కేవలం పురుగులు, తెగుళ్లు కలుపుమొక్కలను అణచేం దుకు మాత్రమే వాడారు. కానీ ఇప్పుడు ప్రకృతి పరంగా మొక్కల్లోనూ, జంతువుల్లోనూ దీర్ఘ కాలంలో జరిగే జన్యు మార్పుల్ని, అత్యంత వేగంగా చూడాలంటే, కృత్రిమ జన్యుమార్పిడి అవసరమన్నారు. ముఖ్యంగా దీర్ఘకాల బెట్టను, తీవ్రమైన ముంపుల్ని, భూ సమస్యలను, పంట నిల్వ సమస్యలను, పోషకాల పెంపు విషయాలను, అధిక దిగుబడి లక్షణాలను పెంపొందించి, ఆధునికతకు, సమాజ మార్పు లకు తగిన విధంగా ఆహార ఉత్పత్తి జరగాలంటే కృత్రిమ జన్యు మార్పిడి కావాలన్నారు. అయితే ఇది కార్పొరేట్ సంస్థల గుత్త సొమ్ముగా మారి ఉత్పత్తిదారులపై అదనపు భారం పడకుండా ఉండాలంటే, ప్రభుత్వ పరిశోధనలు పటిష్ఠ పడాలన్నారు. ఈ సామాజిక బాధ్యతను శాస్త్రవేత్తలు కూడా గుర్తించాలని ఆశించారు, డా॥వెంకి (వెంకట రామన్ రామకృష్ణన్). ఈ సందర్భంగా ఆయన శాస్త్ర-సాంకేతికాలు కేవలం కొందరి వ్యక్తుల ద్వారానే రూపొందాయనే ధోరణి మంచిదికాదన్నారు. అవి సమాజ అవసరాలకు తగినట్లు, సామూహిక శ్రమ-ఆలోచన్ల ద్వారా రూపొందుతాయని వివరించారు. ఎన్నో ఆవిష్కరణలు ఒకరి కంటే ఎక్కువ మంది ద్వారా జరిగాయని తెలిపారు. జర్మనీ, రష్యా వంటి దేశాలు ఏవిధంగా 'జాతీయత' పేరుతో నిరంకుశత్వం ప్రబలి ఎంతో ముందుకెళ్లినా రసాయన, జీవ శాస్త్రాల్ని పక్కదారి పట్టించాయో తెలిపారు. అనగా ఒకే తరహా సాంకేతికాలు ఇబ్బడి ముబ్బడిగా అక్కడ పెరిగి వుండవచ్చు. కానీ సైన్స్ విస్తృతికి జాతీయత అడ్డుగా నిల్చింది. అమెరికా ఆ ధోరణి నుండి పక్కకు జరిగింది కాబట్టే, ఆ దేశం శాస్త్రవేత్తల నిలయంగా మారింది. వివిధ దేశాల శాస్త్రవేత్తలను అది ఇముడ్చుకోగలిగింది. దీనికి విరుద్ధంగా ఉన్న అనేక దేశాలు సైన్స్‌ను విస్తరించలేక పోగా సాంకేతికాలకై ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తున్నది. పైగా విత్తన స్వావలంబనకు, జీవుల, జన్యువులపై హక్కులను కోల్పోవాల్సి వస్తున్నది. దేశంలో విశ్వవిద్యాలయాలు నిరుపయోగ, అనుకరణ పరిశోధనలకు నిలయాలుగా మారటాన్ని చూస్తున్నాం. పూర్వుల ప్రయోజకత్వాన్ని పురాణాల ద్వారా చూసే స్థాయి నుండి దేశం బయట పడాలి. ఆర్యభట్ట, వరాహమిరుడు, చరకుడు వంటి వారు తమ కాలాల్లో అనేక శాస్త్ర జ్ఞాన క్రోడీకరణలు చేసుండవచ్చు. తద్వారా ఆ కాలానికి అవసరమైన సాంకేతికాలు రూపొందించి వుండవచ్చు. కానీ ఆ ఒరవడిని సమాజం అందిపుచ్చుకోలేక పోవటానికి ముఖ్య కారణం మతాల నీడ సైన్స్‌పై పడటమే. దాన్నే ప్రఖ్యాత శాస్త్రజ్ఞాన ప్రచారకులైన జెడి బెర్నాల్, జెబిఎస్ హాల్డేన్‌లు చరిత్రలో సైన్స్ విశ్లేషణల ద్వారా క్రోడీకరించారు. ప్రజాసైన్స్ ఆవశ్యకతను విపులీకరించారు. వెంకి కూడా వారి వలే ప్రజాసైన్స్ విస్తరణలో ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేస్తున్నారు. ఆధునిక భారతదేశ ప్రగతి సైన్స్ విస్తరణ ద్వారానే సాధ్యమని, దానికి 'జాతీయత'నే ఇరుకు ధోరణి ప్రతిబంధకమని హెచ్చరించారు.

(రచయిత సెల్ : 9494009890 5)



సంక్రాంతి పండగంటే .. మనసును గాలిపటంలా ఎగరేయటం.. ఉత్సాహం ఓ ఉత్సవంలా వెల్లివిరియడం.. వ్యక్తులు ఒక్కొక్కరు పదులై వందలై సమిష్టిగా ప్రవహించటం... చెప్పకుంటూ పోతే... ఇలా ఇలా.. చాలా చాలా.. మామూలు పండగలు నదుల్లాంటి ప్రవాహాలైతే- సంక్రాంతి మహానదీ ప్రవాహం.. ఈ పండగను ప్రవాహంగా మార్చేదీ, ఊరూరా వెల్లువెత్తేలా చేసేదీ జనమే! జనసమూహాల సందోహమే! ఉద్యోగం కోసమో, ఉపాధి అవకాశాల కోసమో, పొట్టపోసుకునే రోజువారీ కూలి కోసమో- దూర ప్రాంతాలకు వెళ్లినవారంతా ఇంటిదారి పట్టడం ఈ పండక్కే సాధ్యం. అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు పిల్లాపాపలతో పుట్టినూరికి చేరేదే ఈ సందర్భంలోనే! ఉద్యోగులూ, వ్యాపారులూ, కార్మికులూ.. ఎవరైనా కావొచ్చుగాక.. సెలవులను దక్కించుకొని... తీరిక చిక్కించుకొని ... నాటి జ్ఞాపకాలను వల్లె వేసుకుంటూ పల్లెదారి పట్టేది ఇప్పుడే! అందుకే సంక్రాంతి మనలో చాలామందికి ఓ 'జీవన'ప్రయాణం!



ఊరికి శోభ.. బంధాలకు బలం



సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చిన జనంతో రైళ్లు, బస్సులు కిటకిటలాడాయి. రెండు, మూడు నెలలు ముందు రిజర్వు చేసుకున్నవారికి తప్ప ఇంకెవరికీ రైళ్లలో చోటు దొరకని స్థితి! జనరల్ బోగీల నిండా జనమే జనం. ప్రత్యేక రైళ్లు నడుస్తున్నా రద్దీ ఏమాత్రం తగ్గటం లేదు. బస్సుల పరిస్థితీ ఇంతే! బస్సులో సీటు దొరకటం కాదు కదా; బస్‌స్టేషన్లో కాలుమోపటం కూడా కష్టంగా మారింది. ఇవి సంక్రాంతి సత్తానూ, ప్రత్యేకతనూ చెప్పకనే చెప్పే దృశ్యాలు. ఇలాంటి రద్దీకాలంలో ముందస్తు ప్రణాళిక లేకుండా ఊరెళ్లటం కూడా సాహసమే!

ఏడాదికో సంక్రాంతి

హైదరాబాద్లోని ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేసే అప్పలనాయుడు దొరికిన బస్సల్లా ఎక్కుతూ – శ్రీకాకుళం జిల్లాలోని సొంతూరు బయల్దేరాడు. ప్రయాణం కష్టంగానే సాగింది. టిక్కెట్ల ధరలు రెట్టింపయ్యాయి. కానీ, విశాఖపట్నం వరకైనా నేరుగా బస్సు దొరకలేదు. విజయవాడ వరకూ ఒక బస్సులో వచ్చి, ఇక్కడి నుంచి కిక్కిరిసిన రైల్లో సొంతూరు చేరాడు. ప్రయాణంలో విసుగు, అసౌకర్యమూ ఉన్నా– కళ్లల్లో మాత్రం పండగ కాంతి. 'ఏంటి సంగతి?' అని అడిగితే– తన ఉద్వేగాన్ని ఇలా పంచుకున్నాడు...'పదేళ్ల నుంచి హైదరాబాద్లో పనిచేస్తున్నాను. మావోళ్లు చాలామంది అక్కడే ఉంటారు. ఏడాదికి ఒక్కసారి సంక్రాంతికే ఊరొస్తాను. మధ్యలో దగ్గరోళ్ల పెళ్ళిళ్లో, మరొకటో ఉంటే– ఎలాగూ రాక తప్పదు. పెద్ద పండక్కి మాత్రం ఊరు రావడం తప్పనిసరి' అన్నాడు. మరి దసరా, దీపావళి ఉంటాయి కదా? అనడిగితే– 'అవి మాకు తక్కువ. ఒకవేళ మనం వచ్చినా చానామంది రారు. సంక్రాంతికైతే అలా కాదు. మామూలు రోజుల్లో సగం కన్నా తక్కువ జనం ఉన్న ఊరు – పండక్కి ఫుల్లుగా నిండిపోతుంది. ఎక్కడెక్కడో ఉన్నోళ్లు కచ్చితంగా వస్తారు. బంధువులు, మిత్రులు అందరూ కనిపిస్తారు. ఈ నాలుగు రోజులూ ఎంచక్కా మట్లాడుకోవొచ్చు. హాయిగా గడపొచ్చు' అని చెప్పాడు. అలా మాట్లాడుతున్నప్పుడు– పండగలా వెలిగిపోయింది అతడి ముఖం. ఇలాంటి ఎన్నో అనుభవాలకు వారధి కట్టేదే ఈ సంక్రాంతి పండగ.

ఊరిని కలిపే ఉత్సవం

చాలామంది సంక్రాంతికి సొంతూరు ఎందుకు వస్తారు అంటే – ఇందుకే! ఊరు మొత్తాన్ని ఓ ఫ్యామిలీ ఫొటోలా నిండుగా చూసుకోవొచ్చు. చిన్నప్పుడు ఆడిపాడిన నేస్తాలందరూ వస్తారు. వెన్నెల రాత్రుళ్లలో ఆకుతొక్కుడు ఆటాడుకున్న చిన్ననాటి నేస్తాలు, పెన్సిలు ముల్లు విరిచేసినందుకు జుట్టూజుట్టూ పట్టుకున్న రమేషూ, రహీమూ; నేలబావిలో నిలువీత నేర్పిన పెద్ద రాముడు, కొత్తగా గెలలు వేసిన పొట్టి తాటిచెట్టును నానా తంటాలు పడి ఎక్కిన గంటా రమణ, పాచి ముఖంతో పుస్తకం చదవటం తప్పని గట్టిగా వాదించిన చిత్రాడ రమణ ... ఇలాంటి తమాషా సన్నివేశాల మిత్ర ఉద్ధండులంతా సంక్రాంతి పండక్కి తప్పకుండా వస్తారు. వాళ్లందరినీ కలవడమే కదా నిజమైన ఆనందం. మనసుకు హాయినీ, ఆహ్లాదాన్నీ కలిగించే మనుషులను ఒక్కచోట కలవటమే నిజమైన సంక్రాంతి.

సందడిని తరిమేసిన కరువు

రాయలసీమలో ఈ ఏడాది కరువు తీవ్రంగా ఉంది. వర్షపాతం కరువై, భూగర్భ జలాలు అడుగంటి, ఉన్నచోట జలాశయాలు ఎండిపోయి... వ్యవసాయం ఎందుకూ ఉపయోగం లేకపోయింది. ఉల్లి, టమాటా పండిన చోట్ల తగిన ధరలు రాక – రైతులు పీకల్లోతు కష్టాల్లో, అంతకుమించి అప్పుల్లో కూరుకుపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో పండగ చేసుకోవటం ఎలా? అల్లుళ్లను, ఆడపిల్లలనూ ఇంటికి పిలుచుకోవటం ఎలా? తుపాను ముంచెత్తిన శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలోనూ ఈ ఏడాది ఇదే పరిస్థితి! దీంతో, ఆయా జిల్లాల్లోని చాలా ఇళ్లల్లో సంక్రాంతి శోభ లేనేలేదు.

అనంతపురం జిల్లాలోనూ ఇదే స్థితి. 'నా కొడుకులిద్దరూ భార్య పిల్లలతో బెంగళూరు వలసపోయారు. పండక్కు కూడా రాలేదు. ఒక్కదాన్నే ఇంటి దగ్గరుంటున్నా... పండగ రోజు ఊళ్లో ఎవరైనా పెడితే తింటా.. లేకపోతే అట్నే ఉంటా! ఏమి చేసేది? పిల్లలు అక్కడ, నేను ఇక్కడ అన్నట్టుగా ఉంది మా బతుకు' అని ఆవేదన వ్యక్తం చేసింది అనంతపురం జిల్లాలోని పోతులవాండ్ల కొత్తపల్లిలోని సాలమ్మ అనే వృద్ధురాలు.



అప్పలనాయుడు
సత్యనారాయణ
సాలమ్మ
ఎల్లమ్మ

పండగ కోసం అదనపు కష్టం!

అందరి ఇళ్లళ్లో పండగలు ఒకేలా ఉండవు. ఆదాయాలను బట్టి, అవకాశాలను బట్టి సరదాలూ సంతోషాలూ ఆధారపడి ఉంటాయి. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకుల్లో పండక్కి పది రూపాయలు అదనంగా కావాలంటే – కాయకష్టమే దారి. అలాంటిదే ఈ కథ. ఎల్లమ్మది కృష్ణాజిల్లాలోని ముప్వ. ఆమె వయసు 33 సంవత్సరాలు. భర్త తాగుడుకు బానిసయ్యాడు. ఎల్లమ్మ అతడికి రెండో భార్య. మొదటిభార్య ఓ బిడ్డకు జన్మనిచ్చిన నెలరోజులకే చనిపోయింది. పాప పేరు లక్ష్మి. ఆ బిడ్డ ఆలనాపాలనా, అన్ని బాధ్యతలూ ఎల్లమ్మే చూసింది. కూలి పనే ఆధారంగా కుటుంబాన్ని పోషిస్తోంది. రెండేళ్ల క్రితం లక్ష్మికి పెళ్లి చేసింది ఎల్లమ్మ. కొంతకాలం సిటీలో ఉండి ఉదయంపూట ఇళ్లల్లో పని, తర్వాత స్కూల్లో ఆయాగా పనిచేసింది. ఇంటి అద్దె, ఇతర ఖర్చులు ఎక్కువైపోవడంతో ఐదేళ్ల క్రితం సొంతూరికి నివాసం మార్చేసింది. ప్రతిరోజూ పనికోసం విజయవాడ వస్తోంది. ఓ పని దొరికితే ఆ పని చేస్తోంది. ఎన్నోసార్లు పని దొరక్క వెనుతిరగాల్సి వస్తోంది.

సంక్రాంతి వస్తుందంటే – ఆమె తన కష్టాన్ని రెట్టింపు చేసుకుంటోంది. కూతురిని, అల్లుడిని ఇంటికి పిలిచి, ఉన్నంతలో బాగా చూసుకోవాలనేది ఆమె తపన. ఈసారి కొద్దిరోజులు రోజుకు రెండొందల వేతనానికి షాపింగ్ మాల్స్‌లో పనిచేసింది. మరో పది రోజులు విజయవాడ పుస్తక మహోత్సవంలో పనిచేసింది. అక్కడ రోజు కూలీ రూ.400. ఈ పని కోసం కూతురినీ ముందుగానే రప్పించింది. పండగ ఖర్చులకు కాస్త కలిసి వస్తుందని ఆమె భావన. 'నెల రోజులు అదనంగా కష్టపడితేనే మా పండగ బాగుంటుంది' అంది ఎల్లమ్మ. ఎల్లమ్మకి ప్రతి సంవత్సరం పుట్టింటి నుంచి పండక్కి రమ్మని పిలుపు వస్తుంది. పెళ్లయిన మొదట్లో వెళ్లింది తప్ప, తరువాత వెళ్లలేదు. 'ఇక్కడి కుటుంబ భారం నాపైనే ఉంది. నేనే ఇక్కడి పండగ జరపాలి. ఇంక నేనెలా వెళ్లగలను?' అంది నవ్వుతూ.

రూపాయి.. రూపాయి కూడబెట్టి

'నేను ఆటోడ్రైవర్‌ని. పాప హాస్టల్లో ఎనిమిదో తరగతి చదువుతోంది. బాబు ఆరో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు వస్తే మా ఇంట్లో అక్కాతమ్ముళ్ల సందడి అంతా ఇంతా కాదు. సెలవులకు ఇంటికి వస్తే, తనకేం కావాలో అమ్మాయి ముందే ఫోన్‌లో పెద్ద లిస్ట్ చెప్పేస్తుంది. వారి చిన్ని కోరికలు పండగలప్పుడే కదా తీర్చేది. అందుకే, ఈ సంక్రాంతి కోసం ఏడాది మొత్తం ఒక్కో రూపాయీ జాగ్రత్తగా దాచుకుంటాం. ఉన్నంతలో ఇద్దరికీ కావాల్సినవి ఇప్పుడే కొనిస్తాం. ఇంట్లో చేసే పిండి వంటలు పాప సెలవుల తర్వాత హాస్టల్లో తన ఫ్రెండ్స్‌కి పంచడం కోసం జాగ్రత్తగా ప్యాక్‌చేసి పంపుతాం. "అమ్మాయిని బాగా చదివిస్తున్నావోయ్..!" అని ఎవరైనా అన్నప్పుడు. చాలా సంతోషం కలుగుతుంది' అని చెప్పే విశాఖజిల్లా కృష్ణాపురంకి చెందిన పైల సత్యనారాయణ మాటల్లో ఏడాదికోమారు పండగ తెచ్చే సంతోషాన్ని ఇట్టే పసిగట్టవచ్చు. ఇలా పండగ స్వరూపాల్లో ఇంటింటికీ ఓ కథ ఉండనే ఉంటుంది.

ఎవరింటి శోభ వారిది!

సంక్రాంతి వస్తుందంటే– వచ్చే పిల్లల కోసం, బట్టల కోసం, పిండివంటల కోసం సన్నాహాలు చేసుకోవటం చాలా కుటుంబాల్లో మామూలే! కొందరికి అవసరమైన సామగ్రి, ఏర్పాట్లు ఏమాత్రం కష్టం కాదు. కానీ, చాలా సామాన్య కుటుంబాల్లో, పేద రైతు, కూలీ కుటుంబాల్లో రాత్రీ పగలూ తలలో తిరుగాడే జోరీగ. ఓ పేద రైతు ఉన్న ఆవు పెయ్యిని అమ్మేస్తాడు. ఇంకో అమ్మ ఇంట్లో పెంచుతున్న నాలుగైదు కోళ్లను అమ్ముకుంటేనే పండగ. ఇంకొకరు చేతికొచ్చిన కొద్దిపాటి పంటనూ అమ్ముకోవాల్సి ఉంటుంది. ఇంకొందరు కాయకష్టాన్నే మరింత ఎక్కువ చేస్తారు. రోజువారీ పనులతో పాటు అదనపు పనులకు వెళతారు. ఇలా ఏదొక రూపంలో సమకూరిన డబ్బులతో ఆఖరుకు అప్పు చేసైనా.. పండక్కొచ్చిన అల్లుడికి, కూతురికి బట్టలు.. ఉన్న నాలుగు రోజులూ ఉన్నంతలో మెరుగ్గా భోజనం, పిండివంటలు, కక్కాముక్కలూ ... అందరితో పాటు మనమూ అన్న ఆనందం పడిన శ్రమను మరిచిపోయేలా చేస్తుంది. మనుషులూ మాటలూ కలిసిన ఆనందం పండగ ఉత్సాహాన్ని పదింతలు చేస్తుంది. ఎవరింటి శోభ వారికి సంతోషం. అదే పండగ. అదే సంక్రాంతి. అందులోనే ఆనందం.



ఈ రోజు సంక్రాంతి.. రేపు కనుమ.. ఎల్లుండి ముక్కనుమ... ఏరోజుకు తగినట్టు ఆరోజు రకరకాల వంటలూ.. కాలక్షేపాలూ...! నెలరోజులుగా తలచిన, తపించిన, ఎదురుచూసిన పెద్ద పండగ కొన్ని అనుభవాలనూ, ఇంకొన్ని ఆనందాలనూ ఇచ్చి- వెళ్లిపోతుంది. సంతోషాలైనా, సమస్యలైనా గంటలో, రోజులో మనతో పాటు ఉంటాయి. అదే మనసు మీద ముద్రలు మాత్రం జ్ఞాపకాలుగా ఎప్పటికీ ఉంటాయి. ఈ పండగ మన అందరికీ మంచి ఆనందాలను, అనుభూతులను ఇవ్వాలని ఆశిద్దాం!

- జీవన డెస్క్



9 చుక్కలు
5 వచ్చే వరకు
మధ్యచుక్క

యశోద సింహాద్రి
భీమవరం
పశ్చిమ గోదావరిజిల్లా



15 చుక్కలు
1 వచ్చే వరకు
సరిచుక్క

ఆర్. హేమలత సురేఖ
విజయవాడ
కృష్ణాజిల్లా



షారోన్
విజయవాడ

15 చుక్కలు
8 వచ్చే వరకు
మధ్యచుక్క



జీవన సౌరభం

జీవితంలో అన్నిటికంటే ముఖ్యం.. ఒక లక్ష్యం కలిగి ఉండటం.

మీకోసం



బంగాళదుంపల చిప్స్ ఎక్కువకాలం నిల్వ ఉండాలంటే కరివేపాకు ఆకులను వేస్తే సరి.

సెన్సెక్స్ ⬇ 156
35,853

నిఫ్టీ ⬇ 57
10,737

రూపాయి ⬇ 43 పై
అమెరికా డాలరుకు రూ.
70.93



పెట్టుబడులపై అవగాహన...

పెట్టుబడులపై అవగాహన కల్పించడానికి ఎన్ఎస్ఇ 'ప్రాస్పరస్ ఇండియా 2019' కార్యక్రమం చేపట్టింది. ఇటి భాగస్వామ్యంతో తొలుత దీన్ని ముంబయిలో ప్రారంభించినట్లు ఎన్ఎస్ఇ సిఇఒ, ఎండి విక్రమ్ లిమయే పేర్కొన్నారు. దేశంలో అన్ని రకాల పెట్టుబడులపై ఉన్న అవకాశాలపై ఇందులో అవగాహన కల్పించాలనేది ఉద్దేశ్యమని ఇటి ఎంటి ఎంకె ఆనంద్ పేర్కొన్నారు.

ఆర్‌బిఐ వృద్ధి అంచనాలు తగ్గాలి

ఎస్‌బిఐ క్యాప్ విశ్లేషణ

ముంబయి : దేశ వృద్ధి రేటుపై రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా వేసిన ముందస్తు అంచనాలను తగ్గించుకోవాలని ఎస్‌బిఐ క్యాప్ సెక్యూరిటీస్ లిమిటెడ్ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటులో తగ్గుదల ఉందని పేర్కొంది. గతేడాది నవంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 0.5 శాతానికి పడిపోవడమే ఇందుకు నిదర్శమని విశ్లేషించింది. ఈ మాసంలో 3.6 శాతం పారిశ్రామిక వృద్ధిని తొలుత అంచనా వేసినట్లు పేర్కొంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో వచ్చే మార్చితో ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు అంచనాలను 7.4 శాతం నుంచి 7 శాతానికి కోత పెట్టుకోవాలని ఎస్‌బిఐ క్యాప్ సూచించింది. ముఖ్యంగా ద్వితీయార్థంలో ఆర్థిక బలహీనతలు ఉన్నాయని ఎస్‌బిఐ క్యాప్ ఎకనామిస్టు అర్జున్ నాగరాజన్ పేర్కొన్నారు. ఆర్‌బిఐ ద్రవ్య పరపతి సభ్యులు పారిశ్రామికోత్పత్తి అంచనాలను పున: సమీక్షించాలన్నారు. వృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం స్థబ్దతతో ఉండటం వల్ల వచ్చే ఫిబ్రవరి ఆర్‌బిఐ ఎంపిసి భేటీలో వడ్డీ రేట్లను 50 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం ఉందని నిర్మల్ బంగ్ ఈక్విటీస్ లిమిటెడ్ ఎకనామిస్టు టెరెస జాన్ అంచనా వేశారు. క్రితం నవంబర్‌లో పారిశ్రామికోత్పత్తిలోని 23 తయారీ రంగాల్లో 10 మాత్రమే సానుకూలంగా నమోదు కాగా మిగితా 13 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.

3.80 శాతానికి టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : గతేడాది డిసెంబరులో టోకు ధరల సూచీ(డబ్ల్యుపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.80శాతంగా చోటు చేసుకుందని సోమవారం కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇంతక్రితం నవంబరులో ఇది 4.64శాతంగా ఉంది. కాగా 2017 డిసెంబరులో ఇది 3.58శాతంగా నమోదైంది. 2018 ఏప్రిల్‌లో నమోదైన 3.62శాతం టోకు ద్రవ్యోల్బణం తర్వాత ఇదే కనిష్ఠం. డిసెంబరు నెలలో కూరగాయల ధరల ద్రవ్యోల్బణం 26.98శాతం నుంచి 17.55శాతానికి తగ్గింది. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం 16.28శాతం నుంచి 8.38శాతానికి దిగివచ్చింది. డిసెంబరు నెలలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుముఖం పట్టడం వల్ల ధరలు తగ్గాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది డిసెంబర్‌లో వినియోగదారుల సూచీ ద్రవ్యోల్బణం 2.19 శాతానికి తగ్గింది. 2017 జూన్‌లో ద్రవ్యోల్బణం అత్యంత కనిష్టస్థాయిలో 1.49 శాతంగా నమోదైన క్రమంలో ఆ స్థాయిలో ద్రవ్యోల్బణం మళ్లీ తగ్గుముఖం పట్టింది.

జెట్ ఎయిర్‌వేస్‌లో పెరగనున్న ఎతిహాద్ వాటా..!

లండన్ : తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న జెట్ ఎయిర్‌వేస్‌కు మద్దతుగా నిలువాలని ఎతిహాద్ నిర్ణయించింది. జెట్ ఎయిర్‌వేస్‌లో తన వాటాను 49శాతానికి పెంచుకోవాలని భావిస్తున్నట్లు మీడియా రిపోర్టులు పేర్కొన్నాయి. దేశంలో రెండో అతిపెద్ద ఎయిర్‌లైనర్‌గా పేరొందిన జెట్ ఎయిర్‌వేస్ గత 11ఏళ్లలో 9 సంవత్సరాలు నష్టాలనే చవిచూసింది. ప్రస్తుతం ఎతిహాద్‌కు మొత్తం 24శాతం వాటాలు ఉన్నాయి. భారత్‌కు చెందిన ఎయిర్‌లైన్స్ సంస్థలో విదేశీ సంస్థలు 49శాతం మాత్రమే పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. దీంతో ఎతిహాద్ ఆమేరకు వాటాలను కొనుగోలు చేయనుంది. దీంతో జెట్ ఎయిర్‌వేస్ ఛైర్మన్ నరేష్ గోయల్ తన వాటాలను విక్రయించనున్నారు. ప్రస్తుతం జెట్ ఎయిర్‌వేస్‌లో నరేష్ గోయల్‌కు 51శాతం వాటా ఉంది. ఈ ఒప్పందం అనంతరం ఆయన వాటా 20శాతం కంటే దిగువకు పడిపోనుందని తెలుస్తోంది. కాగా ఆయనకు 10శాతం ఓటింగ్ హక్కులు లభించనున్నాయి. ఈ రిపోర్టుతో సోమవారం జెట్ ఎయిర్‌వేస్ షేర్లు 19శాతం పరుగులు పెట్టాయి. నవంబర్ 15 నుంచి ఇప్పటి వరకు ఈ షేర్ కౌంటర్‌లో వచ్చిన అతిపెద్ద లాభం ఇదే.

ఓలాలో సచిన్ బన్సల్ పెట్టుబడి

బెంగళూరు : ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్ ఓలాలో రూ.650 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఒక్కో షేరు రూ.21,250 చొప్పున 70,588 జె ప్రిఫరెన్స్ షేర్లను కొనుగోలు చేసినట్లు బన్సల్ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు తెలిపారు. ఫ్లిప్‌కార్టులోని తన వాటాలను వాల్‌మార్ట్‌కు విక్రయించి సంస్థ నుంచి బయటకు వచ్చాక .. ఆయన తొలి పెట్టుబడి ఇదే. బన్సల్ మొత్తం 100 మిలియన్ డాలర్లు ఓలాలో పెట్టుబడి పెట్టనున్నారని తొలుత వార్తలు వచ్చాయి. కాని తుదకు 21 మిలియన్ డాలర్లు పెట్టారు. ఇప్పటి వరకు ఓలా మార్కెట్ విలువ 5.7 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. ఓలాలో వ్యక్తిగత రూపంలో వచ్చిన అతిపెద్ద పెట్టుబడి ఇదే. ఇప్పటికే ఓలాలో జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ 26శాతం వాటాను కలిగి ఉంది.

ఇక బ్యాంకుల్లో వాటాల విక్రయం

- సర్కారు వాటా52 శాతానికి కుదింపు..!
- ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముఖగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని వాటాలను తెగనమ్మడానికి మోడీ సర్కార్ ప్రయత్నాలను వేగవంతం చేసింది. క్రమంగా ప్రభుత్వ రంగ బ్యాంకు (పిఎస్‌బి)ల్లోని వాటాలను 52 శాతానికి కుదించుకోనున్నట్లు ఓ ఉన్నతాధికారి తెలపడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటికే అనేక కేంద్ర ప్రభుత్వ కంపెనీల్లోని వాటాలను డిజిన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రయివేటు శక్తులకు అప్పగించిన కేంద్రం.. ఇక బ్యాంకుల్లోని ఈక్విటీల విక్రయాన్ని వేగవంతం చేయాలని నిర్ణయించడం ద్వారా వ్యవసాయం లాంటి ప్రాధాన్యత రంగాలకు రుణాలు పుట్టడం చాలా కష్టమే. పిఎస్‌బిల్లో సర్కార్‌కు ప్రధాన వాటా ఉందని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ అన్నారు. కాబట్టి వీటిలో కార్పొరేట్ విధానాన్ని పెంచడానికి కేంద్రం వాటాను తొలి దశలో 52 శాతానికి తగ్గించుకోనున్నట్లు తెలిపారు. మార్కెట్లలో పరిస్థితులను బట్టి బ్యాంకులు ఆ విధంగా నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించామని అన్నారు. ఇందుకోసం బ్యాంకులకు అన్ని అనుమతులు ఇచ్చామని తెలిపారు. పిఎస్‌బిల్లో సులభంగా వాటా విక్రయానికి ఇప్పటికే పలు



గ్రామీణ బ్యాంకుల విలీనం..

పలు గ్రామీణ బ్యాంకులను విలీనం చేసే ప్రక్రియపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని రాజీవ్ కుమార్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన బ్యాంకింగ్ సేవలందాలంటే రీజినల్ రూరల్ బ్యాంక్స్ (ఆర్ఆర్‌బి)లను ఏకీకృతం చేయాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే ఆర్ఆర్‌బిలకు ప్రధాన మద్దతును అందిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందన్నారు. ఏక ఆర్ఆర్‌బిగా మారాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకులు కూడా దీనిపై ఆసక్తిగా ఉన్నాయన్నారు. పిఎన్‌బి సారథ్యంలోని పంజాబ్ గ్రామీణ్ బ్యాంకు, యూకో బ్యాంకులోని ఉత్తర బిహార్ గ్రామీణ బ్యాంకులు మధ్య బిహార్ గ్రామీణ బ్యాంకుగా మారడానికి ఆసక్తిగా ఉన్నాయన్నారు. ఈ ఆర్ఆర్‌బిలను 1975 ఆక్ట్ కింద ఏర్పాటు చేశారు. వీటిని గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులకు, వ్యవసాయ కార్మికులకు రుణాలు అందించడానికి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆర్ఆర్‌బిల్లో 50 శాతం వాటా కేంద్ర ప్రభుత్వానికి ఉండగా, మిగితా 35 శాతం వాటా స్పాన్సర్ బ్యాంకర్, 15 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది.



బ్యాంకులను విలీనం చేసిన విషయం తెలిసిందే.

సెబీ నిబంధనల ప్రకారం బ్యాంకులు కనీసం 25 శాతం వాటాను మార్కెట్ శక్తులకు అప్పగించాలని మార్కెట్ రెగ్యులేటరీ సెబీ నిబంధనలు పేర్కొంటున్నాయి. పిఎస్‌బిల్లో సర్కార్‌కు 75 శాతం వరకు వాటా ఉండాలి. ఒకప్పుడూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకే సెబీ ఈ నిబంధనలు రూపొందించింది. పిఎస్‌బిల్లో కనీస వాటా 75 శాతంగా ఉంచుకోవడానికి ప్రభుత్వానికి అవకాశం ఉన్నా.. దీన్ని ఏకంగా 52 శాతానికి కుదించుకోవడానికి మోడీ సర్కార్ వేస్తున్న ఎత్తుగడల వల్ల పిఎస్‌బిలు పూర్తిగా ప్రయివేటుపరం కావడానికి ఎంతో దూరం లేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

సర్కార్ విధానాల వల్ల బ్యాంకులు ఇప్పటికే భారీగా మొండి బాకీల ఊబిలో చిక్కుకున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఒత్తిడి వల్ల కార్పొరేట్లకు ఇచ్చిన లక్షల కోట్ల రూపాయలు తిరిగి వసూళ్లు కాకపోవడంతో బ్యాంకుల పరిస్థితి ధీనంగా మారుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని.. బ్యాంకులు సరిగా పని చేయడం లేదనే భావన కల్పించి.. వీటి విక్రయానికి వీలుగా ప్రభుత్వం ప్రణాళికలు వేయడం దుర్మార్గమనే విమర్శలు ఉన్నాయి. దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో క్వాలిఫైడ్ ఇన్స్‌ట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపి) ద్వారా రూ.20,000 కోట్ల విలువ చేసే వాటాను విక్రయించడానికి ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. దీంతో ఎస్‌బిఐలో కేంద్రం వాటా 58.53 శాతానికి పడిపోనుంది. గత నెలలోనే ఈ వాటా విక్రయానికి వాటాదారులు కూడా ఆమోదం తెలిపారు. మార్కెట్ పరిస్థితులను బట్టి మరిన్ని బ్యాంకులు ఇదే బాటలో ఉన్నాయి. ఇప్పటికే సిండికేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్ తదితర బ్యాంకులు ఎంప్లాయి షేర్ పర్చేస్ స్కీమ్ (ఇఎస్‌పిఎస్)లను జారీ చేశాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఓఓ



ఎవిపి.రాజు,
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

'సత్యాగ్రహ' పేరును గాంధీ దేనినుంచి ఎంచుకున్నారు?

జాతీయోద్యమం - గాంధీశకం (క్రీ.శ1920-1947)

మహాత్మాగాంధీ : (క్రీ.శ 1869-1948)

✧ క్రీ.శ 1869 అక్టోబర్ 2వ తేదీన కథియవాడ్ ద్వీపకల్పంలోని పోర్‌బందర్‌లో పుట్టిన గాంధీ బాల్యంలో తల్లి మతనిష్ట-తండ్రి వ్యక్తిత్వంలోని నిజాయితీలతో ప్రభావితుడయ్యాడు.

✧ బ్రిటన్‌లో బార్-ఎట్-లా డిగ్రీ పొంది, తొలుత రాజ్‌కోట (గుజరాత్‌లోనూ) తర్వాత ముంబయిలోనూ న్యాయవాది వృత్తి నిర్వహించాడు.

✧ ముంబయిలో ఉండగా రాజ్ చంద్రరవిజీబాయి ప్రభావంతో అహింస, సత్యమార్గాల విశిష్టతపై నమ్మకం ఏర్పడింది.

✧ ఆయన వ్యక్తిత్వాన్ని గాఢంగా ప్రభావితం చేసిన గ్రంథాలు భగవద్గీత, బైబిల్, లైట్ ఆఫ్ ఆసియా, చిన్నతనంలో ఆయన విన్న, చూసిన శ్రావణకుమారుని, హరిశ్చంద్రుని చరిత్రలు ఆయనను ముగ్ధుణ్ణి చేశాయి.

✧ 1860 నుంచి దక్షిణాఫ్రికాలోని శ్వేత జాతీయుల చెరకు తోటల్లో కూలి పనులకోసం, తర్వాత కాలంలో వర్తక వ్యాపారాలు చేయడానికి గుజరాత్, సౌరాష్ట్ర ప్రాంతాల నుంచి చాలా మంది భారతీయులు దక్షిణాఫ్రికాకు వలసపోయారు. కాలక్రమంలో అక్కడే స్థిరపడ్డారు. భారతీయులు ఆ విధంగా స్థిరపడటం దక్షిణాఫ్రికాలోని శ్వేతజాతీయులకు ఇష్టంకాలేదు. ఆ అయిష్టతే వర్ణ వివక్షకు పునాది అయ్యింది.

✧ 1893లో దాదా అబ్దుల్లా అనే గుజరాత్ వర్తక ప్రముఖుడు దక్షిణాఫ్రికాలో తాను ఎదుర్కొంటున్న వ్యాపార చట్టపరమైన చిక్కుల్ని పరిష్కరించుకోవడంలో గాంధీ సహాయాన్ని కోరాడు.

✧ ఆ సందర్భంగా దక్షిణాఫ్రికాకు పోయిన గాంధీకి కొన్ని చేదు అనుభవాలు ఎదురయ్యాయి. డర్బన్ నుంచి ప్రిటోరియాకు మొదటి తరగతి రైలు పెట్టెలో ప్రయాణిస్తున్న గాంధీని ఒక శ్వేతజాతీయుడు టిక్కెట్ ఉన్నా మొదటితరగతిలో ప్రయాణించడానికి వీల్లేదంటూ ప్లాట్‌ఫారం మీదికి నెట్టి, సామాన్లను గిరాటు వేశాడు.

✧ రెండో సంఘటనలో గుర్రం బండివాడు గాంధీని బండితోలే వ్యక్తి పక్కన కూర్చోబెట్టాడు. తరువాత అక్కడా కాక కాళ్లు పెట్టుకునే మెట్టుపై కూర్చోమని దౌర్జన్యం చేశాడు. తోటి ప్రయాణికులు కలగజేసుకుని, బండివాడి ప్రవర్తనకు అభ్యంతరం చెప్పారు.

✧ మూడో సంఘటన - ట్రాన్స్‌వాల్‌లో జరిగింది. అక్కడ అప్పటి చట్టాల ప్రకారం తెల్లవారు మినహ నల్లవారుగానీ ఇతర రంగు జాతివారుగానీ ఫుట్‌పాత్‌లపై నడవరాదు.

✧ ఆయన్ని ప్రభావితుణ్ని చేసిన గ్రంథం టాల్‌స్టాయ్ రాసిన 'దైవరాజ్యం నీలోనే ఉంది' అనే పుస్తకం. ఈ మౌలిక ఆలోచనల ప్రభావ ఫలితంగానే ఆయనలో మతాతీత మానవతా దృష్టి పెంపొందింది.

✧ బోయర్ల సహశీలతతో ముగ్ధుడైన గాంధీ ధైర్యపూరితమైన కష్ట సహిష్ణుత పాషాణ హృదయాన్నీ కరిగించగలదు. సత్యాగ్రహంలోని కీలకసూత్రం అదే అని వ్యాఖ్యానించాడు.

✧ గాంధీజీ కృషి ఫలితంగానే వలస వ్యవహారాల కార్యదర్శి రిప్పన్ బ్రిటన్ సామ్రాజ్యంలో జరిగే శాసన నిర్మాణ కార్యక్రమాల్లో - వర్ణవివక్ష చూపడానికి వీల్లేదని ప్రకటిస్తూ ఆ బిల్లు ప్రతిపాదనను నిషేధించాడు. ఆ సత్ఫలితానికి ఆనందించిన నేటాల్ భారతీయులు గాంధీ చేసిన సేవలకు సముచిత పారితోషికం ఇవ్వజూపారు. గాంధీ దాన్ని వారిస్తూ.. ప్రజాకార్యం నిర్వహించినందుకు ప్రతిఫలాన్ని స్వీకరించరాదని అభిప్రాయపడ్డాడు. గాంధీ చేపట్టిన కార్యక్రమం నేపథ్యంతోనే 1894లో నేటాల్ కాంగ్రెస్ స్థాపితమైంది.

✧ 'ఇండియన్ ఒపీనియన్' అనే భారతీయుల పత్రికలో భారతీయులు తలపెట్టిన ఉద్యమానికి సముచితమైన పేరును ఆహ్వానించగా.. ఒకరు సూచించిన 'సదాగ్రహ' అనే పేరు గాంధీకి నచ్చింది. దాన్నే స్వల్పంగా మార్చి 'సత్యాగ్రహ' అనే పేరును ఆయన ఎంపిక చేశాడు.

✧ సామ్రాజ్య ప్రభుత్వం బిల్లు ప్రతిపాదనను తిరస్కరించిగానీ ట్రాన్స్‌వాల్ ప్రభుత్వం ఆ శాసనాన్ని రూపొందించింది. శాసనాన్ని ప్రతిఘటించాలని గాంధీ నేతృత్వంలో భారతీయులు సంసిద్ధులయ్యారు.

✧ ప్రధాని స్మట్‌ది కపట వాగ్దానమని గాంధీజీకి తెలుసు. ఆయన ఊహించినట్లుగానే వ్యతిరేక చట్టాల్ని వేటినీ ఉపసంహరించలేదు. మూడు పౌండ్ల పన్ను కొనసాగుతుందని ప్రకటించారు. దీన్ని వ్యతిరేకిస్తూ భారతీయులు సత్యాగ్రహాన్ని తలపెట్టారు. ట్రాన్స్‌వాల్‌కు 36 మైళ్ల దూరంలోని న్యూ కాసిల్ బొగ్గుగని కార్మికులు అందులో పాల్గొన్నారు. గాంధీ ప్రతిఘటన వ్యూహం ప్రకారం సత్యాగ్రహుల దండు 36 మైళ్ల దూరం కాలినడక యాత్ర చేపట్టాలి. 'గ్రేట్‌మార్చ్' అని గాంధీ అభివర్ణించిన ఈ యాత్రలో రెండు వేల మంది పురుషులు, 122 మంది స్త్రీలు, 50 మంది పిల్లలు పాల్గొన్నారు.

✧ దక్షిణాఫ్రికాలో ఉండగానే గాంధీ ఆత్మశుద్ధి కార్యక్రమంగా ఉపవాస దీక్షను రూపొందించారు. ఆడంబరం లేని సరళమైన జీవన విధానాన్ని అవలంభించాడు. వ్యక్తి కంటే, కుటుంబం కంటే సమాజమే ముఖ్యమని నమ్మిన గాంధీ కుటుంబం కోసం సంపత్తిని పోగుచేసే ధోరణిని పూర్తిగా విడనాడాడు. మూఢ విశ్వాసాలు లేని ఆస్థికునిగా ఆయన జీవిత బీమాను త్యజించడానికి పురికొల్పింది. కుంభమేళా యాత్రలో భారతదేశ జనబాహుళ్యం దుస్థితిని సన్నిహితంగా పరిశీలించిన గాంధీ కొల్లాయిని మాత్రమే తన వస్త్ర సంపదగా భావించాడు.

✧ దక్షిణాఫ్రికాలో ఉండగా ప్లేగు గురించి గాంధీ పత్రికకు రాసిన లేఖ చదివిన 'ది క్రిటిక్' పత్రికా సంపాదకుడు పోలిక్ ఆయనతో పరిచయం ఏర్పరచుకున్నాడు. జాన్ రస్కిన్ రాసిన 'అన్‌టుద లాస్ట్' గ్రంథాన్ని ఆయన గాంధీకి ఇచ్చాడు. ఆ గ్రంథంతో విశేషంగా ప్రభావితుడైన గాంధీ దాన్ని గుజరాత్‌లోకి అనువదించి, 'సర్వోదయ' అని పేరు పెట్టాడు. ఆ గ్రంథంలో ప్రతిపాదించిన మూడు అంశాలు:

1. సమాజశ్రేయస్సులోనే వ్యక్తి శ్రేయస్సు ఉంటుంది.
2. జీవనోపాధి కోసం చేసే శ్రమలన్నింటికీ సమవిలువ ఉంటుంది.
3. శ్రమతో కూడిన జీవితమే వాంఛనీయమైన జీవితం.. ఈ మూడు అంశాలూ ఆచరణలో పాటించదగినవని గాంధీ భావించాడు.

✧ ప్రముఖ రాజనీతజ్ఞుడైన గోఖలేకు గాంధీలో ఒక యోధుని వ్యక్తిత్వం కనిపించింది. సాధారణ మానవులను సైతం సమున్నత వ్యక్తులుగా మార్చగల ప్రభావశీల వ్యక్తిత్వం ఆయనలో ఉందని గోఖలే గమనించాడు. గోఖలేను తన గురువుగా భావించిన గాంధీ గోఖలే నెలకొల్పిన 'సర్వెంట్ ఆఫ్ ఇండియా'లో చేరాలని కోరాడు.

✧ అహ్మదాబాద్‌లో సబర్మతీ నది తీరాన ఒక ఆశ్రమాన్ని నెలకొల్పి, దానికి 'సత్యాగ్రహ ఆశ్రమం' అని పేరు పెట్టాడు గాంధీ. ఆ ఆశ్రమంలో కుల, మత వివక్షలు లేని, శ్రమను జీవన విలువలు పాటించే సమష్టి జీవన విధానాన్ని ఏర్పరిచాడు.

✧ 1916లో లక్నో కాంగ్రెస్ సభకు హాజరైన గాంధీని కలసిన బీహార్ ప్రతినిధి బృంద సభ్యుడు రాజ్‌కుమార్ శుక్లా, బీహార్‌లోని నీలిమందు రైతు ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలను వివరించి, పరిష్కార సాధనలో సహాయ పడవలసిందిగా కోరాడు. అందుకు అంగీకరించిన గాంధీ 1917 ఏప్రిల్‌లో చంపారన్ జిల్లాకు పోయాడు. ఆయనతో పాటు బీహార్ నాయకులు బాబూ రాజేంద్రప్రసాద్, జెబి కృపలానీ, మహదేవ్ దేశాయ్, మజరల్ హక్ ఆ పర్యటనలో పాల్గొన్నారు.



✧ రెండో ఉద్యమం గుజరాత్‌లోని ఖేడా జిల్లా రైతులకు సంబంధించింది. 1915-18 కాలంలో అక్కడి రైతులు కష్టాల పాలయ్యారు. యుద్ధం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. 1918లో ఏర్పడిన అనావృష్టితో 550 గ్రామాల్లో దుర్భరమైన క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతులు భూమిశిస్తు చెల్లించే పరిస్థితిలోలేరు. భూమిశిస్తు నిబంధన ప్రకారం, నాలుగింట మూడొంతుల పంట నష్టమైతే శిస్తు మాఫీ చేయవలసి ఉంటుంది. రెవెన్యూ అధికారులు సమాచారాన్ని వక్రీకరించడంతో శిస్తు మాఫీ జరగలేదు. 1917లో ఖేడా జిల్లాకు చెందిన మోహన్‌లాల్ పాండ్యాని గాంధీ ఆశ్రయించి, రైతులకు సహాయపడాల్సిందిగా కోరాడు. సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ సభ్యులు విచారణ చేసి, అనావృష్టి కారణంగా రైతులకు నాలుగో వంతు కంటే తక్కువ పంటే దక్కిందని ధ్రువీకరించారు. ఆ పరిస్థితుల్లో శిస్తు వసూలు రద్దు చేయాలి కానీ, ప్రభుత్వం అందుకు సుముఖంగా లేదు. గాంధీ, యువ న్యాయవాది వల్లభాయ్ పటేల్, ఇందులాల్ యాజ్ఞికోలతో కలిసి గ్రామాల్లో పర్యటించి, ఎట్టిపరిస్థితుల్లోనూ శిస్తు చెల్లించవద్దని సలహా ఇచ్చి, ఆ విధంగా శపథం తీసుకోవాల్సిందిగా రైతులను కోరారు. అప్పటికి ప్రభుత్వం శిస్తు వసూలును నిలిపివేయడానికి నిశ్చయించింది.

✧ మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో (1914-1919) జాతీయోద్యమకారులను సమాధాన పరచడానికి, భారత వ్యవహారాల కార్యదర్శి మాంటెంగూ పార్లమెంట్‌లో చేసిన ప్రకటనతో భారతీయులు స్వపరిపాలనను కోరుకోవడం విద్రోహచర్య కాదని బ్రిటన్ అంగీకరించినట్లయ్యింది. అయితే స్వపరిపాలన సాధన కోసం సాగిన హోమ్‌రూల్ ఉద్యమం వివిధ కారణాల వల్ల సమసిపోయింది. ★

భారత వ్యవసాయ శాఖలో 32 ఉద్యోగాలు

భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన క్రాప్స్ డివిజన్ ఒప్పంద ప్రాతిపదికన 32 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఒప్పంద కాల వ్యవధి: ఏడాది.
విభాగాల వారీ ఖాళీలు: నేషనల్ కన్సల్టెంట్-6, కన్సల్టెంట్-4, ప్రోగ్రామ్ మేనేజర్-1, లీడ్ ప్రోగ్రామర్-1, సీనియర్ ప్రోగ్రామర్-1, ప్రోగ్రామర్-1, టెక్నికల్ అసిస్టెంట్-18.
అర్హత: పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ, డాక్టొరేట్ డిగ్రీ, ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు సుదీర్ఘ పని అనుభవం ఉండాలి.
వయసు: ఏప్రిల్ 1, 2018 నాటికి 65 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్‌లో.
దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 22, 2019.
వెబ్‌సైట్: www.indiaseeds.com

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో 13 ఖాళీలు

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 13 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాల వారీ ఖాళీలు: మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్/డీ (డెంటల్ సర్జన్-ప్రోస్థో డాంటిక్స్)-1, మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్/డీ (డెంటల్ సర్జన్-పెరిడాంటాలజీ)-1, మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్/డీ (సైకియాట్రీ)-1, మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్-సీ (జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్)-5, సైంటిఫిక్ అసిస్టెంట్-సీ(మెడికల్ సోషల్ వర్కర్)-1, ఫార్మసిస్ట్ బీ- 2, టెక్నీషియన్/సీ (సీఎస్ఎస్‌డీ-సెంట్రలైజ్డ్ స్టెరిలైజేషన్ సప్లయ్డిపార్ట్‌మెంట్)-1, టెక్నీషియన్/సీ (ఎక్స్-రే/రేడియోగ్రఫీ)-1.
అర్హత: పోస్టును బట్టి హెచ్ఎస్సీ (10+2), సంబంధిత విభాగాల్లో ట్రేడ్ సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ, ఎంబీబీఎస్, ఎండీఎస్, ఎండీ/డీఎన్‌బీ ఉత్తీర్ణత, పని అనుభవం ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష/స్క్రీనింగ్ టెస్ట్/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 25, 2019.
పూర్తి వివరాలకు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.
వెబ్‌సైట్: https://recruit.barc.gov.in

ఓఎన్‌జీసీలో 36 పోస్టులు

సూరత్‌లోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ) హజీరా ప్లాంట్‌లో ఖాళీగా ఉన్న 36 టెక్నికల్ (ఏ-1, ఏ-2 లెవల్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఉద్యోగాలు

పోస్టుల వివరాలు:
అసిస్టెంట్ టెక్నీషియన్ (ఏ-2 లెవల్): 12
విభాగాలు: మెకానికల్-10, ఎలక్ట్రికల్-2.
అర్హత: సంబంధిత విభాగంలో మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా ఉండాలి.
జూనియర్ అసిస్టెంట్ టెక్నీషియన్ (ఏ-1 లెవల్): 21
విభాగాలు: ఫిట్టింగ్-9, డీజిల్-5, ఎలక్ట్రికల్-3, ప్రొడక్షన్-4.
అర్హత: పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో సర్టిఫికెట్ కోర్సు ఉండాలి. **జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్:** 3
విభాగం: కెమిస్ట్రీ, **అర్హత:** బీఎస్సీ (కెమిస్ట్రీ)
వయసు: 18-43 సంవత్సరాల మధ్య ఉండాలి.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
ఎంపిక: రాత పరీక్ష, అకడమిక్ ప్రతిభ, అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్, మెడికల్ టెస్ట్ ద్వారా.
దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 24, 2019.
ఆన్‌లైన్ పరీక్ష (సీబీటీ) తేదీ: ఫిబ్రవరి 24, 2019.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.
వెబ్‌సైట్: www.ongcindia.com

గిరిజన ఉపాధ్యాయుల ర్యాలీ

ప్రజాశక్తి - పెదబయలు (విశాఖపట్నం)

వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ విశాఖ జిల్లా పెదబయలు మండల కేంద్రంలో ఉపాధ్యాయ జెఎసి ఆధ్వర్యంలో గిరిజన ఉపాధ్యాయులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంఘం భవన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ఖాళీ కంచాలను మోగిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ జిఒ 132 అమలును నిలుపుదల చేసినప్పటికీ, ఉపాధ్యాయులకు వేతనాలు అందని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగకు పస్తులుండాల్సిన పరిస్థితులు కల్పించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా జిఒ 132 నిలుపుదలకు సంబంధించి ట్రెజరీలకు ఆదేశాలను పంపి, ఉపాధ్యాయులకు మూడు నెలలుగా రావాల్సిన వేతనాలను తక్షణమే చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు నాయకులు శెట్టి ఉమామహేశ్వరరావు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు శెట్టి ధనుంజయ్, మత్స్య వరప్రసాద్ పాల్గొన్నారు

పడవ పోటీలు



కృష్ణా జిల్లా నాగాయలంకలో జరిగిన పడవ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మండలి బుద్ధప్రసాద్

ముగిసిన పడవ పోటీలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కృష్ణాజిల్లా నాగాయలంక శ్రీరామపాదపుష్కరఘాట్ వద్ద ఎపి పర్యాటకశాఖ, స్వచ్ఛ నాగాయలంక కమిటీ, నాగాయలంక పంచాయతీల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి పడవ పోటీలు సోమవారం ముగిశాయి. ఉత్సాహభరిత వాతావరణంలో సంప్రదాయ పడవ పోటీలు (కోల) పురుషులకు, డ్రాగన్ విభాగంలో స్త్రీ, పురుషులకు విడివిడిగా నిర్వహించారు. కోల విభాగంలో ఫైనల్ పోటీల్లో నాలుగు జట్లు తలపడ్డాయి. ఈ విభాగంలో నాగాయలంకకు చెందిన ఒ.వెంకటేశ్వరరావు జట్టు ప్రథమ, విశ్వనాథపల్లికి చెందిన నాగవరప్రసాద్ జట్టు ద్వితీయ, పెనుమూడికి చెందిన నాగిడి సుబ్రహ్మణ్యం జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. డ్రాగన్ మహిళా విభాగంలో పోటీలు నిర్వహించారు. ఏడు జట్లు పోటీ పడ్డాయి. ఈ విభాగంలో అవనిగడ్డ శ్రీవిజయలక్ష్మి క్రాంతి కాలేజీ (ఎస్‌విఎల్) జట్టు ప్రథమ, శ్రీ మండలి వెంకట కృష్ణారావు బిఇడి కాలేజీ జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. డ్రాగన్ పడవల పురుషుల విభాగంలో జరిగిన పోటీల్లో 26 జట్లు పోటీ పడ్డాయి. ఫైనల్ రౌండ్‌లో ఆరు జట్లు పోటీ పడ్డాయి. పోటీల్లో విశ్వనాథపల్లికి చెందిన నాగవరప్రసాద్ టీం ప్రథమ, నాగాయలంక మండలం ఎదురుమొండి దీవులకు చెందిన ఎస్.నరసింహారావు జట్టు ద్వితీయ, అవనిగడ్డ ఎస్.వి.ఎల్ కాలేజీ జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. ప్రథమ స్థానం సాధించిన జట్టుకు రూ.25 వేలు, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.15 వేలు, తృతీయ స్థానం సాధించిన జట్టుకు రూ.10వేలు క్యాష్ ప్రైజ్‌తో పాటు మెమెంటోలు, సర్టిఫికెట్‌లను అందించారు. డ్రాగన్ పోటీల్లో మహిళా విభాగంలో పాల్గొన్న ప్రతి బృందానికి ఆరు వేల చొప్పున పురుషులకు విజేతలను మినహాయించి మిగిలిన ఒక్కొక్క టీంకు రూ.4 వేలు ప్రోత్సాహకాలు అందించారు. డ్రాగన్ మహిళా విభాగంలో ప్రథమ స్థానం సాధించిన వారికి సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జి జాస్తి చలమేశ్వర్, ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ బహుమతులు అందించారు. కోలా, డ్రాగన్ పడవ పోటీల్లో పురుషుల విభాగంలో విజేతలకు బందరు ఎంపి కొనకళ్ల బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతగా టి.నాగబాబు, ఎం.శ్రీనివాస్‌లు వ్యవహరించారు.

షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం

రూ. 55.30 లక్షలు నష్టం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

కర్నూలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ప్రాంగణంలో వ్యాధి నిరోధక టీకాల భవనంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. మొత్తంగా రూ.55.30 లక్షలు నష్టం జరిగినట్లు సోమవారం డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ జెవివిఆర్‌కె ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు.కర్నూలు, అనంతపురం జిల్లాలకు వ్యాక్సిన్ సరఫరా చేసే జిల్లా ఇమునైజేషన్ కార్యాలయంలో కర్నూలు జిల్లాకు చెందిన 6.4 లక్షల డోసుల వ్యాక్సిన్‌తోపాటు, రోటా వైరస్, ఎంఆర్, డిపిటి, టీటీ వ్యాక్సిన్లు ఉన్నాయి. వీటిని మూడు వాక్యుమ్ కూలర్లు, ఐదు ఐఎల్ఆర్ ఫ్రిజ్‌లు, 5 డిస్ట్రిక్ట్ వ్యాక్సిన్ సెంటర్లు, మూడు రీజినల్ వ్యాక్సిన్ సెంటర్లలో భద్రపరిచారు. ఇవే కాకుండా పల్స్ పోలియో కార్యక్రమానికి రిజర్వులో మరో 20 డీఫ్రీజర్లు ఉంచారు. అగ్ని ప్రమాదంలో ఇమ్యునైజేషన్ కార్యాలయం 60 శాతం కాలిపోయింది. ఫిబ్రవరి 3న జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమానికి వినియోగించాల్సిన వాక్సిన్‌లకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. వ్యాక్సిన్ మొత్తాన్ని ప్రమాదం అనంతరం పక్కనే గల డ్రగ్ స్టోరులో భద్రపరిచారు. సంఘటనపై విచారణ నిమిత్తం వచ్చిన స్టేట్ కోల్డ్ చైన్ అధికారి దేవానంద్ పరిశీలన అనంతరం శీతలీకరణ సామాగ్రికి జరిగిన నష్టాన్ని రూ.9.30 లక్షలుగా తేల్చారు. అంచనాలన్నీ రాష్ట్ర స్థాయి అధికారుల పరిశీలన, తక్షణ అనుమతుల కొరకు వెంటనే పంపించారు.

పొగ మంచుతో విమానాలు ఆలస్యం

ప్రజాశక్తి - గన్నవరం

దట్టమైన పొగమంచు కారణంగా విజయవాడకు రావాల్సిన పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి. సోమవారం ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్ నుంచి విజయవాడకు రావాల్సిన ఎయిర్ ఇండియా విమానం 8.30 గంటలకు చేరుకుంది. ఉదయం 8.30 గంటలకు ఢిల్లీ నుంచి రావాల్సిన ఎయిర్ ఇండియా విమానం 9 గంటలకు ల్యాండ్ అయ్యింది. చెన్నై నుంచి 7.30కి రావాల్సిన స్పైస్‌జెట్ సర్వీసు 9.40 గంటలకు చేరుకుంది. తెల్లవారుజాము నుంచి మంచు దట్టంగా వ్యాపించి ఉండడంతో విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. దీంతో హైదరాబాద్, ఢిల్లీ వెళ్లడానికి వచ్చిన ప్రయాణికులు ఒకింత ఇబ్బందికి గురయ్యారు. అయితే 9.40 నుంచి విమాన సర్వీసులు యధాతథంగా నడిచాయి.

ప్రజ్ఞ

జవాబులు

1.జమ్మూ కశ్మీర్
2.ప్యాడీ ఆప్టన్
3.కుమార్ రాజేష్ చంద్ర
4.అరుణాచల్ ప్రదేశ్
5.చైనా

భూ బకాసురుల దిష్టిబొమ్మ దహనం

- అనంత, కడపల్లో నిరసనలు
- అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్/ బ్రహ్మంగారిమఠం

అనంతపురం జిల్లాలో ప్రభుత్వ భూములపై నకిలీ పాసుపుస్తకాలు సృష్టించి కబ్జా చేస్తున్న సంఘటనలపై తక్షణం విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం టవర్‌క్లాక్ వద్ద భూబకాసురుల దిష్టిబొమ్మలను బోగి మంటల్లో దహనం చేశారు. ఆ సమయంలో టూ టౌన్ ఎస్‌ఐ లింగన్న, కానిస్టేబుల్ చత్రు నాయక్‌లు అడ్డుకున్నారు. తాము చెప్పినట్టు వినాలని పరుష పదజాలంతో సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, తోటి నాయకలను దూషించారు. దీంతో సిపిఎం నాయకులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మూడో పట్టణ సిఐ మద్దిలేటి, ఎస్‌ఐ క్రాంతిలు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురికి సర్దిచెప్పారు.



కడపలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

భూకబ్జాదారులను అరెస్టు చేయాలి : రాంభూపాల్

గతంలో రోడ్లు, కాంట్రాక్టులు చేసి అక్రమాలకు పాల్పడే కొందరు రాజకీయ నాయకులు నేడు ఏకంగా వేల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. కొంత మంది అవినీతి రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రభుత్వ భూములను గుర్తించడం, పాసుపుస్తకాలు సృష్టించుకోవడం, బ్యాంకుల్లో రుణాలు పొందుతున్నారని అన్నారు. గత మూడు సంవత్సరాల్లో 5 మండలాల్లోనే 12 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ఈ రకంగా కబ్జా చేశారన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోపాల్, చంద్రశేఖర్ రెడ్డి, బిహెచ్.రాయుడు, రామిరెడ్డి, ఓబులేసు, వై.నాగరాజు, నాయకులు ప్రకాష్, నాగప్ప, సికిందర్, వలి పాల్గొన్నారు.



అనంతపురంలో భూ బకాసురుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

కడపలోనూ...

మండల రెవెన్యూ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఐదు రోడ్ల కూడలిలో రెవెన్యూ అధికారుల అవినీతికి నిరసనగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి అందులో అధికారుల దిష్టిబొమ్మను దహనం చేశారు. శివకుమార్ మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు రైతుల భూములను ఆన్‌లైన్ చేసే పేరుతో వేలాది రూపాయల లంచాలు తీసుకుంటున్నారని విమర్శించారు. భూ ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం రైతులు, ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



భోగి మంటల వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు

భోగి మంటల వద్ద కార్మికుల నిరసన

ప్రజాశక్తి- సాలూరు (విజయనగరం జిల్లా)

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని గతంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంపై సోమవారం విజయనగరం జిల్లా సాలూరు పట్టణంలో భోగి మంట వద్ద మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.వై.నాయుడు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భోగి మంటల్లో కలిపేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా హామీలను పట్టించుకోలేదన్నారు.

కనీసం వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. మున్సిపాలిటీలో కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచుతూ 151 జిఒ విడుదల చేసినా, నేటికీ ఎరియర్స్ ఇవ్వలేదని చెప్పారు. కార్మికులకు యూనిఫారాలు ఇస్తామని, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదని పేర్కొన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాల విషయమై వచ్చే ఎన్నికల్లోనైనా రాజకీయ పార్టీలు స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి స్పందించకపోతే ఆ పార్టీని ప్రజలు భోగి మంటల్లో వేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.వెంకటరావు, టి.శంకరరావు బి.గంగరాజు, పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతిలో కూర'గాయాలు'

- అమాంతంగా పెరిగిన ధరలు
- కొనలేమంటున్న వినియోగదారులు

ప్రజాశక్తి- యంత్రాంగం

పేద, మధ్య తరగతి ప్రజలపై రోజురోజుకూ భారాలు అధికమవుతున్నాయి. సంక్రాంతిలో అన్ని రకాల ధరలు ఆకాశాన్నంటాయి. పప్పులు, నూనెలు, బట్టలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ఇప్పటికే గుడ్డు, చికెన్, మటన్, చేపల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి.

రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలను చూసి సామాన్యులు లబోదిబోమంటున్నారు. పెథాయ్, తిత్లీ తుపాన్ల ప్రభావం ఒకవైపు, అన్ సీజన్, ఉత్పత్తి లేకపోవడం వంటి కారణాలతో వీటి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న కూరగాయల ధరల నేపథ్యంలో గతం కంటే రెట్టింపు ఖర్చు చేయాల్సి వస్తోందని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. రెండువారాల క్రితం ధరలతో పోల్చితే ఇప్పటి ధరల పెరుగుదలలో వ్యత్యాసం బాగా కనిపిస్తుంది. గతంలో కిలో టమోటా రూ.20 ఉండగా ఇప్పుడు కాకినాడలో రూ.25- విజయనగరంలో రూ.45 ఉన్నాయి. కిలో బెండకాయలు రూ.30 ఉండగా, ఇప్పుడు కాకినాడలో రూ.60కి, విజయనగరంలో 40కి చేరాయి. మిగతావి రెండో జిల్లాలో ఒకే విధంగా ధరలు పెరిగాయి. దొండకాయలు రూ.20-రూ.40, బీర కాయలు రూ.30-రూ.60, ఉల్లిపాయలు రూ.15-రూ.20, ఆనబకాయ (సొరకాయ) ఒకటి రూ.10-రూ.30కి, అల్లం రూ.80-రూ.100కి, కాలీఫ్లవర్ రూ.10-రూ.20కి, క్యాప్సికం రూ.45-రూ.50కి, బీట్‌రూట్ రూ.25-రూ.30 వరకూ పెరిగాయి. చిక్కుడు రూ.40-రూ.60కి చేరగా, క్యారెట్, మిర్చి ధరలు రూ.30 పలుకుతూ నిలకడగానే ఉంది. బంగాళా దుంపలు ఆగ్రా, కలకత్తా నుంచి, ఉల్లిపాయలు సోలాపూర్, మహారాష్ట్ర, పూణే, హైదరాబాద్ నుంచి కాకినాడ జిల్లాకు నిత్యం దిగుమతి అవుతుండటం వల్ల వాటి ధరలు పెరుగుదలలో తేడాలు లేవు. మిగిలిన కూరగాయలు గొల్లప్రోలు, పిఠాపురం మండలాలతోపాటు మెట్ట ప్రాంతాల్లో ఎక్కువగా పండుతున్నాయి. అన్ సీజన్ కారణంగా పంటల ఉత్పత్తి తగ్గి, ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. మరింతగా పెరిగే అవకాశాలున్నట్లు వారు వివరిస్తున్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో మూడు రైతుబజార్లు ఉన్నాయి. వాటిలో వేలాది మంది రోజూ కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. మరోవైపు హోల్‌సేల్ మార్కెట్‌గా పేరొందిన పిడబ్ల్యు మార్కెట్... బెల్లం, పప్పులు, నూనెలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులతో కిటకిటలాడింది. ఇప్పటికే మాంసాహార రేట్లు పెరగ్గా, ఈ పండుగలో శాకాహారంతో సరిపెడదామనుకున్న సామాన్యులకు పెరుగుతున్న కూరగాయల ధరలు పెద్ద షాకిచ్చాయి.

మాంసాహారం ప్రియం

కాకినాడలో గుడ్డు ధర ప్రస్తుతం మార్కెట్లో రూ.5.50కి అమ్ముతున్నారు. గతంలో కిలో బ్రాయిలర్ చికెన్ రూ.150 ఉండేది. ఇప్పుడు రూ.200కి అమ్ముతున్నారు. అలాగే మటన్ కిలో రూ.500 ఉండగా, 20 రోజులుగా రూ.600-రూ.650కి పెరిగింది. చేపల ధరలు కొంతమేర పెరిగినట్లు వినియోగదారులు చెబుతున్నారు.

విశాఖపట్నం కశింకోట మండలంలో తాళ్లపాలెం వారపు సంతలో పొట్టేళ్లు, నాటుకోళ్లకు గిరాకీ ఏర్పడింది. నాటు కోడి రూ.300 నుంచి వెయ్యి, కోడి పుంజెలు రూ.1500 నుంచి రూ.5వేలు, గొర్రెపోతులు రూ.5వేల నుంచి 14వేల వరకు ధరలు పలికాయి. గత ఏడాది కంటే ధరలు అధికంగా పెరిగాయని వినియోగదారులు పేర్కొన్నారు.

పవన్‌ను ప్రజలు స్వాగతిస్తున్నారు

నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - తెనాలిటౌన్ (గుంటూరు జిల్లా)

రాజకీయాల్లో మార్పు కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలు నిండు మనస్సుతో స్వాగతిస్తున్నారని ఆ పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా తెనాలిలో పవన్ పర్యటన విజయవంతం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా తెనాలి కొత్తపేటలోని తన నివాసంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. జనసైనికులు ఎంతో క్రమశిక్షణతో జయప్రదం చేశారని, పోలీసులు, ప్రజల సహకారం పూర్తిగా లభించిందని అన్నారు. వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో పవన్ కల్యాణ్ ఫిబ్రవరి రెండో వారంలో రైతులతో సదస్సులు నిర్వహించి పార్టీ విధానాన్ని ప్రకటిస్తారన్నారు. 'జాగోరే జాగో' కార్యక్రమం యువతను మేల్కొల్పేందుకేనని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువకులు గ్రూపుగా స్థానిక సమస్యలపై చర్చించి పార్టీ దృష్టికి తేవాలని కోరారు.

అభివృద్ధి సంక్షేమంపై తీవ్ర అసంతృప్తి

తన హయాంలో పదేళ్ల పాటు తెనాలి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి ఈ నాలుగన్నరేళ్లలో కుంటుపడిందని మనోహర్ అన్నారు. సంక్షేమ కార్యక్రమాలూ అర్హులకు అందడం లేదని, పక్షపాతం చూపుతున్నారని విమర్శించారు. తెనాలిని శాటిలైట్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో జనసేన నాయకులు టి.వెంకటరమణారావు, ఎం.రవికుమార్, టి.పానకాలరావు, జిఎస్.రఘు, జిఎస్.రాము, ఎ.నారాయణరెడ్డి, టి.బుచ్చిబాబు, జాకీర్, సిహెచ్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 19న మాదిగ విశ్వరూప మహాసభ

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 19న 'మాదిగ విశ్వరూప మహాసభ' నిర్వహించనున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ తెలిపారు. నవ్యాంధ్ర రాజధానిలోని కాజ గ్రామం వద్ద 10 లక్షల మందితో ఈ సభ ఉంటుందన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్‌సి రిజర్వేషన్ చేశారన్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో అవి రద్దయ్యాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు లక్షల మంది జనాభా అధికంగా ఉన్న కారణంగా సాంఘిక సంక్షేమశాఖ, ఎస్‌సి కార్పొరేషన్, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ వంటి కీలక పదవులు మాలలకు కట్టబెట్టారని చెప్పారు. రాజకీయ పార్టీల అధినేతలు మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో జనవరి 20వ తేదీ నుంచి అన్ని రాజకీయ పార్టీలను కలిసి మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామన్నారు. విశ్వరూప మహాసభకు అందరినీ వచ్చి వర్గీకరణ అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ, అర్బన్ ఇన్‌ఛార్జిలు మందా వెంకటేశ్వరరావు, మానికొండ శ్రీధర్, కంపాటి వెంటకేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షులు పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చాకలికొండలో భూప్రకంపనలు

ప్రజాశక్తి-వింజమూరు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండలం, చాకలికొండ, బత్తినవారిపల్లి గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 3.28 గంటలకు కొన్ని సెకన్లపాటు భూప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు రోడ్డు మీదకు పరుగులు పెట్టారు. గతంతో పోలిస్తే దీని తీవ్రత ఎక్కువగా లేదని గతంలో రిక్టర్ స్కేలుపై 4.5 వచ్చినప్పుడు శాస్త్రవేత్తలు ఢిల్లీ నుంచి వచ్చి దీనిపై పరిశోధనలు చేసి భూమిలోని పొరల రాపిడి వల్ల ఇలా జరిగి ఉంటుందని పేర్కొన్నారు. ఏదేమైనా ఇక్కడి ప్రాంత వాసులు భయంతో బతకాలంటే జీవనం దుర్భరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొలాల్లోనే పండగ.. గుడారాల్లోనే జీవనం..

- వలస కార్మికుల వెతలు
- వ్యవసాయ పనుల్లో కర్నూలు కార్మికులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి/పెదకూరపాడు/ప్రత్తిపాడు

కర్నూలు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో వలస కార్మికులు గుంటూరు జిల్లా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని మిర్చి కోతలు, పత్తి తీయడానికి వలస కార్మికులు పెద్దసంఖ్యలో వచ్చిన కూలీలు మూడు నెలలుగా ఇక్కడే ఉంటున్నారు. సంక్రాంతి పండగకూ వారు సొంతూళ్లకు వెళ్లకుండా ఇక్కడే పొలాల్లో గుడారాల్లో పండుగ చేసుకుంటున్నారు. కర్నూలు జిల్లాలో కరువు తీవ్రంగా ఉండటంతో వ్యవసాయ పనుల్లేక గుంటూరు జిల్లాకు వలసొచ్చారు. కొంత మంది క్రిస్మస్ పండుగకు సొంత ప్రాంతాలకు వెళ్లి వచ్చారు. జిల్లా మొత్తం మీద సాగర్ ఆయకట్టు పరిధిలో 20 మండలాల్లో వలస కార్మికులు పనిచేస్తున్నారు. వీరి సంఖ్య ఆరు నుంచి 10 వేల వరకు ఉంటుందని అంచనా. వీరిలో కొద్ది మంది మాత్రం సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లగా 80 శాతం మంది మాత్రం ఇక్కడే ఉండిపోయారు. ప్రత్తిపాడు, పెదకూరపాడు, సత్తెనపల్లి, తాడికొండ, నర్సరావుపేట నియోజకవర్గాల్లో వలస కార్మికులు పనిచేస్తున్నారు. ఈ ఏడాది మిర్చి దిగుబడులు తగ్గడం, పనులు లేకపోవడంతో గతంతో పోల్చుకుంటే కర్నూలు, మహబూబ్‌నగర్, కర్నాటక నుంచి ఈ ఏడాది తక్కువ మంది వచ్చారని అధికార వర్గాలు తెలిపాయి. వలసొచ్చిన వారికి వసతులు నామామాత్రమే. పొలాల్లో, ఊరిచివర దేరాలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వీరికి కనీస వసతుల్లేవు. వారానికి ఒకటి రెండు సార్లు స్నానం చేయడం, మలమూత్రాలకు పొలం వద్దకానీ, మార్గమధ్యలో ముగించుకుంటున్నారు. మరో నెలలో పొలం పనులు ముగియనున్నాయి. రోజు వారీ కూలికి అదనంగా పండుగపూట రైతులు కుటుంబానికి రూ.200 నుండి 300 వరకు ఇస్తుంటారు. వాటితో తమకు కావలసినవి కొనుగోలు చేసుకుంటారు తప్ప ప్రత్యేకంగా పండగ చేసుకునే పరిస్థితి లేదు. పలువురు కార్మికులు మాట్లాడుతూ జన్మనిచ్చిన ఊరు కాసింత కూడు పెట్టలేకపోయిందని, బతుకుదెరువు కోసం సొంత ఇంటిని, ఊరును వదిలి పెట్టి ఇక్కడికి వచ్చామని ఆవేదన వెలిబుచ్చారు. ప్రతి ఏటా తాము ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్తున్నాం.. గుంటూరు జిల్లాకు ఎక్కువగా వచ్చిపోతుంటాం.. చాలీచాలని గుడారాలతో బిక్కుబిక్కుమంటూ సంచార జీవనం సాగిస్తున్నాం.. అని చెప్పుకొచ్చారు.




లగడపాడులో వలస కూలీల గుడారాలు



గుడారాల వద్ద వంట చేస్తున్న మహిళా కూలీలు


పత్తి ఎండిపోయింది



మా ఊళ్లో 13 ఎకరాల్లో పత్తి సాగు చేశా. నీటి సదుపాయం, వర్షాల్లేక ఎండిపోయింది. 13 ఎకరాలకు 13 క్వింటాల దిగుబడి వచ్చింది. ధరలేక గిట్టుబాటు కాక రైతుగా ఉండాల్సిన నేను కూలికి వచ్చా. పండగ ఇక్కడే చేసుకుంటున్నాం. గంజి నీళ్లతో గొంతు తడుపుకోవాల్సిన దినాలు దాపురించాయి. బువ్వ కావాలంటే పరాయి ప్రాంతాలకు వలసెళ్లాల్సిన గతి పట్టింది. కష్టాలను కన్నీళ్లను బాధను భుజాన వేసుకొని పనుల కోసం పరాయి పల్లెలకు వచ్చాం.

వెంకటేష్, గుత్తి, ఆదోని మండలం, కర్నూలు జిల్లా


ఏ ఊర్లో పని దొరికితే అక్కడే నివాసం



చాలీచాలని గుడారాలతో బిక్కుబిక్కుమంటూ తుషారంతో సంచారం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. 70 మంది వరకూ ప్రత్తిపాడు ప్రాంతానికి వచ్చాం. పత్తి తీస్తే కిలోకి రూ.8 ఇస్తున్నారు. ప్రత్తిపాడు, పాతమల్లయ్యపాలెం, కోయవారిపాలెం, కొండేపాడు, గొట్టిపాడులో మా జిల్లా వారు పని చేస్తున్నారు.

తిమ్మమ్మ , మంత్రాలయం, కర్నూలు జిల్లా

మా సొంతూళ్లో పనుల్లేవు



మా ఊళ్లో పనుల్లేవు. పండగకు మా గ్రామానికి వెళ్దామంటే డబ్బు లేదు. పత్తి తీస్తే రోజుకు రూ.200 నుంచి రూ.300 వరకూ కూలి వస్తోంది. సంక్రాంతికి వెళ్లడం లేదు. ఉగాదికి వెళ్తాం. ప్రభుత్వం మా గ్రామంలో ఎటువంటి సాయం చేయకనే ఇంత దూరం వచ్చాం.

సోమశేఖర, గొల్లలదొడ్డి, గోనుగుళ్ల మండలం, కర్నూలు జిల్లా.

పుట్టగొడుగుల్లా మసాజ్, స్పా సెంటర్లు

కోడ్ లాంగ్వేజ్‌తో సాగుతున్న అశ్లీలత
కాలేజీ విద్యార్థులే టార్గెట్‌గా డ్రగ్స్ అమ్మకాలు
అరకొర దాడులతో సరిపెడుతున్న పోలీసులు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

రాజధాని కేంద్రమైన విజయవాడలో పాశ్చత్య సంస్కృతి తాండవం చేస్తోంది. మసాజ్, స్పా సెంటర్ల చాటున వ్యభిచారం విస్రుంఖలంగా సాగుతోంది. ఆయా సెంటర్ల నిర్వాహకులు నిరుద్యోగ యువతకు ఉపాధి పేరుతో వల వేసి వారి ఆర్థిక అవసరాలను అడ్డంపెట్టుకుని అమాయక యువతులను వ్యభిచార కూపంలోకి లాగుతున్నారు. గతంలో బందరు రోడ్‌లోని పలు మసాజ్‌సెంటర్లలో ఈ తరహా విపరీత ధోరణులు పోలీసుల దాడుల్లో బయట పడగా సరైన రీతిలో నిర్వాహకులపైచర్యలు తీసుకున్న పరిస్థితి లేదు. తాజాగా బందరు రోడ్‌లోని ఓ మాల్‌లో మసాజ్, స్పా సెంటరులో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులలో విదేశీ యువతులు పట్టుబడటం వారంతా కనీసం వర్కింగ్ వీసా కూడా లేకుండా నగరంలో ఉండటంతో పోలీసు వర్గాల్లో అలజడి మొదలైంది. ముంబాయి, ఢిల్లీ వంటి నగరాల నుండే కాకుండా థాయ్‌లాండ్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుండి అక్కడి పేద యువతులను తీసుకువచ్చి ఇక్కడ మసాజ్‌సెంటర్లను నడుపుతున్నారనే సమాచారం పోలీసుల వద్ద సైతం ఉంది.బందరు రోడ్, ఏలూరు రోడ్, పటమట, పెనమలూరు తదితర ఏరియాల్లో ఉన్న అనేక మసాజ్, స్పా సెంటర్లలో కోడ్ లాంగ్వేజ్‌లో ఇటువంటి అసాంఘీక కార్యకలాపాలు సాగుతున్నాయని తెలుస్తోంది. ప్రారంభ ధర రూ.2500 నుండి మొదలై రూ.20 వేల వరకు ఉంటుందని సమాచారం.మసాజ్ సెంటర్లపై పూర్తి వేటు వేయడానికి పోలీసులకు సైతం పూర్తి స్థాయి అధికారాలు లేవని సమాచారం. నిబంధనలు మీరినప్పుడే వాటి నిర్వాహకులపై పోలీసులు వేటు వేసే ఆస్కారం ఉంటుందని తెలుస్తోంది. ఆయా సెంటర్లలో బాడీ టూ బాడీ మసాజ్, ఆయిల్ మసాజ్‌లు, మగ వారికి మగ వారు, ఆడవారికి ఆడవారే మసాజ్ చేయాలని, గదిలో తలుపులు తీసే చేయాలన్న నిబంధనలు పాటించడం లేదు.కాలేజీ విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని డ్రగ్స్ అమ్మకాలు సాగిస్తున్నారని, ఇప్పటికైనా నగరపోలీసులు మసాజ్, స్పా సెంటరులపై పూర్తి స్థాయిలో దృష్టిసారించి ఇటువంటి అసాంఘీక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసామని పోలీసులు ప్రకటనలు గుప్పించడం కాదని పలువురు అంటున్నారు, ఆ రీతిలో కార్యాచరణకు దిగకపోతే రానున్న కాలంలో విజయవాడ నగరం మరో ముంబాయి అవుతుందంటున్నారు.

మూడు సీట్లపైనే పెండింగ్..

కాంగ్రెస్‌తో పొత్తుపై ఎన్‌సిపి అధ్యక్షుడు పవార్

ముంబై : రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మహారాష్ట్రలో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా 3 మూడు తప్ప మిగతా సీట్లు సర్దుబాటు అయినటు ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్ ఆదివారం తెలిపారు. రాజ్‌థాకరే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేనతో తమ పార్టీ జట్టు కడుతున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. పొత్తులపై చర్చలు మరో వారంలో ముగుస్తాయన్నారు. సీట్ల పంపకంపై చర్చించేందుకు గత వారంలో రాహుల్ గాంధీని కూడా కలిశానని తెలిపారు. పెండింగ్ సీట్లలో ఎవరు పోటీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పవార్ అన్నారు. తమకు కేటాయించిన సీట్లలో ఒకటి 'స్వాభిమాని షెట్కారీ సంఘటన' రైతు సంఘం నేత, ప్రస్తుత ఎంపీ రాజు శెట్టికి కేటాయించనున్నట్లు పవార్ వెల్లడించారు.

మకర సంక్రాంతి సాంప్రదాయక దుస్తులు ధరించి మకర సంక్రాంతిని ఉత్సాహంగా జరుపుకుంటున్న అమృత్‌సర్‌లో విద్యార్థులు



చట్టం కాకముందే విచారణ కుదరదు

పౌరసత్వ బిల్లుకు సవరణపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీం

న్యూఢిల్లీ : పౌరసత్వ (సవరణ) బిల్లును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సోమవారం సుప్రీంకోర్టు పెండింగ్‌లో పెట్టింది. బిల్లు చట్టరూపంలోకి రాకముందే విచారణ చేపట్టడం కుదరదని పేర్కొంది. లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభలో పెండింగ్‌లో వుంది. ఆ పిటిషన్‌ను తగిన సమయంలో దాఖలు చేయాలని పిటిషనర్‌కు సూచించింది. వివాదాస్పద పౌరసత్వ చట్ట బిల్లును ప్రతిపక్ష ఎంపీల ఆందోళనల మధ్య ఈ నెల 8న లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఈశాన్య రాష్ట్రాలలో ఆందోళనలు, ఘర్షణలు వెల్లువెత్తుతున్న సంగతి తెల్సిందే. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్‌ల నుండి వచ్చి ఆరేళ్ళుగా భారత్‌లో నివసిస్తున్న హిందువులు, బౌద్ధులు, సిక్కులు, జైనుల, పార్సీలు, క్రైస్తవులకు భారత పౌరసత్వం కల్పించేందుకు వీలుగా 1955 నాటి పౌరసత్వ చట్ట బిల్లును సవరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆ వలసదారుల వద్ద తగిన పత్రాలు లేక పోయినప్పటికీ ప్రతిపాదిత బిల్లు వారికి పౌరసత్వం కల్పించనున్నది.

బులంద్‌షహర్ నిందితులపై జాతీయ భద్రతా చట్టం కింద అభియోగాలు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో గత నెలలో చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణలకు కారణమైన ఏడుగురు నిందితులపై జాతీయ భద్రతా చట్టం (ఎన్‌ఎస్‌ఎ) కింద కేసు నమోదు చేసినట్లు సంబంధిత అధికారులు సోమవారం తెలిపారు. బులంద్‌షహర్ ప్రాంతంలో గో వధ జరిగిందని పేర్కొంటూ కాషాయ గూండాలు హింసాకాండ సృష్టించారు. ఈ సంఘటనల్లో ఒక పోలీసు అధికారి, ఒక పౌరుడు మృతి చెందారు. జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదు చేసిన అధికారులు నిందితుల పేర్లను మాత్రం వెల్లడించలేదు. హిందూత్వ సంస్థ బజరంగదళ్ జిల్లా నేత, ఈ కేసులో ప్రధాన నిందితుడైన యోగేష్ రాజ్‌ను ఈ నెల 3న పోలీసులు అరెస్టు చేశారు. బులంద్‌షహర్‌లో జరిగిన హింసాత్మక సంఘటనల్లో పోలీసు ఇన్‌స్పెక్టర్ సుబోధ్ కుమార్ సింగ్, స్థానికుడు సుమిత్‌లు మృతి చెందిన నెల రోజుల తరువాత యోగేష్ రాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

తెలియని గని కార్మికుల ఆచూకీ

గాలింపుకు అదనపు బృందాలు

గువహతి : మేఘాలయాలో అక్రమ బొగ్గు గని కూలి నెల రోజులు గడిచినా అందులో చిక్కుకుపోయిన 15 మంది కార్మికుల ఆచూకీ ఇంకా తెలియలేదు. వారు ప్రాణాలతో ఉంటారనే ఆశలు సన్నగిల్లుతున్నప్పటికీ గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గనిలో చిక్కుకుపోయిన కార్మికులను వెలికి తీసే చర్యల్లో భాగంగా మరో ఐదు నిపుణుల బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. హైదరాబాద్‌కు చెందిన జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, రూర్కీకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ సంస్థలతోపాటు చెన్నైకి చెందిన బృందాలు గాలింపు చర్యల్లో పాలు పంచుకున్నాయి. ఇప్పటికే ఎన్‌డిఆర్‌ఎఫ్ గాలింపు చర్యలను కొనసాగిస్తున్నది. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలకు నావికాదళం, ఒడిషా అగ్నిమాపక దళ సిబ్బంది, కోల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన సిబ్బంది సహాయ పడుతున్నారు.

సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు ఊరట

నిరాహార దీక్షపై దాఖలైన పిటిషన్ కొట్టివేత



న్యూఢిల్లీ : గత ఏడాది జూన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయానికి వెలు పల ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేపట్టిన నిరాహార దీక్ష రాజ్యాంగ విరుద్ధమని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. ముఖ్య మంత్రి నిరాహార దీక్షపై ఉత్తర్వులు జారీ చేయాలని మీరు కోరుకుంటున్నారా అని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్ వ్యాఖ్యానించారు. గత నాలుగు నెలలుగా ఐఎఎస్ అధికారులు చేపడుతున్న నిరసనలను వ్యతిరేకిస్తూ గత ఏడాది జూన్ 11 న లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ కార్యాలయం వద్ద కేజ్రీవాల్, డిప్యూటీ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆరోగ్య మంత్రి సత్యేందర్ జైన్, గ్రామీణా భివృద్ధిశాఖ మంత్రి గోపాల్ రాయ్ నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తమ ప్రభుత్వ కార్యాకలాపాలను అడ్డుకునేందుకు ఈ అధికారులకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తోందని, లెఫ్టినెంట్ గవర్నర్ ఈ దీనిపై జోక్యం చేసుకోవాలని కేజ్రీవాల్, తదితరులు నిరాహార దీక్షకు దిగారు. తొమ్మిది రోజుల అనంతరం ఈ దీక్షను విరమించారు.

కర్ణాటకలో ఆపరేషన్ లోటస్

- బిజెపి 'వల'లో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- కుట్రలను తిప్పికొడతాం : శివకుమార్



బెంగళూరు : రాష్ట్రంలో కాంగ్రెస్-జెడిఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఆపరేషన్ కమలం పేరుతో బిజెపి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ కుట్ర నిజమేనని, కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ముంబయిలోని ఒక హోటల్‌లోని బిజెపి నేతలతో భేటీ అయ్యారని జల వనరుల శాఖ మంత్రి డికె శివకుమార్ ఆదివారం తెలిపారు. అక్కడ ఏం జరిగిందో, తమ శాసనకర్తలను ఏవిధంగా ప్రలోభాలకు గురిచేశారో తమకు తెలుసునని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కుట్రను తమ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కుమార స్వామితో పాటు సిద్ధరామయ్య దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. 'వేచి చూద్దాం' అన్న మెతక వైఖరిని ముఖ్యమంత్రి ప్రదర్శిస్తున్నారని 'ట్రబుల్ షూటర్' గా పేరొందిన శివకుమార్ ఆరోపించారు. కుమారస్వామి స్థానంలో తాను ఉంటే ఈ కుట్రను తిప్పికొడతానని వ్యాఖ్యానించారు. ఈ ఆపరేషన్‌లో బిజెపి విజయం సాధించదని అన్నారు.

సజ్జన్ పిటిషన్‌పై సిబిఐకి సుప్రీం నోటీసులు


న్యూఢిల్లీ : 1984నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో జీవిత ఖైదు విధించిన ఢిల్లీ కోర్టు తీర్పును సవాలు చేస్తూ సజ్జన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సిబిఐకి సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు పంపింది. ఈ కేసులో తనను దోషిగా తేలుస్తూ గత నెల ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సజ్జన్ డిసెంబరు 22న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను పరిశీలించిన చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్‌తో కూడిన ధర్మాసనం తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. 1984 సిక్కుల ఊచకోత కేసులో సజ్జన్‌ను దోషిగా నిర్ధారిస్తూ ఢిల్లీ హైకోర్టు ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించడంతో ఆయన కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ అదితి గార్గే ఎదుట సజ్జన్ లొంగిపోయాడు. ఆయనను పోలీసులు తూర్పు ఢిల్లీలోని మందోలి జైలుకు తరలించారు.

16 కుక్క పిల్లలను చంపిన మహిళా నర్సులు

కోల్‌కతా : ఇద్దరు మహిళా నర్సులు 16 కుక్కపిల్లలను ఘోరంగా చంపిన దారుణమైన ఘటన స్థానిక ఎన్‌ఆర్‌ఎస్ వెటర్నరీ ఆస్పత్రి ఆవరణలో చోటు చేసుకుంది. ముక్కలుగా చేసిన వాటి మృతదేహాలను చెత్త కుప్ప నుండి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, కుక్క పిల్లలను పదునైన ఆయుధంతో పొడవడంతో పాటు వాటి తలలను వేరు చేయడంతో మృతిచెందినట్లు పోస్ట్ మార్టమ్ నివేదికలో వెల్లడైంది. కాగా, ఇద్దరు నర్సులు కుక్కపిల్లలను చంపుతున్న వీడియో సోమవారం విడుదలవడంతో జంతు ప్రేమికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై డిప్యూటీ సూపరింటెండెంట్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించినట్లు అధికారులు తెలిపారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడంపై డాగ్ లవర్స్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు జంతు హక్కుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డాగ్ లవర్స్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి సుచేతనా చటోపాధ్యాయ డిమాండ్ చేశారు.

ఎన్‌కౌంటర్లు తీవ్రమైన అంశం

సుప్రీం కోర్టు వ్యాఖ్య



న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హయాంలో జరిగిన 1,100 పోలీస్ ఎన్‌కౌంటర్‌లపై సిబిఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం పరిశీలించింది. దీనిని తీవ్రమైన అంశంగా సుప్రీం పరిగణించింది. ఈ ఎన్‌కౌంటర్లలో 49 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా, 370 మంది గాయపడ్డారని పిటిషన్ పేర్కొంది. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(పియుసిఎల్) అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్‌లతో కూడిన ధర్మాసనం పోలీసుల ఎన్‌కౌంటర్లను 'తీవ్ర అధికార దుర్వినియోగం'గా అభివర్ణించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది. గతేడాది జులైలో దాఖలైన పిటిషన్‌పై తన స్పందనను తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. మానవ హక్కులు, పౌర స్వేచ్ఛను బహిరంగంగా కాలరాసిన ప్రభుత్వం పోలీసు ఎన్‌కౌంటర్లకు ఆమోద ముద్ర వేసిందని పిటిషన్‌లో పేర్కొంది. నేరస్తులు జైలులో ఉండాలి లేదా ఎన్‌కౌంటర్‌లో చావాలని, సమాజంలో అశాంతి సృష్టించిన వారికి తుపాకులు సమాధానాలు చెబుతాయంటూ యోగి చేసిన పలు వ్యాఖ్యలను పిటిషన్‌లో పేర్కొంది. ఈ వ్యాఖ్యలపై స్పందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ లేఖ రాసిందని తెలిపింది. ఎన్‌హెచ్‌ఆర్‌సికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదికల ప్రకారం.. జనవరి 2017 నుండి 2018 మార్చి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో 45 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎఫ్‌ఐఆర్, మేజిస్టీరియల్ విచారణ, న్యాయవిచారణ ఆధారంగా ఈ ఎన్‌కౌంటర్‌లపై దర్యాప్తు చేపట్టాలని పిటిషన్ పేర్కొంది.

ప్రాథమికోన్నత తరగతులకు 220 పనిదినాలు తప్పనిసరి

ఢిల్లీ ప్రభుత్వం ఆదేశం

న్యూఢిల్లీ : రానున్న విద్యా సంవత్సరం నుండి ప్రాథమికోన్నత తరగతులు కనీసం 220 రోజుల పాటు నిర్వహించాలని రాజధానిలోని అన్ని పాఠశాలలకు ఢిల్లీ ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాలు ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వర్తించనున్నాయి. విద్యాసంవత్సరం నుండి ప్రాథమికోన్నత తరగతులకు తప్పనిసరిగా 220 పనిదినాలను నిర్వహించాలని, విద్యాహక్కు చట్టం(ఆర్‌టిఎ)లో పేర్కొన్న నియమానికి కట్టుబడి ఉండాలి అని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఆదేశించింది. ఈ పని దినాల నిర్వహణ సంబంధిత పాఠశాలల యాజమాన్యానికే వదిలేస్తున్నామని, విద్యాసంవత్సర క్యాలెండర్‌లో కనీస పనిదినాలు, సెలవులను ముందుగానే ప్రకటించాలని పేర్కొంది.

కుంభమేళాలో అగ్ని ప్రమాదం

లక్నో : ప్రయాగరాజ్‌లో కుంభమేళాకోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శిబిరంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. అయితే ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. దిగంబర్ అఖాడాలకు చెందిన ఒక శిబిరంలో గ్యాస్ లీకై సిలిండర్ పేలడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని, దీంతో పలు టెంట్లు ధ్వంసమైనట్లు వెల్లడించారు. కాగా, ప్రయాగరాజ్‌లో కుంభమేళా నేటి నుండి ప్రారంభంకానుందని, 50 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవానికి సుమారు 12 కోట్ల మంది హాజరవుతారని అధికారులు వెల్లడించారు.

తాత్కాలిక సిబిఐ డైరెక్టర్‌గా నాగేశ్వరరావు నియామకంపై 'సుప్రీం'లో సవాలు

న్యూఢిల్లీ : సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావు నియామకాన్ని సవాలు చేస్తూ సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వం చేపట్టిన ఈ నియామకాన్ని రద్దు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని ఒక స్వచ్ఛంద సంస్థ తరపు న్యాయవాది ప్రశాంత్ భూ షణ్ కోర్టును కోరారు. నరేంద్రమోడీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్‌వర్మను ఇటీవల తప్పించిన సంగతి తెలిసిందే.. అనంతరం గత శుక్రవారం నాగేశ్వరరావు ఈ పదవిని చేపట్టారు. అయితే అలోక్‌వర్మ సుప్రీంకోర్టు తీర్పు అనంతరం తన రెండు రోజుల పదవీ కాలంలో తీసుకున్న నిర్ణయాలన్నింటినీ నాగేశ్వరరావు రద్దు చేశారు.

శబరిమలలో మకరజ్యోతి దర్శనం

కేరళ : శబరిమలలో సోమవారం మకరజ్యోతి దర్శనం కార్యక్రమం జరిగింది. జ్యోతి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఇందుకుగానూ ట్రావెన్‌కోర్ దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సాయంత్రం 6.30 గంటలకు తిరువాభరణ ఘట్టం పూర్తయింది. భక్తులు ఈ నెల 19 వరకు అయ్యప్పను దర్శించుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 20న పందళ రాజవంశీయుల స్వామి దర్శనం అనంతరం ఆలయం మూసేస్తారు.

వ్యవసాయ కార్మికులకు రుణమాఫీ..!

కీలక నిర్ణయంపై పంజాబ్ యోచన

చండీగర్ : వ్యవసాయ సహకార సంఘాల నుండి వ్యవసాయ కార్మికులు తీసుకున్న రుణాలను రద్దు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీంతో సుమారు రూ.600 కోట్ల వరకూ రుణాలు మాఫీ అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. ఎన్నికల సమయంలో పంజాబ్ తీసుకునే ఈ నిర్ణయంతో 3.7 లక్షల మంది వ్యవసాయ కార్మికులకు లబ్ది కలగనుంది. రాష్ట్రంలో 85 శాతం మంది రైతులు రుణాలు తీసుకుని ఉన్నారని పంజాబ్ ఖేత్ మజ్దూర్ యూనియన్ తెలిపింది. వ్యవసాయ పరపతి సంఘాల నుండి తీసుకున్న రుణాల్లో రూ.50 వేల వరకు ఉన్న రుణాలను రద్దు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో భూమిలేని కార్మికులు, ఎస్‌సిలు వెనుకబడిన తరగతులకు చెందిన వారి



రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చింది. దీనిలో భాగంగా ఇప్పటి వరకు సహకార, వాణిజ్య బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న సన్నకారు రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. చిన్న రైతులకు కూడా రుణాలను మాఫీ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. సహకార బ్యాంకుల నుండి తీసుకున్న సుమారు 2.15 లక్షల మంది సన్నకారు రైతులకు మూడవదశ రుణాలు మాఫీ అయ్యాయని, వాణిజ్య బ్యాంకుల నుండి పొందిన 50,752 మంది రైతుల రుణాలను తరువాతి దశలో మాఫీ చేస్తామని అధికారులు తెలిపారు.

నిఘా బిల్లుపై వివరణ ఇవ్వండి

కేంద్రానికి 'సుప్రీం' నోటీసులు

న్యూఢిల్లీ : వ్యక్తిగత సమాచారంపై నిఘా విధిస్తూ ప్రభుత్వ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఈ అంశంపై ఆరువారాల్లోగా నివేదికను సమర్పించాల్సిందిగా చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశిం చింది. కాగా, డిజిటల్ యుగంలో వ్యక్తి స్వేచ్ఛకు సంబంధిం చిన విషయంలో జాగరూకతతతో ఉండాలని ధర్మాసనం పేర్కొంది. అయితే ఈ నోటిఫికేషన్ పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని న్యాయవాది ఎంఎల్ శర్మతో సహా తొమ్మిదిమంది పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వ్యక్తి గోప్యతను కాపాడాల్సిన అవసరం ఉందని, అదే సమయంలో డిజిటల్ యుగంలో వస్తున్న మార్పుల పైనా, ప్రమాదాలపైనా జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

మధ్యప్రదేశ్‌లో డిప్యూటీ స్పీకర్‌కు తప్పిన ప్రమాదం

భోపాల్ : మధ్యప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ హీనా కావ్రేకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆమె కాన్వాయ్‌లోని ఒక వాహనాన్ని అతివేగంతో వస్తున్న ట్రక్ ఢీ కొనడంతో నలుగురు దుర్మరణం చెందారు. ఈ ఘటన బాలాఘాట్ జిల్లాలో సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యాలయం నుండి ఆమె స్వగృహానికి తిరిగి వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్, వాహనం డ్రైవర్ మృతి చెందారు. మరో పోలీసు అధికారికి గాయాలవ్వగా.ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. హీనా మాట్లాడుతూ తమకు ఎదురుగా వస్తున్న ట్రక్‌ను నుండి తన వాహనం తృటిలో తప్పించుకోగా, మరో వాహనాన్ని ఢీ కొట్టిందని వెల్లడించారు.

26/11 కుట్రదారు స్వదేశానికి..

పత్రాలు సిద్ధం చేస్తున్న భారత్

వాషింగ్టన్/న్యూఢిల్లీ : ముంబయిలో 2008లో జరిగిన ఉగ్రవాద దాడుల కుట్రదారుడు, ప్రస్తుతం అమెరికాలో 14 ఏళ్ళ జైలు శిక్ష అనుభవిస్తున్న తహవూర్ హుస్సేన్ రాణాను భారత్‌కు అప్పగించే అవకాశాలున్నట్లు సంబంధిత వర్గాలు సోమవారం తెలిపాయి. అమెరికా ప్రభుత్వ పూర్తి సహకారంతో రాణాను ఇక్కడకు తీసుకు వచ్చేందుకు భారత్ తగిన పత్రాలను సిద్ధంచేస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి అమెరికా జైలులో రాణా శిక్షాకాలం డిసెంబరు 2021 నాటికి ముగుస్తుంది. ముంబయిలో ఉగ్రవాద దాడులకు కుట్ర పన్నాడన్న అభియోగాలపై పాక్ జాతీయుడైన కెనడియన్. రాణాను 2009లో అరెస్టు చేశారు.

2008 నవంబర్ 26న పాక్‌కు చెందిన 10 మంది లష్కరే తోయిబా ఉగ్రవాదులు ముంబయిలో మారణకాండ సృష్టించారు. ఈ దాడిలో అమెరికా పౌరులతో సహా 166 మంది మృతి చెందారు. దాడికి పాల్పడిన పదిమంది ఉగ్రవాదుల్లో 9 మంది పోలీసుల కాల్పుల్లో మృతి చెందగా అజ్మల్ కసబ్ ఒక్కడే ప్రాణాలతో చిక్కాడు. ఉగ్రవాద దాడుల విషయమై కసబ్‌ను పలుమార్లు విచారించిన కోర్టు ఉరిశిక్ష విధించింది. కాగా అమెరికా అధికారుల కథనం మేరకు 2013లో రాణాకు 14 ఏళ్ళ జైలు శిక్ష విధించబడింది. 2021 డిసెంబరులో ఆయన విడుదల అవుతారు. "ఇక్కడ ఆయన జైలు శిక్ష పూర్తయిన వెంటనే భారత్‌కు తిప్పి పంపే అవకాశాలు ఉన్నాయి. ఈ దిశగా అమెరికా-భారత్ ప్రభుత్వాలు సంప్రదింపులు జరుపుతున్నాయని ఆ వర్గాలు తెలిపాయి.

వివిధ దేశాలలో జైలు శిక్ష అనుభవిస్తున్న వారిని తమ తమ దేశాలకు రప్పించుకునేందుకు భారత్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, హోం శాఖ, న్యాయ శాఖలు, అమెరికా హోం శాఖ, న్యాయ శాఖలు తమ తమ సొంత విధానాలను కలిగి ఉన్నాయి. నేరస్తులను స్వదేశాలకు పంపే విషయంలో జైలు శిక్ష తగ్గించడానికి గాని, వారిని త్వరగా తీసుకు వచ్చేందుకు గాని ఆయా శాఖలు అంతగా ఇష్టపడవని ఆ వర్గాలు తెలిపాయి.

ప్రత్యేకం

యుపిలో కాంగ్రెస్ ఒంటరి పోరు

త్రిముఖ పోటీతో బిజెపికే నష్టమంటున్న విశ్లేషకులు

లక్నో : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం యుపిలో చిరకాల ప్రత్యర్థులైన సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ)లు చేతులు కలిపాయి. అయితే ఈ కూటమికి కాంగ్రెస్ పార్టీని దూరంగా పెట్టాయి. అయితే రాయ్‌బరేలీ, అమేథీ స్థానాలను మాత్రం తాము కాంగ్రెస్ సారథులు సోనియా, రాహుల్‌కు వదిలివేస్తామని ఈ రెండు పార్టీలూ ప్రకటించాయి. ఈ రాజకీయ కూటమిలో కాంగ్రెస్ పార్టీని ఎందుకు చేర్చుకోలేదన్న ప్రశ్నకు బిఎస్పీ అధినేత్రి మాయావతి బదులిస్తూ ఇటు కాంగ్రెస్‌తో పాటు అటు బిజెపి కూడా అవినీతిలో కూరుకుపోయినందునే తాము ఆ రెండు పార్టీలనూ దూరంగా వుంచామన్నారు. ముఖ్యంగా దేశాన్ని కుదిపేసిన, కుదిపేస్తున్న రక్షణ కొనుగోళ్ల కుంభకోణాలలో కాంగ్రెస్, బిజెపి సమాన భాగస్వాములేనని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్‌తో తాము జట్టు కడితే ఆ పార్టీకి ఓట్లు పడకపోగా, అవి బిజెపికి బదిలీ అవుతాయని, అందువల్లే తాము కాంగ్రెస్ పార్టీని దూరంగా వుంచామని ఆమె గతానుభవాలను గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండి దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించిందని, ప్రస్తుతం బిజెపి హయాంలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని ఆమె వ్యాఖ్యానించారు. బిఎస్పీ-ఎస్పీ పార్టీలు కాంగ్రెస్‌ను ఎందుకు దూరంగా పెడుతున్నాయన్న ప్రశ్నకు విశ్లేషకులు సమాధానమిస్తూ ఇది కూటమిపై ఎటువంటి ప్రభావాన్నీ చూపబోదంటున్నారు. కాంగ్రెస్ పార్టీ దూరంగా వుంటేనే ఎస్‌పి-బిఎస్పీకూటమికి బిజెపిని ఓడించటం సులభసాధ్యమవుతుందని అభయ్‌కుమార్ దూబే అనే రాజకీయ వ్యాఖ్యాత చెబుతున్నారు. కాంగ్రెస్ కూడా ఈ కూటమిలో భాగస్వామిగా మారితే కూటమికి వ్యతిరేకంగా ఓట్ల చీలిక కోసం బిజెపి చేస్తున్న ప్రయత్నాలు ఫలించబోవని, అంతిమంగా కాంగ్రెస్ పార్టీకే ప్రయోజనం కలుగుతుందని ఆయన అంటున్నారు. కాంగ్రెస్ పోటీ చేసిన ప్రాంతాలో బిజెపి ఓట్లకు గండి పడుతుంది తప్ప, కూటమి ఓట్లకు కాదని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల వ్యూహం కొన్నిసార్లు



వింతలు చూపుతుందని ఆయన అంటున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఈ కూటమి వ్యూహం కూడా ఇదే రకంగా పనిచేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ కూటమిలో చేరి వుంటే ఆ పార్టీ శ్రేణులు బిఎస్పీ, ఎస్పీల కోసం పనిచేసేందుకు సుముఖంగా వుండేవారు కాదని, కూటమి భాగస్వామిగా కాంగ్రెస్‌పార్టీ కేవలం కొన్ని స్థానాలకు మాత్రమే పరిమితం కావల్సి వచ్చేదని ఆయన అన్నారు. కూటమి భాగస్వామిగా పోటీ చేస్తే గట్టిగా పది స్థానాలు కూడా దక్కటం కష్టసాధ్యమే అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పుడు కూటమి వెలుపల కాంగ్రెస్ పోటీ చేస్తుండటంతో ఆ పార్టీకి ఇంతకన్నా ఎక్కువ స్థానాలే దక్కే అవకాశం వుందన్నారు. యుపి రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ కీలక భాగస్వామి అన్న విషయాన్ని మరువరాదన్నారు. ఎస్పీ-బిఎస్పీ కూటమి కాంగ్రెస్ అవకాశాలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందన్న ప్రశ్నకు మరో రాజకీయ విశ్లేషకుడు హిలాల్ అహ్మద్ జవాబిస్తూ ప్రస్తుతం యుపి రాజకీయాల్లో కాంగ్రెస్ పాత్ర నామమాత్రంగానే వుందని, గతంలో కాంగ్రెస్ పార్టీతో పనిచేసిన ప్రధాన నేతలు ఇప్పుడు ఎస్పీ, బిఎస్పీలలో వున్నారని ఆయన గుర్తు చేశారు. అందువల్ల కాంగ్రెస్‌ను స్వతంత్ర పార్టీగా ఆలోచించటమే తప్పు అని ఆయన స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ఎస్పీ-బిఎస్పీ కూటమి ఏ విధమైన ఫలితాలు సాధిస్తుందన్నది ఆసక్తికరమైన అంశమని ఆయన అంటున్నారు. ఇది కేవలం ప్రత్యామ్నాయ కూటమి మాత్రమేనా? లేక ఇందులో ఏమైనా కొత్త వుందా? అన్న అంశాన్ని పరిశీలించాల్సి వుందని, ఇదే సూత్రం కాంగ్రెస్‌కు కూడా వర్తిస్తుందని అంటున్నారు. రాజకీయంగా చెప్పాలంటే అటు కాంగ్రెస్‌కానీ, ఇటు ఎస్పీ-బిఎస్పీ కూటమి కానీ నరేంద్ర మోడీ వ్యతిరేకతే ప్రధాన లక్ష్యంగా తెరపైకి వస్తున్నాయని ఆయన గుర్తు చేస్తున్నారు.

ముస్లిం ఓట్లు

ముస్లిం ఓట్ల గురించి అడిగినపుడు హిలాల్ స్పందిస్తూ ప్రత్యేకంగా 'ముస్లిం ఓటు బ్యాంకు' అనేది ఎక్కడా లేదన్నారు. అందువల్ల ముస్లింల ఓట్లు గంపగుత్తగా ఒకరికే పడతాయని తాను బావించటం లేదని ఆయన అంటున్నారు. కూటమి గెలుపు గ్యారంగా స్థిరపడేందుకు చేసే ప్రయత్నాలలో యాదవ, దళిత, ముస్లిం ఓట్లను ఆకర్షించటంతో పాటు బిజెపి ఓటు బ్యాంకు అయిన అగ్రవర్ణాల ఓట్లను కూడా ఆకర్షిస్తేనే ఫలితం దక్కుతుందని ఆయన అంటున్నారు. ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో ఓటర్లు మొత్తం మతం లేదా కులం ప్రాతిపదికగా ఓట్లు వేయబోరన్న విషయం తేటతెల్లమైందన్నారు. ఈ త్రిముఖ పోటీల వల్ల బిజెపికే ఎక్కువ దెబ్బ అని ఆయన స్పష్టం చేస్తున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో యుపిలో బిజెపి 71 స్థానాలను గెల్చుకోగా, దాని మిత్రపక్షం అప్నాదళ్‌కు రెండు స్థానాలు దక్కాయి. సమాజ్‌వాది పార్టీకి ఐదు, కాంగ్రెస్ పార్టీకి రెండు దక్కగా, బిఎస్పీ అసలు ఖాతాయే ప్రారంభించలేక పోయింది.

జింబాబ్వేలో అల్లర్లు

పెరిగిన చమురు ధరలను తక్షణమే తగ్గించాలని నిరసనకారుల డిమాండ్

హరారే : జింబాబ్వేలో నిరసనలు వెల్లువెత్తాయి. చమురు ధరలు మిన్నంటడంతో నిరసనకారులు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టారు. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. రహదారులను దిగ్బంధించారు. దీంతో, వాహనాల రాకపోకలు కొన్ని గంటలపాటు స్తంభించాయి. ఆందోళకారులు పలు దుకాణాల్లోకి చొరబడి బీభత్సం సృష్టించారు. దుకాణాల్లోని వస్తువులను ధ్వంసం చేశారు. చమురు ధరల పెంపును నిరసిస్తూ అల్లర్లు సృష్టించారు. అధ్యక్షుడు ఎమ్మెర్సన్ మాంగాగ్వా పెరిగిన ధరలను తక్షణమే తగ్గించాలంటూ నిరసనకారులు డిమాండ్ చేశారు. బులావాయో నగరంలో ఆందోళలు ఉధృతమయ్యాయి. ఆందోళనకారులు రోడ్లపై టైర్లకు నిప్పంటించారు.



కూలిన ఇరానియన్ కార్గో విమానం

15 మంది మృతి

టెహ్రాన్ : ఇరాన్ సైనిక సరుకుల రవాణా (కార్గో) విమానం టెహ్రాన్‌కు సమీపంలోని విమానాశ్రయంలో రన్‌వేపై వేగంగా దూసుకెళ్లి ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో విమానం ఇంజినీరు ఒక్కరే బతికి బయటపడ్డారు. మిగతా 15 మంది చనిపోయారు. ప్రమాదానికి గురైన విమానంలో మొత్తం 16 మంది వున్నారు. వీరిలో 14 మంది ఆర్మీ సిబ్బంది కాగా, ఇద్దరు పౌరులు. కిర్గిజిస్థాన్‌లోని బిష్కెక్ నుంచి మాంసాన్ని తీసుకుని వస్తుండగా ఈ ప్రమాదానికి గురైనట్లు ఆర్మీ ప్రతినిధి షహీన్ తఖిఖాని తెలిపారు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు. ఇస్లామిక్‌రివల్యూషన్ గార్డు బలగాలకు అవసరమైన ఆహార సామగ్రిని తీసుకుని వస్తున్న కార్గో విమానం సోమవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఇక్కడికి సమీపంలోని ఫాత్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండిగ్ అయ్యే సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఆర్మీ ప్రతినిధి పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి కారణాలేమిటన్నది కచ్చితంగా తెలియరాలేదని అధికారులు తెలిపారు. ఈ విమానాన్ని పాయం విమానాశ్రయంలో దించడానికి బదులు ఫాత్ విమానా శ్రయంలో దించారు. పాయం విమానాశ్రయం రన్‌వే 3,600 మీటర్లు కాగా, ఫాత్ విమానాశ్రయం రన్‌వే 1,100 మీటర్లు మాత్రమే. దీంతో పైలట్ పొరపాటున పాయం రన్‌వే అనుకుని వేగంగా పోనిచ్చి వుంటాడని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదానికి గురైన విమానం 1958లో తయారైన బోయింగ్707కి చెందినది. షా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఇలా రన్‌వేపై కుప్పకూలడం గత పదమూడేళ్లలో ఇది రెండోసారి. విమానానికి చెందిన వాయిస్ రికార్డరు, కాక్‌పిట్ లభ్యమైందని, దానిని డీ కోడ్ చేస్తే కచ్చితమైన కారణం తెలియవచ్చని అధికారులు తెలిపారు.

దుస్తుల తయారీ కార్మికుల వేతనాల పెంపు

ఢాకా : దుస్తుల తయారీ రంగంలో కార్మికులకు నూతన వేతన విధానాన్ని బంగ్లాదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల ఈ రంగంలోని లక్షలాది మంది కార్మికులకు వేతనాలు పెరగనున్నాయి. ప్రధాని షేక్ హసీనా ప్రత్యేక ఆదేశాల మేరకు దుస్తుల తయారీ రంగంలోని అన్ని స్థాయిల కార్మికుల వేతనాలను పెంచినట్లు బంగ్లాదేశ్ కార్మిక, ఉపాధి శాఖల సహాయ మంత్రి మున్నుజున్ సుఫియన్ ప్రకటించారు. ఈ కొత్త వేతన విధానం కింద గ్రేడ్-1 కార్మికుల కనీస నెలసరి మూల వేతనం18,257 టాకాలుగా వుంటుంది. వేతనాల పెంపుదల కోసం డిమాండ్ చేస్తున్న కార్మికులందరూ ఇప్పుడు తమ విధులకు హాజరవుతారని ఆశిస్తున్నట్లు కార్మిక మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. కార్మికుల నిరవధిక ఆందోళనతో ప్రభుత్వం దిగివచ్చి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఇండోనేషియా విమాన ప్రమాద దర్యాప్తులో పురోగతి

బ్లాక్ బాక్సులు లభ్యం

జకార్తా : ఇండోనేషియా విమాన ప్రమాద దర్యాప్తులో పురోగతి కనిపిస్తున్నది. గతేడాది అక్టోబర్29న జకార్తా విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే బోయింగ్-737 జెట్ విమానం జావా సముద్రంలో కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో 189 మంది మృతిచెందారు. అయితే, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్లు లభ్యం కాకపోవడంతో దర్యాప్తు నత్తనడకన సాగింది. ప్రత్యేక బృందాలు బ్లాక్‌బాక్సుల కోసం మూడు నెలల నుంచి గాలిస్తున్నాయి. తాజాగా, ఘటనాస్థలి నుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలో బ్లాక్‌బాక్సులు లభ్యమయ్యాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

24వ రోజుకు చేరిన షట్‌డౌన్

వేతనాలందక 8 లక్షల మంది ఉద్యోగుల అవస్థలు



వాషింగ్టన్ : మెక్సికోతో సరిహద్దు గోడ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంకుపట్టు పట్టడంతో తలెత్తిన ప్రభుత్వ షట్‌డౌన్ సమస్య సోమవారం నాటికి 24 రోజులు కావస్తున్నా కనుచూపు మేరలో పరిష్కారం కానరావడం లేదు. షట్‌డౌన్ మూలంగా లక్షలాది అమెరికన్ ఫెడరల్ ఉద్యోగులు, కార్మికులు జీతాలు లేక, లాక్డ్ అవుట్‌తో పని కోల్పోయిన ఉద్యోగులు వీధుల్లోకి వస్తున్నారు. ట్రంప్ సర్కార్ మూర్ఖత్వ వైఖరిని వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మరో వైపు ట్రంప్ తన పంతాన్ని నెగ్గించుకోవడం కోసం ఎమర్జెన్సీ విధించి, సహాయక చర్యలకుద్దేశించిన నిధులను సరిహద్దు గోడకు మళ్లించాలని చూస్తున్నారు. షట్‌డౌన్‌కు తెర దించాలని అధ్యక్షుడిని కోరినట్లు సౌత్ కాలిఫోర్నియా సెనేటర్, ట్రంప్‌కు సన్నిహితురాలైన లిండ్సే గ్రాహం చెప్పారు. మూడు వారాలు గడిచాక కూడా నిధుల కేటాయింపు విషయంలో ఒక అవగాహనకు రాకపోతే అన్ని దారులూ మూసుకుపోయినట్టేనని ఆమె ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. గత నెల 22 నుండి జీతాలు లేకున్నా విధులు నిర్వహిస్తున్న అమెరికన్ ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోలర్ల (ఎటిసి)కు సంఘీభావంగా కెనడియన్ ఎటిసిలు పిజ్జాలు కొనుగోలుచేసి వారికి అందచేస్తున్నారు. వేతనాలందక పలువురు సిబ్బంది విధులను బహిష్కరించటంతో మియామీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ తాత్కాలికంగా మూతపడింది.

వేతనాలందక సిబ్బంది వెతలు

గత నెల 22న ఈ ఆర్థిక సంక్షోభం ప్రారంభమైన నాటి నుండి దాదాపు 4.2 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఇప్పటి వరకూ ఎటువంటి వేతనాలూ అందుకోకుండానే విధులను నిర్వహిస్తున్నారు. ఇందులో ఎఫ్‌బిఐ, టిఎస్ఎ, నిఘా సంస్థల అధికారులు, ఇతర సిబ్బందితో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు, ఫెడరల్ హోంలాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు సైతం వేతనాలందక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక ప్రతిష్టంభన నేపథ్యంలో నిధుల కేటాయింపు నిలిచిపోవటంతో అనేక ప్రభుత్వ విభాగాలు మూతపడ్డాయి. ఫెడరల్ కేబినెట్ స్థాయిలోని 15 విభాగాలలో వ్యవసాయం, హోంలాండ్ సెక్యూరిటీ, రాష్ట్ర ప్రభుత్వాలు, రవాణా, హోం, న్యాయశాఖ తదితర తొమ్మిది శాఖలు మూతపడ్డాయి. వీటితో పాటు ప్రతిష్టాత్మకమైన నేషనల్ పార్క్ వ్యవస్థలు కూడా మూతపడ్డాయి. నాసాకు సంబంధించిన ఉద్యోగులందరూ ఇళ్లవద్దనే వుండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ట్రంప్ బర్త్‌కంట్రోల్ చట్టానికి ఫెడరల్ జడ్జ్ 'బ్రేక్'

ఆక్లండ్ (అమెరికా) : అమెరికాలోని ట్రంప్ సర్కారు దేశంలోని 13 రాష్ట్రాలలో అమలులోకి తెచ్చిన కొత్త బర్త్ కంట్రోల్ చట్టానికి కేలిఫోర్నియాలోని ఫెడరల్ న్యాయమూర్తి ఆదివారం నాడు బ్రేక్ వేశారు. మహిళలకు ఖర్చులేని గర్భనిరోధక సౌకర్యాలను కల్పించేందుకు యాజమాన్యాలకు వీలు కల్పించే ఈ చట్ట నిబంధనలను నిలిపివేస్తూ కాలిఫోర్నియాతో పాటు మరో 12 రాష్ట్రాలలో నిలిపివేస్తూ న్యాయమూర్తి హేవుడ్ జిలియమ్ ఇంజన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. తాము ఈ నిబంధనలను సవాలుచేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నందున సోమవారం నుండి అమలులోకి రావాల్సిన ఈ నిబంధనలను వెంటనే నిలిపివేయాలని పిటిషనర్లు కోర్టును కోరారు. అయితే పిటిషనర్ల వినతి కొంత పరిధికే పరిమితం కావటంతో వారి వినతిని తిరస్కరించిన న్యాయమూర్తి దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాలలో ఈ నిబంధనల అమలును నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కొంతమంది మహిళా ఉద్యోగులు మత విశ్వాసాల పేరుతో గర్భనిరోధక విధానాలను వ్యతిరేకిస్తుండటంతో ప్రభుత్వం ఈ నిబంధనలను అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం మహిళా ఉద్యోగులు ఖర్చులేని గర్భ నిరోధక విధానాలను అనుసరించేందుకు వీలు ఏర్పడుతుంది. అయితే ఈ నిబంధనలను కొంతమంది ప్రైవేటు యజమానులు నైతికత పేరుతో వ్యతిరేకించారు. ప్రభుత్వ నిధులతో అమలవుతున్న గర్భనిరోధక పద్ధతులకు మారటం ద్వారా అవాంఛిత గర్భధారణను నిరోధించుకోవాలని మహిళలను ఈ నిబంధనలు బలవంతం చేస్తున్నాయని కేలిఫోర్నియా ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు వాదించాయి. మహిళల ఆరోగ్యాలతో వ్యాపార నిర్ణయాలను చేయరాదని స్పష్టం చేసిన కేలిఫోర్నియా అటార్నీ జనరల్ జేవియర్ బెసెర్రా, ఇందుకు సంబంధించిన చట్టం మరింత స్పష్టంగా వుండాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


బ్రెగ్జిట్ డీల్ ఆమోదించండి!

- లేకుంటే తీవ్ర పరిణామాలు
- బ్రిటన్ ఎంపీలకు థెరిస్సా హెచ్చరిక



లండన్: నిర్దిష్ట గడువులోగా ఐరోపా కూటమి నుండి నిష్క్రమించే (బ్రెగ్జిట్) ప్రక్రియను పూర్తి చేయలేకపోతే దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో తీవ్ర దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయని బ్రిటన్ ప్రధాని థెరెస్సా మే పార్లమెంట్‌ను మరోసారి బెదిరించారు. ఐరోపా కూటమితో కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందంపై మంగళవారం నాడు బ్రిటన్ పార్లమెంట్‌లో ఓటింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రధాని ఈ హెచ్చరిక చేశారు. ఈ ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంట్ వ్యతిరేకించే అవకాశాలున్నాయన్న వార్తల నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బ్రెగ్జిట్ గడువు మార్చి 29 సమీపిస్తున్న తరుణంలో ఈ ప్రక్రియపై బ్రిటన్ పార్లమెంట్, ఐరోపా కూటమి మధ్య ప్రతిష్టంభన కొనసాగుతున్న విషయం తెలిసిందే. బ్రెగ్జిట్‌పై థెరిసా మే తెచ్చింది బోగస్ ఒప్పందమని కమ్యూనిస్టు పార్టీ, లేబర్ పార్టీ విమర్శిస్తున్నాయి. ప్రజా బెగ్జిట్ ఒప్పందం కావాలని అవి కోరుతున్నాయి. థెరిస్సా మే ప్రభుత్వం తప్పుకుని, పార్లమెంటుకు తిరిగి ఎన్నికలకు వెళ్లడమే దీనికి పరిష్కారమని వారు చెబుతున్నారు.

చంద్రశిలలపై చైనా రోవర్ దృష్టి



బీజింగ్ : చంద్రగ్రహంపైకి తాము ప్రయోగించిన చేంజ్-4 రోదసీనౌక చంద్రునికి ఆవలివైపు పరిశోధనలకు తెరతీయటం ద్వారా ఈ ప్రయోగం సంపూర్ణ విజయం సాధించిందని చైనా ప్రకటించింది. ఈ ఏడాది చివరిలో ప్రయోగించ నున్న చేంజ్-5 రోదసీ నౌక ద్వారా చంద్రశిలలను సేకరించి అక్కడి వాతావరణ పరిస్థితులపై పరిశోధనలు కొనసాగిస్తామని చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. చేంజ్-4 రోదసీనౌక చంద్రుని ఆవలివైపు ఈ నెల 3వ తేదీన లాండింగ్ కావటంతో పాటు చంద్రుడి అవతలి వైపు సన్నిహిత ఛాయాచిత్రాలను కూడా భూమికి పంపింది. ఈ ప్రయోగం సంపూర్ణ విజయం సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేసిన చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ రోదసికి సంబంధించిన గొప్ప రహస్యాన్ని ఛేదించామని, చంద్రునికి ఆవలివైపు పరిశోధనలకు ప్రపంచంలోనే తొలిసారిగా తెరతీయటం దేశ రోదసీ పరిశోధనల్లో తాము సాధించిన ప్రధాన విజయమని ఒక ప్రకటనలో పేర్కొంది. రోదసీ పరిశోధనలతో పాటు చంద్రగ్రహ ఉపరితలంపై ఖనిజవనరుల అన్వేషణ, న్యూట్రాన్, ఇతర తటస్త అణువుల రేడియేషన్ లెక్కింపు, చంద్రగ్రహ ఆవలివైపు వాతావరణ రహస్యాల ఛేదన వంటి అంశాలను చేంజి-4 ప్రయోగ లక్ష్యాలుగా నిర్ణయించారు.

టెన్త్ అంతర్గత మార్కుల తనిఖీకి కమిటీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదోతరగతి అంతర్గత మార్కుల తనిఖీలకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పదో తరగతి అంతర్గత మార్కులపై మొదటి నుంచి విమర్శలు రావడంతో విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మార్కుల తనిఖీలకు మూడు స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసింది. మండల, డివిజన్, జిల్లాల స్థాయిలో ఈ కమిటీలు ఉంటాయి. సమ్మెటీవ్-1కు పది మార్కులు, అలాగే ఒక్కో ఫార్మెటివ్ పరీక్షకు రెండున్నర మార్కుల చొప్పున నాలుగు ఫార్మెటీవ్‌లకు 10 మార్కులు లెక్కిస్తారు. విద్యార్థుల పరీక్షలు, వారి అభ్యసన సామర్థ్యాలు, ప్రాజెక్టు వర్క్, మౌఖిక ఇంటర్వ్యూలు, స్లిప్ టెస్టులో మార్కులు, క్రమశిక్షణ తదితరాలను కమిటీలు తనిఖీ చేస్తాయి. విద్యార్థులు రాసిన సమాధానాల ఆధారంగా మార్కులు వేసి, వాటిని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వెబ్‌సైట్‌లో నమోదు చేశారా? హెచ్చుతగ్గులేమైనా ఉన్నాయా? అని తనిఖీ చేసి ఈ కమిటీలు ధ్రువీకరించాల్సి ఉంటుంది. తనిఖీలకు వెళ్లిన ప్రతి చోటా 20శాతం మంది విద్యార్థుల పేపర్లను కమిటీ పరిశీలిస్తుంది. మండల స్థాయి కమిటీలో మండల విద్యాశాఖ అధికారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, మండలంలోని సీనియర్ ప్రధానోపాధ్యాయుడు ఉంటారు. డివిజన్ స్థాయి కమిటీలో డివైఇవో, మండలంలోని సీనియర్ ప్రధానోపాధ్యాయులు, సర్వశిక్షా అభియాన్ నుంచి సెక్టోరియల్ అధికారి ఉంటారు. జిల్లా స్థాయిలో డిఇవో, ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్, డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సభ్యులుగా ఉంటారు. మండల స్థాయి కమిటీ ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 2వరకు తనిఖీ నిర్వహించాలి. డివిజన్, జిల్లా స్థాయి కమిటీలు ఫిబ్రవరి 5 నుంచి 13 వరకు తనిఖీలు నిర్వహించాలి.

కన్నయ్యపై దేశద్రోహం అభియోగం

న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నేత కన్నయ్యకుమార్‌తో సహా పది మందిపై 'దేశద్రోహం' అభియోగం కింద సోమవారం చార్జిషీట్ దాఖలైంది. 2016లో జెఎన్‌యు ప్రాంగణంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జెఎన్‌యు విదార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్నయ్య కుమార్, ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య, సిపిఐ ఉ నేత డి రాజా కుమార్తె అపరాజితతో సహా పదిమందిపై దేశద్రోహం కేసులో ఢిల్లీ పోలీసులు 1,200 పేజీల ఈ ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. మూడు నెలల్లో దాఖలు చేయాల్సిన చార్జిషీట్ మూడు సంవత్సరాల తరువాత హడావుడిగా వేయడం చర్చనీయాంశమైంది. పార్లమెంట్‌పై దాడి చేసిన ఉగ్రవాది అఫ్జల్‌గురు ఉరికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 9న యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారన్న ఆరోపణతో పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ఐపిసి సెక్షన్ 124ఎ(రాజద్రోహం), 323, 465, 471, 149, 147, 120బి కింద పోలీసులు ఛార్జి షీట్ దాఖలు చేశారు. సిపిఐ నేత డి.రాజా కుమార్తె అపారిజిత రాజా, నిందితులుగా ఉన్న మరో 36 మందిపై ఎలాంటి ప్రత్యక్ష సాక్ష్యాలు లేవని పోలీసులు తెలిపారు.

రాజకీయ ఎత్తుగడలో భాగం : కన్నయ్య

దీనిపై కన్నయ్య కుమార్ స్పందిస్తూ 3 సంవత్సరాల అనంతరం ఛార్జిషీట్ దాఖలు చేసినందుకు పోలీసులకు, ప్రధాని మోడీకి ధన్యవాదాలు చెబుతున్నానని వ్యంగ్యంగా వ్యాఖ్యా నించారు. ఎన్నికలకు ముందు తీసుకున్న ఈ చర్య పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడు కున్నదని తెలిపారు. దేశ న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని కన్నయ్య అన్నారు. 'దేశ దృష్టిని మళ్లించడానికి, తమ పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేంద్ర ప్రయత్నిస్తున్నది. కేసులో పోరాడి మా నిజాయతీని నిరూపించుకుంటాం' అని తనపై వచ్చిన ఆరోపణలను ఉమర్ ఖలీద్ ఖండించారు. 'మా విద్యార్థులు దేశవ్యతిరేక కార్యకలాపాల్లో పాలుపంచుకోరు. వారు అలా చేశారనడానికి ఎలాంటి ఆధారాలూ లేవు. కేంద్రం వారిపై దేశద్రోహం కేసులు ఎలా నమోదు చేస్తుంది? న్యాయస్థానంలో మా పోరాటం కొనసాగు తుంది' అని డి.రాజా అన్నారు.

సజ్జన్‌కుమార్ అప్పీలు

సిబిఐకి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడిన కాంగ్రెస్ నాయకుడు సజ్జన్ కుమార్ దాఖలు చేసిన అప్పీలును చీఫ్ జస్టిస్ రంజన్ గగోయ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం సోమవారం సిబిఐకి నోటీసులు జారీ చేసింది. నాలుగువారాల్లో వీటికి సమాధానమివ్వాలని ఆదేశించింది.

'ఉపాధి హామీ'నిర్వీర్యం

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంపై ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగుతోంది. నిధులలేమితో పథకం కొట్టుమిట్టాడుతోంది. పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో దాదాపు 99 శాతం ఆర్థిక సంవత్సరం ఇంకా 3 నెలలు ఉండగానే ఖర్చు అయిపోయాయి. 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు దీనికి సంబంధించి మైనస్ బ్యాలెన్స్‌తో ఉన్నాయి. దేశంలో నెలకొన్న ఈ పరిస్థితిపై సత్వరమే స్పందించాలని దాదాపు 90 మంది ఎంపీలు, 160 మంది ప్రముఖులు, మాజీ అధికారులు, ఆర్థిక వేత్తలు, ఉద్యమకారులు ప్రధాని మోడీకి బహిరంగ లేఖ రాశారు. జనవరి 3వ తేదీన సమావేశం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో ఉద్యోగ భద్రత క్రమంగా తగ్గిపోతుందని వారు తెలిపారు. ఎక్కువ మొత్తంలో ఉన్న నిరుద్యోగం, రైతులకు అందుతున్న తక్కువ ఆదాయం దృష్టిలో పెట్టుకొని ఈ ఉపాధి హామీ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. అనేక వర్గాల ప్రజలు, కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదలలో ఈ పథకం ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. కానీ ఉపాధి కల్పనపై బడ్జెట్ కేటాయింపుల్లో పరిమితులు, వేతనాల చెల్లింపులో ఆలస్యం, దీనికి తోడు తక్కువ వేతనాలు ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని లేఖలో ప్రధాని దృష్టికి తెచ్చారు. ఈ కారణంలో ప్రభుత్వ విధానాలపై ప్రజలను అసంతృప్తిలోకి నెడుతున్నాయని తెలిపారు. ఉద్యోగాల కల్పనపై అనేక సమావేశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న కరువు దృష్ట్యా ఉపాధి పథకానికి ఎక్కువ నిధులు కేటాయించి ప్రజలను సత్వరమే ఆదుకోవాలని కోరారు. గ్రామీణాభివృద్ధి పథకం కింద జనవరి 3న రూ.7 వేల కోట్లు విడుదల చేశారు. దీనిని స్వాగతిస్తూ మరిన్న మెరుగైన చర్యలు తీసుకోవాలన్నారు. లేఖ రాసిన వారిలో సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, బృందాకారత్, ఎంఎస్ స్వామినాథన్, పృద్వీరాజ్ చవాన్, దిగ్విజయ్ సింగ్, జిఘ్నేష్ మేవాని, యోగేంద్ర యాదవ్, జయాబచ్చన్, అలీ అన్వర్ అన్సారీ, హార్స్ మంధార్, స్వామి అగ్నివేష్, అరుణరాయ్, వజాహత్ హబీబుల్లా, జయతిఘోష్, తదితరులు ఉన్నారు.

లేఖ రాసిన ప్రముఖులు చేసిన డిమాండ్లు..

1. ఉపాధి డిమాండ్‌ను గుర్తించి తదనుగుణంగా ప్రజలకు పని కల్పించాలి.
2. ఉపాధి కల్పించడానికి సరిపడా బడ్జెట్‌లో పరిమితులు లేని నిధులు కేటాయించాలి.
3. కనీక వేతనాలకు తగ్గకుండా 'ఉపాధి' కూలి ఇవ్వాలి.
4. వేతన చెల్లింపులో ఆలస్యం 15 రోజులు దాటిన యెడల, దానికి లెక్కించి కార్మికులకు పరిహారం ఇవ్వాలి. ఇది వేతనాల చెల్లింపుల చట్టానికి అనుగుణంగా ఉండాలి. చెల్లింపులు చేసే సంస్థలు జవాబుదారీగా ఉండాలి.
5. సకాలంలో చెల్లింపునకు ఉన్న ఆర్థిక, సాంకేతిక అడ్డంకులను గుర్తించి తొలగించాలి.
6. ప్రతి గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా ఒక కార్మికుడికి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలి.
7. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన అన్ని విషయాలు పారదర్శకంగా అన్ని విధాలుగా ప్రజలకు అందుబాటులో ఉంచాలి.
8. గుర్తించిన కరువు ప్రభావిత జిల్లాల్లో ప్రజలకు సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు కల్పించాలి.

తొలగించాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

ఆయన చెప్పారు. 'జస్టిస్ పట్నాయక్ నివేదికను బయట పెట్టకుండా కేంద్ర ప్రభుత్వం తప్పు చేసింది. పట్నాయక్ చెబుతున్న దాని ప్రకారం ఆయన 50 పేజీల్లో నివేదిక ఇచ్చారు. దానికి వెయ్యి పేజీల అనుబంధాన్ని జతపరిచారు. అంత విస్తృత నివేదికను ఎందుకు దాచిపెట్టారు?' అని ఆయన ప్రశ్నించారు.

సివిసి పాత్రపై ఎన్నో అనుమనానాలు : సిపిఎం

అలోక్‌వర్మపై నిర్వహించిన విచారణలో సివిసి కె.వి చౌదరి నిర్వహించిన పాత్రపై ఎన్నో సందేహాలున్నాయని, ఆయన్ను తక్షణమే తొలగించి, ఆయన పాత్రపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది.

అలోక్‌వర్మను సిబిఐ డైరక్టర్‌గా తొలగించాలన్న నిర్ణయం పూర్తిగా ఏకపక్షమైనదని, దిగ్భ్రాంతి కలిగిస్తోందని సిపిఎం పేర్కొంది. సిబిఐ అధికారి రాకేష్ ఆస్థానా చేసిన ఆరోపణల ఆధారంగా చేసిన విచారణలో బలమైన సాక్ష్యాలను సివిసి చూపలేకపోయారని, మరోవైపు తనవిచారణను నిలిపివేయాలన్న ఆస్థానా చేసిన విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చిన విషయాన్ని గుర్తుచేసింది. అదే సమయంలో సివిసి విచారణను పర్యవేక్షించిన జస్టిస్ పట్నాయక్ అవినీతి ఆరోపణలకు ఆధారాలు లేవని ప్రకటించారని, అదే సమయంలో సివిసి కెవి చౌదరిపాత్రపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపింది. ప్రధానమంత్రి నేతృత్వంలోని హైపవర్ కమిటీ సహజన్యాయసూత్రాలకు విరుద్ధంగా, సమాధానం ఇచ్చే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా అలోక్‌వర్మను తొలగించిందని సిపిఎం పేర్కొంది. ప్రభుత్వానికి చెందిన అత్యున్నత న్యాయకత్వ ప్రమేయంతో జరిగిన అవినితిపై విచారణ జరగకుండా అడ్డుకోవడానికే నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న అనుమానాలను ఈ చర్య బలపరిచిందని పేర్కొంది. రాఫెల్‌తో పాటు మరెన్నో కుంభకోణాలు ఈ జాబితాలో ఉన్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో కెవి చైదరిని తక్షణం ఆ పదవి నుండి తొలగించి, ఆయన పాత్రపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలని డిమాండ్ చేసింది.

సివిసి తప్పు చేశారు : సుబ్రహ్మణ్యస్వామి

సివిసి ఉద్దేశ్యపూర్వకంగానే తప్పు చేశారని బిజెపి నేత సుబ్రహ్మణ్యస్వామి అన్నారు. విచారణ నివేదికను పర్యవేక్షణాధికారిగా నియమితులైన జస్టిస్ పట్నాయక్‌కు ఆయన ఇచ్చి ఉండాల్సిందని, దానికి భిన్నంగా ప్రధానికి అందచేశారని తెలిపారు. ఉద్దేశ్యపూర్వకంగానే సివిసి ఇలా చేసి ఉంటారన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. అలోక్‌వర్మను తొలగిం చాలన్న నిర్ణయాన్ని మరోసారి పున:పరిశీలించాలని ఆయన సూచించారు.

పోలండ్ మేయర్‌పై కత్తితో దుండగుడి దాడి

వార్సా : పోలండ్‌లోని దాన్స్ నగర మేయర్ పావెల్ ఆదమోవిజ్‌పై(53) ఓ దుండగుడు కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఓ స్వచ్ఛంద సంస్థ కోసం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్న క్రమంలో ఈ దాడి జరిగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పావెల్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...దాన్స్ నగరంలో నిర్వహించిన ఓ ఛారిటీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పావెల్ హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ దుండగుడు పోడియం వద్దకు దూసుకువచ్చాడు. అతన్ని ఆపేందుకు భద్రతా సిబ్బంది విఫలయత్నం చేశారు. సభికులకు అభివాదం చేస్తున్న మేయర్‌పై దుండగుడు కత్తితో దాడికి పాల్పడ్డాడు. పరారయ్యేందుకు ప్రయత్నించిన అతన్ని భద్రతా సిబ్బంది వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అరెస్టయిన నిందితుడు పాతనేరస్థుడని దాన్స్ డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై గతంలో పలు కేసులు నమోదై ఉన్నాయని చెప్పారు. పలు హత్య కేసుల్లో, బ్యాంకు చోరీ కేసుల్లో దుండగుడి శిక్ష అనుభవించాడని అన్నారు. మేయర్‌పై దాడికి పాల్పడ్డ కారణం తెలియరాలేదన్నారు. కాగా, ఈ ఘటనపై పోలాండ్ అధ్యక్షుడు ఆండ్రెస్ డూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదమోవిజ్ పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

ఇతర రంగాలలో జోక్యం చేసుకోకూడదు

- ఇది రాజకీయనాయకులు నేర్చుకోవాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: రాజకీయ నాయకులు ఇతర రంగాల్లో జోక్యం చేకసుకోకూడదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మహారాష్ట్రలోని యవత్మల్‌లో జరిగిన మరాతా సాహిత్య సమ్మేళనంలో పాల్గొన్న ఆయన రాజకీయనాయకులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆంగ్ల రచయిత నయన్‌తారా సెహగల్‌కు అందిన ఆహ్వానాన్ని నిర్వాహకులు వెనక్కి తీసుకోవడంతో వివాదం రేగింది. కొన్నేండ్ల క్రితం కేంద్రం తీరుకు నిరసనగా దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన 'అవార్డు వాపసీ'లో ఆయన ఒకరు. దీంతో ఈ అంశంపై రాజకీయ నాయకులను ఉద్దేశించి ఆయన పరోక్షంగా పైవ్యాఖ్యలు చేశారు. ఎలాంటి జోక్యమూ చేసుకోకూడదని అంటే సాహిత్య రంగంలోని వ్యక్తులకు, రాజకీయ నాయకులకు మధ్య సంబంధం ఉండకూడదని కాదన్నారు. రాజకీయనాయకులు, రచయితల మధ్య సహకారం, సమన్వయం, సంభాషణలు ఉండాలని లేకపోతే అది తప్పుడు వాదనలకు దారి తీస్తుందన్నారు. ఈనెల 11న యవత్మల్‌లో ప్రారంభమైన 92వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన్‌కు సెహగల్‌ను కార్యక్రమ నిర్వాహకులు ఆహ్వానించారు. అయితే బీజేపీ, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్ఎస్)లకు చెందిన స్థానిక నాయకులు దీనిని వ్యతిరేకించడంతో ఆహ్వానాన్ని నిర్వాహకులు వెనక్కి తీసుకున్నారు. దీంతో ఈ అంశం వివాదానికి దారి తీసింది.

యథాతథంగా టోల్‌ఫీజు వసూలు

సాయంత్రానికి తగ్గిన రద్దీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా కాజ టోల్ గేట్ వద్ద వాహనదారుల నుంచి సోమవారం కూడా టోల్‌ఫీజులను యథాతథంగా వసూలు చేశారు. పోలీసు అధికారుల హెచ్చరికలను రాష్ట్ర రవాణ శాఖ అధికారులు, డిజిపి టోల్ ఫీజులను వసూలు చేయొద్దని ఆదేశాలిచ్చినా తమకు జాతీయ రహదారుల విభాగం నుంచి ఆదేశాలు ఏమీ రాలేదని చెబుతూ వారు మూడు రోజులుగా వసూలు కొనసాగిస్తున్నారు. వాహనాల రద్దీని నియంత్రించేందుకు జాతీయ రహదారిపై పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ఉదయం రద్దీ బాగా కన్పించగా సాయంత్రానికి రద్దీ సాధారణ స్థితికి చేరింది. తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల నుంచి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ .జిల్లాలకు వెళ్లే వాహనాల సంఖ్య గణనీయంగా తగ్గింది. వరుస సెలవులు కావడంతో లారీల రద్దీ స్వల్పంగా తగ్గింది. దీంతో కాజ టోల్ గేట్ వద్ద ట్రాఫిక్ జామ్ సమస్య ఇంత వరకూ తలెత్తలేదని అధికారులు తెలిపారు. వాహనాల రద్దీ భారీగా లేదని పోలీసులు వాహనాలు జామ్ కాకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారు. దీని వల్ల గత మూడు రోజుల్లో రద్దీ ఉన్నా ఎక్కువ సేపు వాహనాలు నిలిచిపోలేదని అధికారులు తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్,ఆర్‌టిసి బస్టాండ్లలో సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది. ఉద్యోగులు, ఇతరులు ఇతర జిల్లాల్లో ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చారు. అయితే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేవు. ఒక బస్సు రాగానే వందలాది మంది పరుగులు పెట్టడం కనిపించింది. బస్సులో సీటు కోసం నానా తంటాలుపడ్డారు. పిల్లలు, లగేజి అధికంగా ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే స్టేషన్‌లో కూడా రద్దీ పెరిగింది. ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినా రిజర్వేషన్ల బోగిల్లో కూడా సాధారణ టిక్కెట్ ప్రయాణికులు ఎక్కడం వల్ల రిజర్వేషన్లు చేసుకున్న వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అయితే సాధారణ ప్రయాణికుల రద్దీ మాత్రం సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. వరుస సెలవులతో నిత్యం వెళ్లే ఉద్యోగులు, కార్మికులు రద్దీ లేకపోవడం వల్ల ప్యాసింజరు రైళ్లలో రద్దీ లేకుండానే వెళ్తున్నాయి. అయితే రైళ్ల రాకపోకల్లో సమయపాలన సరిగా లేక గంటల తరబడి రైల్వే స్టేషన్లలో పడిగాపులు కాస్తున్నారు.



మార్చిలో కాదు ఏప్రిల్‌లో...



మహేశ్ బాబు

'మహర్షి' షూటింగ్ ప్రారంభంలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించింది ఆ చిత్ర యూనిట్. అనుకున్న షెడ్యూల్ ప్రకారం నిర్మాణం జరిగితే ఈ ఏడాది మార్చి ఐదో తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చెప్పారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్ విడుదల సమయంలోనూ అదే తేదీ అని స్పష్టతిచ్చారు. ఇదంతా చిత్రాల విడుదలలో క్లాష్ రాకుండా ఉండడం కోసం తీసుకున్న ముందస్తు జాగ్రత్త. కానీ తాజాగా విడుదల తేదీని ఏప్రిల్ 26కి మార్చారు. ఏప్రిల్ అనేది మహేశ్‌బాబుకి కలిసొచ్చే నెల అట. అతని కెరీర్‌లో పెద్ద విజయాలైన 'పోకరి', భరత్ అనే నేను' వంటివి ఈనెలలోనే విడుదల చేశారు. అందుకే 'మహర్షి' చిత్రాన్ని కూడా అదే నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అంతిమంగా నిర్ణయించారు. ఈ చిత్రానికి వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు నిర్మాత. పూజా హెగ్డే కథానాయికగా చేస్తోంది. అల్లరి నరేశ్ మహేశ్ బాబు స్నేహితుడిగా కనిపించబోతున్నాడు. ఇందులో మహేశ్‌బాబు ఓ కంపెనీకి సీఈవోగా చేస్తున్నాడు. ఈ చిత్రం షూటింగ్ ఎక్కువ భాగం అమెరికాలోనే చేశారు. ఇప్పుడు తాజాగా షెడ్యూల్ తమిళనాడులోని పొల్లచిలో ఉండనుంది. ఈ చిత్రం మహేశ్‌బాబుకి 25వది.

యుఎస్‌లో తొలి షెడ్యూల్

అనుష్క 'భాగమతి' తర్వాత కోన వెంకట్ చిత్రంలో నటించనుందన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ఈమెతో పాటు అంజలి, షాలిని పాండే ముఖ్య పాత్రలు పోషించనున్నారు. మాధవన్, అవసరాల శ్రీనివాస్, సుబ్బరాజులు మరో కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమా మార్చిలో సెట్స్‌పైకి వెళ్లనుంది. తొలిషెడ్యూల్ అమెరికాలో ఉండనుందని ఆ చిత్ర నిర్మాణ సంస్థలు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పొరేషన్ సోమవారం ప్రకటించాయి. తెలుగు, తమిళం, హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులతో ఈ చిత్రం రూపొందనుంది. 'హార్రర్ థ్రిల్లర్' గా తెరకెక్కనుంది. టి.జి.విశ్వప్రసాద్, కోన వెంకట్ నిర్మాతలు. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహిస్తున్నారు. కోన వెంకట్, గోపి సుందర్, షనీల్ డియో, గోపి మోహన్, నీరజ కోన ఈ చిత్రానికి సాంకేతిక నిపుణులు. ఈ ఏడాది ద్వితీయార్థంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



అంజలి



షాలిని పాండే



అనుష్క

ప్రేమ.. బాధల 'మజిలి'



దివ్యాంశ కౌశిక్, నాగచైతన్య

నాగచైతన్య, సమంత నటిస్తోన్న 'మజిలి' చిత్రం ఫస్ట్‌లుక్‌ను కొత్త ఏడాదిని పురస్కరించుకుని విడుదల చేశారు. దానికి మంచి స్పందన వచ్చిందని ఆ చిత్రబృందం చెప్పింది. తాజాగా సంక్రాంతి సందర్భంగా రెండో లుక్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈచిత్రంలో సమంతతో పాటు దివ్యాంశ కౌశిక్ మరో కథానాయికగా చేస్తోంది. ఈ లుక్‌లో నాగచైతన్యతో ఆమె కనిపించింది. ఫస్ట్‌లుక్‌లో గడ్డంతో కనిపించిన నాగచైతన్య.. ఈ సారి మాత్రం క్లీన్ షేవ్‌తో, చేతిలో క్రికెట్ బ్యాట్ పట్టుకుని ఉన్నాడు. ప్రేమ ఉంటుంది..బాధ ఉంటుంది.. అనే ట్యాగ్ లైన్‌తో వస్తున్న ఈ చిత్రం వైజాగ్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు శివనిర్వాణ. 'నిన్నుకోరి' తర్వాత శివనిర్వాణ తెరకెక్కిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. వివాహం తర్వాత సమంత, నాగచైతన్య జంటగా నటిస్తోన్న మొదటి సినిమా ఇది. 80 శాతం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. రావు రమేష్, పోసాని కృష్ణమురళి, సుబ్బరాజ్ ఈ చిత్రంలో కీలకపాత్రల్లో నటిస్తున్నారు. గోపీసుందర్ బాణీలు సమకూరుస్తున్నారు. విష్ణు వర్మ సినిమాటోగ్రఫీ. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గరపాటి, హరీష్ పెద్ది మజిలి సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఎప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది.

క్రీడా నేపథ్యంలో...



సందీప్ కిషన్

'సుబ్రహ్మణ్యపురం' చిత్రంతో విమర్శకుల మెప్పు పొందిన సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో హీరో సందీప్ కిషన్ ఓ సినిమా చేయనున్నాడు. ఈ చిత్రం క్రీడా నేపథ్యంలో తెరకెక్కబోతుంది. భారతంలో తన బొమ్మను గురువుగా భావించి విద్య నేర్చుకున్న ఏకలవ్యుడి నుంచి బొటనవేలు గురుదక్షిణగా తీసుకున్నాడు ద్రోణాచార్యుడు. ఈ ఆధునికకాలంలో అలాంటి ఒక గురువు ఎలాంటి గురుదక్షిణ అడిగాడు అనే ఉత్సుకత రేకెత్తించే కథాంశంతో రూపొందనుంది. ఈ చిత్రానికి నిర్మాత వెంకట శ్రీనివాస్ బొగ్గరమ్. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

దర్శకుడు కట్టా రంగారావు కన్నుమూత



ప్రముఖ దర్శకుడు కట్టా రంగారావు (61)అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తెలంగాణకు చెందిన ఈ డైరెక్టర్ కమ్యూనిస్టు కుటుంబం నుంచి వచ్చారు. తన సినీ కెరీర్ ఆరంభంలో విప్లవ భావజాల సినిమాలు తీసి గుర్తింపు తెచ్చుకున్నారు. 1957 మే 5వ తేదీ జన్మించిన రంగారావు 'ఇంద్రధనుస్సు' చిత్రంతో దర్శకుడిగా సినీ పరిశ్రమకు పరిచయమయ్యారు. 90దశకంలో కమర్షియల్ సినిమాలు తెరకెక్కించారు. 'ఆఖరి క్షణం', 'ఉద్యమం', 'అలెగ్జాండర్', 'నమస్తే అన్నా', 'బొబ్బిలి బుల్లోడు', 'వారెవా మొగుడా', 'చెప్పుకోండి చూద్దాం' లాంటి చిత్రాలను రూపొందించారు. 40ఏళ్లకు పైగా ఇండస్ట్రీలో ఉన్న ఆయన దర్శకుల సంఘంలోనూ పనిచేశారు. చివరగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన 'జయ జానకి నాయక' సినిమాకు దర్శకత్వ శాఖలో పనిచేశారు. అంతేగాకుండా తెలుగు చిత్ర పరిశ్రమకు అనేక మందిని పరిచయం చేశారు. ఇలాంటివారిలో శుద్ధాల అశోక్ తేజ, ఎమ్మెస్ నారాయణ, రమేష్ అరవింద్, వడ్డేపల్లి శ్రీనివాస్, గురుచరణ్ వంటి వారు ఉన్నారు. ఈయన తెలుగు సినీ దర్శకుల సంఘానికి కార్యదర్శిగా, సభ్యుడుగా, జాయింట్ సెక్రటరీగా, ఈసీ మెంబర్‌గా బాధ్యతలు నిర్వహించారు. రంగారావు మృతికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. సినీ పరిశ్రమకు రంగారావు అందించిన సేవలు మరవలేనివని, ఆయన లేని లోటు తీర్చలేనిది అని దర్శకుడు ఎన్.శంకర్ పేర్కొన్నారు.

విద్యా వ్యవస్థపై 'అక్షర' పోరాటం



నందితా శ్వేత

నందితాశ్వేత ప్రధాన పాత్రలో రూపొందుతోన్న సినిమా 'అక్షర'. భోగి పండగను పురస్కరించుకుని ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది ఆ సినిమా యూనిట్. సమాజంలో విద్యకు మించిన వ్యాపారం లేదనే మాట ఎక్కువగా వినపడుతుంది. కానీ సమాజాన్ని మార్చే ఆయుధం విద్యే అనే అందరూ ఒప్పుకుంటారు. అక్షర ప్రయాణం ఎలా ఉండబోతుంది అనే ఆలోచనలకు ఈ మోషన్ అద్దం పడుతుంది. బలమైన కంటెంట్‌ని ఎఫెక్టివ్‌గా ప్రజెంట్ చేయడంలో చిత్ర యూనిట్ సక్సెస్ అయ్యింది. మోషన్ పోస్టర్ సోషల్ మీడియాలో ప్రశంసలు అందుకుంటుందని యూనిట్ పేర్కొంది.

దర్శకుడు బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ 'విద్య సమాజాన్ని మార్చే బలమైన ఆయుధం. కానీ విద్యావ్యవస్థ ఫక్తు వ్యాపారంలా మారిపోయింది. అలాంటి వ్యవస్థపై అక్షర చేసే పోరాటం వినూత్నంగా ఉంటుంది. నందిత శ్వేత అక్షర పాత్రకు ప్రాణం పోస్తుంది. ఆమె కెరీర్‌లో ఈ పాత్ర బెస్ట్‌గా నిలుస్తుంది. సురేష్ బొబ్బిలి అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ హైలైట్ కానుంది. మొదటి షెడ్యూల్ పూర్తయింది. వేసవిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం' అని తెలిపారు.

నిర్మాత అహితేజ బెల్లంకొండ మాట్లాడుతూ 'సినిమా కాన్సెప్ట్‌ని టీజర్‌గా రిలీజ్ చేసాం. దానికి మంచి స్పందనవచ్చింది. మోషన్ పోస్టర్‌ని కూడా కాన్సెప్ట్‌ని ఎలివేట్ చేసే విధంగా ప్లాన్ చేసాం. ఎడ్యుకేషన్ వ్యవస్థలోని లోపాలను బోల్డ్‌గా తెరమీదకు తీసుకురాబోతున్నాం' అని పేర్కొన్నారు.

ఈ చిత్రంలో సత్య, అభినవ్, శ్రీ తేజ్, అజయ్ ఘోష్, సంజయ్ స్వరూప్, శ్రీకాంత్ అయ్యర్, అప్పాజీ అంబరీష, మాణిక్యం రెడ్డి తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా : నగేష్ బెనెల్, ఎడిటర్ : సత్య, ఎడిటర్– జి.సత్య, నిర్మాణ సంస్థ: సినిమా హాల్ ఎంటర్ టైన్మెంట్.

'ఉత్తర' గ్రామీణ అమ్మాయి



శ్రీరామ్, కారుణ్య

శ్రీరామ్, కారుణ్య హీరోహీరోయిన్లుగా లైవ్ ఇన్ సి క్రియేషన్స్, గంగోత్రి ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్లలో తెరకెక్కుతోన్న సినిమా 'ఉత్తర'. అజయ్ ఘోస్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. తిరుపతిఎస్, శ్రీపతి గంగదాస్ నిర్మాతలు. ఈ చిత్రానికి తిరుపతి ఎస్ఆర్ దర్శకత్వం వహిస్తున్నారు. 'నీది నాదీ ఒకే కథ' ఫేమ్ సురేశ్ యువన్ బాణీలు సమకూరుస్తున్నాడు. చరణ్ బాబు సినిమాటోగ్రాఫీ అందిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రంలో రెండు పాటలు, టీజర్‌కి ప్రశంసలు దక్కాయని చిత్రయూనిట్ చెబుతుంది. ఓ పెద్ద నిర్మాణ సంస్థ ద్వారా ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

'సారే జహాసే అచ్చా'లో షారుఖ్ చేయడం లేదు



వ్యోమగామి రాకేశ్ శర్మ జీవితం ఆధారంగా ఓ సినిమా రూపొందనుంది. దానికి ముందు 'సెల్యూట్' అనే టైటిల్ ఖరారు చేశారు. తర్వాత దాన్ని 'సారే జహాసే అచ్చా'గా మార్చారు. ఈ సినిమాలో రాకేశ్ శర్మగా షారుఖ్ ఖాన్ చేయనున్నారు. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇది ఇప్పటివరకూ మనకు తెలిసిన సమాచారం. కానీ ఆకస్మాత్తుగా షారుఖ్ ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారని బాలీవుడ్ హంగామా పత్రిక తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ సినిమా నుంచి షారుఖ్ ఎందుకు తప్పుకున్నారన్నదానిపై మాత్రం సమాచారం లేదు. ప్రస్తుతం అతను ఉన్న పరిస్థితుల్లో ఈ చిత్రం చేయకూడదన్న ఆలోచనతోనే షారుఖ్ ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ఇటీవల 'సారే జహాసే అచ్చా' నిర్మాతలను కలసి స్నేహపూర్వకంగానే తన నిర్ణయాన్ని వ్యక్తం చేశాడట. ఇతను, అనుష్క శర్మ, కత్రినా కైఫ్ కలసి నటించిన చిత్రం 'జీరో' ఆశించిన ఫలితం రాకపోవడం, ఈ సమయంలో ఇటువంటి సినిమా చేయడం మంచిది కాదనుకోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నాడని బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఈయన ఈ సినిమా నుంచి తప్పుకున్నట్టు అధికారికంగా మాత్రం ప్రకటన రాలేదు. ఈ కథను మొదట అమిర్ ఖాన్ చేయాల్సి ఉంది. కానీ అతను తన కలల ప్రాజెక్టు అయిన 'మహాభారత' చేయాల్సి రావడం వల్ల ఈ సినిమాను చేసేందుకు అంగీకరించలేదు. తనకు బదులుగా షారుఖ్ ఖాన్ పేరును అమిరే సూచించారు. అప్పుడు ఈ సినిమా బోర్డులోకి షారుఖ్ వచ్చాడు. ఇప్పుడు టైటిల్ రోల్ కోసం యువ కథానాయకుడితో చేయించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది.

'రాజీ' సీక్వెల్



అలియా భట్

హరీందర్ ఎస్. సిక్కా రాసిన 'కాలింగ్ సెహ్మట్' పుస్తకం ఓ వాస్తవ సంఘటనకు ఆధారం. గూఢచారి అయిన కాశ్మీరి అమ్మాయి జీవితమే ఈ పుస్తకం. ఈ బుక్ ఆధారంగా రూపొందిన చిత్రం 'రాజీ'. అలియా భట్ టైటిల్ పోషించింది. ఈ సినిమా మొత్తాన్ని ఆమె భుజస్కంధాలపై నడిపించింది. ఈ చిత్రం బాలీవుడ్‌లో భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్ చేయబోతున్నారట. దానికి హరీందర్ సిక్కా సన్నాహాలు చేస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా కథను కూడా అలియా భట్‌కు వివరించాడు. ఆమె చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాకిస్థాన్ నుంచి ఇండియాకు రాజీ రావడంతో సీక్వెల్ ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి తన వ్యక్తిగత జీవితంపై ఈ సినిమా మొత్తం నడుస్తుంది. ఇక్కడకొచ్చాక రాజీ పూర్తిగా డిప్రెషన్‌లోకి వెళ్లిపోతుంది. ఆ తర్వాత ఆమె పడ్డ ఇబ్బందులు, తన స్వంత కొడుకుని కాదనడం, సమాజం ఆమెను దూరంగా ఉంచడం వంటివన్నీ ఈ సీక్వెల్‌లో చూపించబోతున్నారు.



'అక్కడొకడుంటాడు' ట్రైలర్ విడుదల

శివ కంఠంనేని టైటిల్ పాత్రలో నటిస్తోన్న సినిమా 'అక్కడొకడుంటాడు'. రవిబాబు, వినోద్ కుమార్, ఇంద్రజ ఇత ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. రామ్ కార్తీర్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక హీరోహీరోయిన్లుగా నటించారు. శ్రీపాద విశ్వక్ దర్శకత్వం వహించారు. లైట్‌హౌస్ సినీ మ్యూజిక్ పతాకంపై కె. శివశంకరరావు, రావుల వెంకటేశ్వరావు సంయుక్తంగా నిర్మించారు. సెన్సార్ పనులను పూర్తి చేసుకుంది. హైదారాబాద్‌లో జరిగిన కార్యక్రమలో ఈ చిత్రం ట్రైలర్‌ను నాగశౌర్య ఆవిష్కరించారు. ఆడి పాడి గడిపేద్దాం ..అంటూ సాగే గీతాన్ని నిర్మాత కెఎస్ రామారావు విడుదల చేశారు. ఈ చిత్రం ట్రైలర్, పాట చాలా బాగున్నాయని కేఎస్ రామారావు ఈ సందర్భంగా అన్నారు.

నాగశౌర్య మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్, పోస్టర్లు చాలా బాగున్నాయి. టైటిల్ పాత్రధారి శిశ కంఠంనేని తన పాత్రలో ఒదిగిపోయారు. శివ కంఠంనేని మాట్లాడుతూ 'మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను ఈ చిత్రంలో చూపిస్తున్నాం. అనుక్షణం ఉత్కంఠను కలిగిస్తూ ప్రేక్షకులను చివరి వరకూ ఆకట్టుకునే సన్నివేశాలతో ఈచిత్రం రూపొందిస్తున్నాం' అని తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన రావుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'త్వరలో ఆడియో విడుదల చేస్తాం. ఇదే నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని వెల్లడించారు. దర్శకుడు శ్రీపాద విశ్వక్ మాట్లాడుతూ 'అనుకోని ఆపదలో చిక్కుకున్న ప్రేమజంటకు స్నేహితుల సహాయం అందే సమయంలో మరో ప్రమాదం ఎదురవుతుంది. దాని నుంచి ఆ ప్రేమ జంట ఎలా బటయపడిందన్నదే ఈ చిత్రం ప్రధానం అంశం' అని తెలిపారు.

డా॥ స్పెషలిస్ట్





సంతానలేమి సమస్యకు సరైన పరిష్కారాన్ని ఆధునిక వైద్య శాస్త్ర పరిశోధనల ఫలితాలే అందించాయి. కొంతమంది చెబుతున్నట్టు సంతానసాఫల్యమనే ఈ సంతానోత్పత్తి విజ్ఞానం మహాభారత కాలం నుంచీ లేదని ఈ పరిశోధనలే తేటతెల్లం చేస్తున్నాయి. సంతానలేమికి దంపతులిద్దరిలోనూ కారణాలున్నప్పటికీ మహిళలనే ఎక్కువగా అందుకు భాగస్వామిని చేసి సామాజికంగా, కుటుంబపరంగా వేధింపులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మహిళల్లో వచ్చే సంతానలేమికి కారణాలు, వాటికి చికిత్సలు, ఏ విధంగా వైద్య విజ్ఞానం సాయంతో సంతానసాఫల్యాన్ని సుసాధ్యం చేసుకోవచ్చో తదితర విశేషాలు ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్'లో తెలుసుకుందాం!

ఆధునిక వైద్య విజ్ఞానంతోనే సంతాన సాఫల్యం

వివాహం జరిగిన తర్వాత సంతానం కోసం ఎదురుచూడడం అనివార్యమౌతోంది. కొంతమంది సంతానాన్ని కనే విషయాన్ని వాయిదా వేస్తున్నప్పటికీ ఇతర కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారు ఈ విషయంపై ఆసక్తినీ, ఒత్తిడినీ కలిగిస్తుంటారు. సకాలంలో సంతానం కలగలేదంటే ఆ దంపతులు సంతానలేమి సమస్యతో ఉన్నట్టే గుర్తించాలి. దీనికి రకరకాల కారణాలున్నాయి. కొన్నిసార్లు దంపతులిద్దరిలోనూ ఈ సమస్య ఉండొచ్చు. ఇలాంటి జంటలో 55 శాతం కారణాలు పురుషుడిలో, 54 శాతం కారణాలు మహిళల్లో కన్పిస్తాయి.

మహిళల్లో సంతానోత్పత్తికి ప్రతిబంధకాలు

మహిళల్లో సంతానలేమికి గల కారణాల్లో ముఖ్యమైనవి.

- బీజవాహికలు దెబ్బతినడం.
- రుతుచక్రం సక్రమంగా లేకపోవడం.
- శారీరక ఆరోగ్య సమస్యలు.
- ఆలస్యంగా వివాహం జరగడం.

ఎండోమెట్రియాసిస్

శారీరక ఆరోగ్యసమస్యలను పరిశీలిస్తే మహిళల్లో ఎండోమెట్రియాసిస్ ముఖ్యమైనది.



గర్భాశయ కణాల్లాంటివి గర్భాశయంలో కాకుండా దాని వెలుపల అసాధారణ రీతిలో వృద్ధి చెందడాన్ని ఎండోమెట్రియాసిస్ అంటారు. సాధారణంగా గర్భాశయం లోపలి కణాలు ప్రతినెలా రుతుస్రావంలో బయటపడతాయి. వెలుపల ఉండే కణాలు మాత్రం కణజాలానికి అతుక్కొని ఉంటాయి. అండాశయం పైన, బీజవాహికల వద్ద, గర్భాశయం లేదా పేగు వెలుపలి భాగాల వద్ద ఈ కణాలుంటాయి. వాటి సమీప అవయవాల్లోనూ ఈ కణాలుండే అవకాశముంది. వజీనా, సెర్విక్స్, బ్లాడర్ పైభాగాల్లోనూ ఉండే వీలుంది. ఇవి క్యాన్సర్ కారకాలు కానప్పటికీ ఇతరత్రా సమస్యలను కలిగిస్తాయి. ఈ సమస్య ఉన్న వారిలో ప్రత్యేకంగా ఎలాంటి లక్షణాలు బయటపడవు. సంతానలేమికి చికిత్స పొందేవారిలో 20-50 శాతం దాకా ఈ సమస్యతో బాధపడుతున్నవారే. సాధారణంగా 25 -35 ఏళ్ళ వయస్సులో మహిళలు ఈ సమస్యతో సతమతమవుతున్నారు. పొడవుగా, సన్నగా, పొడవుకు తగ్గ బరువు లేనివారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. ఫిజికల్ ఎగ్జామినేషన్, కొన్ని భాగాల్లో ఏర్పడే నొప్పి లాంటి వాటితో ఈ సమస్యను గుర్తించవచ్చు. లాప్రోస్కోపీతో దీన్ని నిర్ధారించవచ్చు.

నెలసరి సమస్యలు

మహిళల్లో సంతానలేమికి సంబంధించిన సమస్యల్లో 20 శాతం దాకా నెలసరి సక్రమంగా లేకపోవడం అనేది ఒక కారణంగా ఉంది. రుతుచక్రం సక్రమంగా లేకపోవడానికి ఎన్నో కారణాలున్నాయి. వాటి లక్షణాలు బయటపడే సందర్భాల్లో గుర్తించి, వాటికి చికిత్స చేయించాలి. ఈ కారణాల్లో కొన్నింటిని మందులతో, మరికొన్నింటిని జీవనశైలిలో మార్పులతో చక్కబర్చుకోవచ్చు. మరికొన్ని సమస్యలను మాత్రం సరిదిద్దుకోలేం. ఇలాంటి సందర్భాల్లో ఎగ్ డోనార్ సాయంతో గర్భధారణకు ప్రయత్నించవచ్చు.

గర్భాశయ సమస్యలు

గర్భాశయ సమస్యల్లో ముఖ్యమైనవి ఫైబ్రాయిడ్స్. ఇవి గర్భాశయం లోపల, వెలుపల పెరిగే, క్యాన్సర్ కారకం కాని ఒక విధమైన కంతుల్లాంటివి. ఫైబ్రాయిడ్స్‌కి తగిన చికిత్స క్రమం తప్పకుండా చేయించాలి.

హైపోథాల్మిక్ అన్‌ఒవ్యులేషన్

వ్యాయామం, ఒత్తిళ్లు, బరువు తగ్గడంలాంటి వాటివల్ల హైపోథాల్మిక్ అన్‌ఒవ్యులేషన్ అనే సమస్య ఏర్పడుతుంది.

హైపర్ ప్రొల్టానేమియా

పిట్యూటరీ గ్రంథి విడుదల చేసే ప్రొలాక్టిన్ స్థాయి అధికం కావడమూ గర్భధారణ సమస్యలకు కారణమవుతోంది.

పోలీసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్)



మహిళల్లో ఋతుచక్రాన్ని, పిల్లలను కనే శక్తిని, హార్మోన్లను, గుండెను, రక్త నాళాలను ప్రభావితం చేసే సమస్యని పీసీఓఎస్ అంటారు. ఈ సమస్య ఉన్న వారిలో ఆండ్రోజెన్ (మేల్ హార్మోన్స్) స్థాయిలు అధికంగా ఉంటాయి. ఆండ్రోజెన్ అండాల అభివృద్ధిని, విడుదలను దెబ్బతీస్తుంది. ఋతుచక్రం క్రమబద్ధంగా ఉండదు. అండాశయాల్లో ద్రవంతో నిండిన కంతుల్లాంటివి ఉంటాయి. కొంతమందిలో సెర్వికల్ స్రావాలు చిక్కగామారి, వీర్యకణాలు ఈదుతూ బీజవాహికల్లోకి ప్రవేశించడాన్ని అడ్డుకుంటాయి.

ప్రతి పదిమంది మహిళల్లో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నారు. మరికొందరిలో పిట్యూటరీ గ్రంథి లేదా హైపోథాలమస్ (మెదడులోని ఓ భాగం) పనితీరు సరిగా లేక పరిపక్వ అండాల ఉత్పత్తిలో వైఫల్యం కలుగుతుంది. ఈ సమస్యలకు ప్రధాన కారణం హార్మోన్ల అసమతుల్యత.

స్కార్డ్ ఓవరీస్

సర్జరీలు లేదా రేడియేషన్ చికిత్స సందర్భాల్లో అండాశయానికి వాటిల్లే నష్టం వల్ల స్కార్డ్ ఓవరీస్ సమస్య ఉత్పన్నమవుతుంది.

ప్రిమెచ్యూర్ మెనోపాజ్

కొంతమంది మహిళల్లో 40 ఏళ్ళ కంటే ముందుగానే రుతుచక్రం ఆగిపోవడాన్ని ప్రిమెచ్యూర్ మెనోపాజ్ అంటారు. ఇటువంటివారిలో గర్భధారణ జరగడం కష్టం.

ఫోలిసియెల్ సమస్యలు

కుహరంలో అండం ఉత్పత్తి అయినప్పటికీ బయటకు రాకపోవడం లాంటి సమస్యలని ఫోలిసియెల్ సమస్యలంటారు.

బీజవాహికల సమస్యలు

మహిళల సంతానలేమి సమస్యల్లో 20 శాతం దాకా బీజవాహికలు సరిగా పని చేయకపోవడం వల్ల వస్తున్నాయి. క్షయ వంటి ఇన్‌ఫెక్షన్లు, లైంగికంగా సంక్రమించే వ్యాధులు (ఎస్‌టిడి) లాంటి హైడ్రోసాల్పిన్‌ఎక్స్ (బీజవాహిక మూసుకుపోవడం, లోపల ద్రవం నిండిపోవడం), ట్యూబో-ఓవేరియన్ మాసెస్‌కు కారణమవుతాయి.

పొత్తికడుపు వ్యాధులు

అపెండిసైటిస్, కొలిటిస్ (పేగువాపు లాంటిది) లాంటివి పొత్తికడుపు కేవిటీని ఉబ్బిపోయేలా చేస్తాయి. ఇది బీజవాహికలపై ప్రభావాన్ని కనబరుస్తుంది. అవి మూసుకుపోయే అవకాశం ఉంటుంది.

గతంలో జరిగిన సర్జరీలు

తొడ, పొత్తి కడుపు భాగంలో గతంలో ఎప్పుడైనా, ఏవైనా సర్జరీలు జరిగి.. బీజవాహికలు మూసుకుపోయి, అండాలు వాటి గుండా ప్రయాణించలేకపోవడం వంటి సమస్యలు గర్భధారణ శక్తిని దెబ్బతీస్తాయి.

ఎక్టోపిక్ ప్రెగ్నన్సీ

పిండం గర్భాశయంలో గాకుండా గర్భాశయం వెలుపల బీజవాహికలలోనే పెరగడాన్ని ఎక్టోపిక్ ప్రెగ్నన్సీ అంటారు. దీనివల్ల బీజవాహికలు దెబ్బతినడమే గాకుండా తల్లికి ప్రాణాపాయం ఉంటుంది.



కాంజెనిటల్ లోపాలు, బీజవాహికలు వాయడం వంటి కారణాలూ సంతాన సాఫల్యాన్ని దెబ్బతీస్తాయి.

సంతాన సాఫల్యం కోసం

మహిళల్లో సంతానలేమి ఉన్నట్టు నిర్ధారణైతే, దానికోసం వివిధ రకాలుగా చికిత్స అందించాలి.

- మొదట ఆ జంటకు కౌన్సెలింగ్ చేసి, ఆ తరువాత జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులను గురించి వివరించాలి.
- పోషకాహారం ఆవశ్యకతను వివరించడంతో పాటు అధికంగా బరువు ఉంటే బరువు తగ్గాల్సిందిగా సూచించాలి.
- ఆ తరువాత సైకోసెక్సువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి.
- అవసరాన్ని బట్టి ఎండోమెట్రియోసిస్, ఫైబ్రాయిడ్స్ (గర్భాశయ కంతులు) లాంటి పరీక్షలు జరిపించాలి.
- థైరాయిడ్ సమస్యలు, హైపర్‌ప్రొలాక్టినేమియా, పీసీఓఎస్ లాంటి ఎండోక్రానికల్ సమస్యలకు చికిత్స చేయాలి.
- ఒవులేషన్ ఇండక్షన్ (ఒక ఋతుచక్రంలో పలు అండాలు విడుదల అయ్యేందుకు దోహదం చేసే మందుల వాడకం) సరైన సమయంలో దంపతులు సంగమించడంపై సూచనలు ఇవ్వాలి.
- ఒవులేషన్ ఇండక్షన్ తర్వాత ఐయూఐ (కృత్రిమంగా వీర్య కణాలను రిప్రొడక్టివ్ ట్రాక్‌లోకి ప్రవేశపెట్టడం) ప్రక్రియ చేపట్టడం.
- కంట్రోల్డ్ ఓవరియన్ హైపర్‌స్టిమ్యులేషన్, అనంతరం ఐవీఎఫ్, ఐసీఎస్ఐ వంటి ప్రక్రియలు నిర్వహించడం.
- ఇన్విట్రో మెచ్యురేషన్ (ఐవీఎం)- డ్రగ్ ఫ్రీ ఐవీఎం, లేజర్ అసిస్టెడ్ హేచింగ్, ఊసైట్ విట్రిఫికేషన్

ఎంబ్రోయొ విట్రిఫికేషన్ వంటి విధానాలతో సంతానసాఫల్య చికిత్స నిర్వహిస్తారు.. జీవనశైలికి సంబంధించి దంపతులు చేసుకోవాల్సిన మార్పులను వైద్యులు సూచిస్తారు. గర్భధారణ సంబంధిత అంశాలపై అపోహలను తొలగిస్తారు. సహజ, కృత్రిమ గర్భధారణ రెండింటిలోనూ జీవనశైలి ఎంతో కీలకపాత్ర వహిస్తుంది.

కొత్త ఆశలు కల్పించే ఐవీఎఫ్

సంతానలేమితో నిరాశానిస్పృహలతో ఉన్నవారిలో కొత్త ఆశలు రేకెత్తించి వారిని సంతానసాఫల్యం కలిగించడంలో ఐవీఎఫ్ విధానం మెరుగైన ఫలితాలను అందిస్తోంది. శరీరం వెలుపల అండాలు వీర్యకణాలతో ఫలదీకరణం చెందడాన్ని ఐవీఎఫ్‌గా వ్యవహరిస్తారు. సంతానలేమి చికిత్సలో దీన్ని మేజర్ ట్రీట్‌మెంట్ అనే చెప్పొచ్చు. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ విధానాలు విఫలమైన సందర్భాల్లో ఈ ప్రక్రియను అనుసరిస్తారు. ఈ ప్రక్రియలో ఒవులేషన్ ప్రక్రియను హార్మోన్ల ద్వారా నియంత్రించడం, అండాశయాల నుంచి అండాలు తీసి ఫ్లూయిడ్ మీడియంలో వీర్యకణాలచే ఫలదీకరింపజేయడం ఉంటాయి. ఫలదీకరణం చెందిన అండాన్ని (సంయుక్త బీజాన్ని) మహిళ గర్భంలో ప్రవేశపెడతారు. విట్రో అంటే లాటిన్ భాషలో గాజు అని అర్థం. ఈ ప్రక్రియను చేపట్టిన తొలిదశలో ఈ ప్రయోగాలు గాజు బీకర్లు, టెస్ట్‌ట్యూబ్‌లలో జరిగేవి. ప్రస్తుతం విట్రో అనే పదాన్ని శరీర కణజాలం వెలుపల జరిగే అన్ని ప్రక్రియలకు ఉపయోగిస్తున్నారు. నేడు విట్రో ఫెర్టిలైజేషన్‌ను శాలోవర్ కంటైనర్లలో చేస్తున్నారు.





డాక్టర్ వల్లి కొడాలి,
ఎంబిబిఎస్, ఎంఎస్.,
స్త్రీ వ్యాధులు, ప్రసూతి వైద్య నిపుణులు,
విగ్నేష్ హాస్పిటల్స్,
సూర్యారావు పేట, విజయవాడ.

చిన్నారి



పొడుపు కథ

ఒక కన్ను కలది కాకి కాదు,
ఒక కన్నం ఉంది పుట్ట కాదు,
ఏమిటది..?




జవాబు : సూది

జోక్:

డ్రిల్ మాస్టర్: రెడీ..వన్..టూ.. త్రీ... అదేంటి చింటూ! నువ్వు పరిగెత్తవేం?

చింటు : మీరు రెడీ..వన్..టూ.. త్రీ అన్నారు కదా సార్.. నా నంబరు ఫోర్.. నా నంబరు చెప్పాక పరిగెడదామని ఆగా..!

చుక్కలు కలపండి!



పిల్లలూ! పైనున్న చిత్రంలోని చుక్కలను కలిపి, బొమ్మ ఏమిటో కనిపెట్టండి!

తెలుగు భాష




తెలుగు భాష వెలుగురా
తెలుగు చాలా తెగువరా
మధురమైన భాషరా
సంగీత భాష తెలుగురా
తెలుగు మనకు శ్వాసరా
భాషలందు లెస్సరా
రాయులు వారు మెచ్చెరా
తెలుగును గౌరవించెరా
తెలుగునందు నడువురా
తెలుగు మనకు తల్లిరా
తెలుగు కల్పవల్లిరా
తెలుగు పాలవెల్లిరా
గుబాళించు మల్లిరా



మేఘనాథ్
5వ తరగతి,
ప్రాథమిక పాఠశాల,
మెయిన్,హెచ్.మురవణి,
కర్నూలు జిల్లా.

దారి చూపండి!



పిల్లలూ! ఈ చిత్రంలోని కుందేలు గుడ్లను చేరే దారిని కనుక్కోండి?

నేను గీసిన బొమ్మ



ఆర్. మరియబాబు,
6వ తరగతి,
జెడ్‌పి హైస్కూల్, పెనుమాక,
తాడేపల్లి మండలం,
గుంటూరు జిల్లా.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ -Chinnaarips@gmail.com

తొలిరౌండ్‌లోనే ముర్రే ఔట్

- ప్రజ్నేష్ పరాజయం
- ఆస్ట్రేలియా ఓపెన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిరౌండ్ పోటీల్లో టాప్ సీడెడ్ ఆటగాళ్లు సునాయాస విజయాలను నమోదుచేసుకోగా, ఇంగ్లాండ్‌కు చెందిన ముర్రే, భారత్‌కు చెందిన ప్రజ్నేష్‌లు పరాజయం పాలయ్యారు. సోమవారం నుండి ప్రారంభమైన తొలిగ్రాండ్‌స్లామ్ టోర్నీలో మూడోసీడ్ ఫెదరర్ 6-3, 6-4, 6-4తో ఇస్తోమిన్(రష్యా)పై, రెండోసీడ్ నాదల్ 6-4, 6-3, 7-5 తేడాతో డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)పై గెలిచారు. రోబెర్టో బుస్టా (స్పెయిన్) 6-4, 6-4, 6-7(5-7), 6-7 (4-7), 6-2 ఆండీ ముర్రేను హోరాహోరీ పోరులో ఓడించి సంచలనం సృష్టించాడు. దీంతో కెరీర్‌లో చివరి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడుతున్న ముర్రే తొలిరౌండ్‌లోనే అన్‌సీడెడ్ చేతిలో ఓడి వెనుదిరగాల్సి వచ్చింది. ఇతర పోటీల్లో ఆరోసీడ్ సిలిక్, ఖచనోవ్, అండర్సన్‌లు గెలిచి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. ఇక 9వ సీడ్ ఇస్నర్(అమెరికా), ఎడ్మండ్(ఇంగ్లాండ్)లు అనూహ్యంగా అన్‌సీడెడ్ ఆటగాళ్ల చేతిలో ఓడడం మొదటిరోజు ఆటలో విశేషం. మహిళల సింగిల్స్ తొలిరౌండ్‌లో 3వ సీడ్ వాజ్నియోంకి 6-3, 6-4 తేడాతో, 8వ సీడ్ క్విటోవా, బెర్టెన్స్, స్టెఫెన్స్ గెలిచి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. భారత్‌కు చెందిన ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తొలి రౌండ్‌లోనే నిరాశపరిచాడు. సోమవారం 39వ ర్యాంకర్ టియాఫో(అమెరికా) చేతిలో 7-6(9/7), 6-3, 6-3 తేడాతో ప్రజ్నేశ్ ఓటమిపాలయ్యాడు.

హోరా హోరీగా బాస్కెట్‌బాల్ ప్రీక్వార్టర్ పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు

మూడు రోజులుగా కృష్ణాజిల్లా నూజివీడు డిఎఆర్ కళాశాలలో జరుగుతున్న కళాప్రపూర్ణ రాజా వెంకటాద్రి అప్పారావు బహుద్దూర్ 43వ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు హోరాహోరిగా జరుగుతున్నాయి. సోమవారం ప్రీక్వార్టర్ ఫైనల్స్ మహిళా, పురుషుల విభాగంలో జరిగిన కొన్ని పోటీలు ఏకపక్షంగానూ, మరికొన్ని పోటీలు హోరాహోరీగా జరిగాయి. మహిళా విభాగంలో లీగ్ దశలో విటిహెచ్ నూజివీడు జట్టు, ఎన్‌టిఆర్ గుడివాడ జట్టుపై 17-5 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. అనంతపురం జట్టు లిటిల్ ఏంజెల్స్ జట్టుపై 23-4 పాయింట్లు తేడాతో, వివిఎస్ఆర్ హైదరాబాద్ జట్టు కొత్తగూడెం జట్టుపై 26-13 తేడాతోను, ఎన్‌టిఆర్ గుడివాడ జట్టు వైహెచ్‌ఒబి గుంటూరు జట్టుపై 14-9 తేడాతోను, జివిస్సీ గుంటూరు జట్టు సిబిఎ రాజమండ్రి జట్టుపై 22-19 తేడాతోను, సెయింటాన్స్ నూజివీడు జట్టు ఎన్‌టిఆర్ గుంటూరు జట్టుపై 20-14 తేడాతో, డిఎఆర్ నూజివీడు జట్టు చిత్తూరు జట్టుపై 32-31 తేడాతో విజయం సాధించాయి. పురుషుల విభాగంలో సిబిఎ విజయవాడ జట్టు ఎన్‌టిఆర్ గుడివాడ జట్టుపై 26-21 తేడాతో విజయం సాధించింది. డాన్‌బాస్కో హైదరాబాద్ జట్టు సిబిఎ విజయవాడపై 51-34 తేడాతో, సిఎపి హైదరాబాద్ జట్టు కర్నూలు జట్టుపై 30-12 తేడాతోను, ఎపి యూత్ జట్టు వైబిఎ మార్టేరు జట్టుపై 43-33 పాయింట్ల తేడాతో, ఎన్‌బిఎ కాకినాడ జట్టు వైహెచ్‌ఒబి గుంటూరు జట్టుపై 20-4 పాయింట్ల తేడాతో, డాన్‌బాస్కో జట్టు జివిస్సీ గుంటూరు జట్టుపై 36-12 తేడాతోను, ఎన్‌టిఆర్ గుంటూరు జట్టు డిఎస్ఎ కాకినాడ జట్టుపై 38-22 తేడాతో, ఎపి యూత్ జట్టు ఈగల్స్ జట్టుపై 51-18 పాయింట్లతో విజయం సాధించాయి. మహిళా విభాగంలో ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో నర్సరావుపేట జట్టు, చిత్తూరు జట్టుపై 33-27 పాయింట్ల తేడాతో విజయం సాధించగా, వివిఎస్ఆర్ హైదరాబాద్ జట్టు అనంతపురం జట్టుపై 37-34 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి.



ఛేత్రీ సేనకు నిరాశ

- బహ్రెయిన్ చేతిలో 1-0తో ఓటమి
- ఎఎఫ్‌సి టోర్నీలో ముగిసిన భారత్ పోరు

అబుదాబి : ఎఎఫ్‌సి ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నీలో నాకౌట్(ప్రి క్వార్టర్స్)కు చేరాలన్న భారతజట్టు ఆశలు అడియాశలయ్యాయి. సోమవారం ఉత్కంఠభరితంగా చివరి నిమిషం వరకూ బహ్రెయిన్‌తో తలపడిన భారత ఫుట్‌బాల్ జట్టు 0-1తో పరాజయం పాలైంది. అదనపు సమయం (91వ ని.)లో బహ్రెయిన్ స్ట్రయికర్ జమాల్ రషీద్ పెనాల్టీ షూటౌట్ ద్వారా ఆ జట్టును గెలిపించాడు. ఈ మ్యాచ్‌లో భారతజట్టు గోల్‌కీపర్ గురుప్రీత్ సింగ్ సంధూ అద్భుత ప్రదర్శనతో బహ్రెయిన్ ఆటగాళ్లు పలుసార్లు గోల్‌పోస్ట్‌పై చేసిన దాడులను సమర్ధవంతంగా తిప్పికొట్టగలిగాడు. కానీ పెనాల్టీ షూటౌట్ ద్వారా జమాల్ కొట్టిన బంతిని ఆపగల్గితే భారత్ తొలిసారి నాకౌట్‌కు చేరేది. ఈ పరాజయంతో కోట్లాది ఫుట్‌బాల్ అభిమానులను ఛెత్రీ సేన మరోసారి నిరాశపరిచింది. గ్రూప్-ఏలో భాగంగా యుఏఈ-థాయ్‌లాండ్ జట్ల మధ్య జరిగిన మరో 1-1తో డ్రాగా ముగిసింది. దీంతో ఈ గ్రూప్‌లో యుఏఈ, బహ్రెయిన్ జట్లు నేరుగా ప్రి కార్వర్స్‌కు అర్హత సాధించినట్లైంది.



గెలిస్తేనే నిలిచేది

నేడు ఆస్ట్రేలియాతో రెండో వన్డే

ఉదయం 8.50 ని॥ల నుంచి సోనీ సిక్స్‌లో

అడిలైడ్ : టీమిండియా వన్డే సిరీస్‌ను చేజార్చుకోకుండా ఉండాలంటే మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగే రెండోవన్డేలో నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంతో సిడ్నీలో జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య జట్టు 34 పరుగుల తేడాతో చేతిలో ఓడిపోవడంతో నేడు జరిగే వన్డేలో టీమిండియా గెలిస్తేనే సిరీస్‌లో నిలిచే అవకాశముంది. తొలివన్డేలో కేవలం నాలుగు పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును రోహిత్, ధోనీలు ఒడ్డున పడేశారు. దీంతో అడిలైడ్ మైదానంలో టీమిండియా బ్యాట్స్‌మన్లు బ్యాట్‌కు పని చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

పాండ్యా, రాహుల్‌ల స్థానంలో శుభ్‌మన్ గిల్, విజయ్ శంకర్‌లు జట్టుకు అందుబాటులో ఉన్నా ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు శంకర్ సేవలను మాత్రమే టీమిండియా వినియోగించుకోనుంది. సిడ్నీలో రోహిత్ సెంచరీతో కదంతొక్కి అంతర్జాతీ యంగా 22వ శతకాన్ని పూర్తిచేసుకొని అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. ఆ మ్యాచ్‌లోనే ధోనీ కదంతొక్కి 96 బంతులను ఎదుర్కొని 51 పరుగులు చేశాడు. పరిస్థితులకు తగ్గట్టు ఆడినా క్రీజులో కుదురుకున్న తర్వాత పరుగులు రాబట్టడంలో కొంత వెనుకబడ్డాడని చెప్పవచ్చు. చివర్లో భారతజట్టుకు మరి కొన్ని బంతులు మిగిలి ఉంటే మ్యాచ్ ఫలితం వేరేలా ఉండేదేమో! వీటి నేపథ్యంలో నేడు కంగారు జట్టుతో తలపడే రెండో వన్డేలో భారతజట్టు ఓపెనింగ్, మిడిలార్డర్ బ్యాట్స్‌మన్లు తప్పక రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అద్భుత ఫామ్‌లో ఉన్న అంబటి రాయుడు తొలి వన్డేలో డకౌటై నిరాశపరిచాడు. దీంతో నేటిమ్యాచ్‌లో కదం తొక్కాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే ధావన్, కోహ్లీ, దినేష్ కార్తీక్‌లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. ఆల్‌రౌండర్ జడేజా సైతం లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మన్‌ల సాయంతో మ్యాచ్‌ను గెలిపించాల్సిన బాధ్యత అతనిపై ఉంది. ఇక బౌలర్ల విషయానికొస్తే ఖలీల్ అహ్మద్ తొలి వన్డేలో వికెట్ల సాధనలో వెనుకబడ్డాడు. దీంతో రెండో వన్డే తుదిజట్టులో నిలవాలంటే మహ్మద్ సిరాజ్‌నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది.

భారతజట్టు : విరాట్ కోహ్లీ(కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, దినేష్ కార్తీక్, ఎంఎస్ ధోనీ(వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్/చాహల్, రవీంద్ర జడేజా/కేదర్ జాదవ్, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ షమి, సిరాజ్/విజయ్ శంకర్.

ఆస్ట్రేలియాజట్టు : అరోన్ ఫించ్(కెప్టెన్), బెహ్రెన్‌డోర్ఫ్, క్యారీ(వికెట్‌కీపర్), హ్యాండ్స్‌కోంబ్, ఉస్మాన్ ఖావాజా, లియాన్, మిచెల్ మార్ష్/షాన్ మార్ష్, మ్యాక్స్‌వేల్, రిచర్డ్‌సన్, సిడెల్/టర్నెర్, స్టాన్‌లేక్/స్టోనిస్, ఆడమ్ జంపా.



గోవాలో జరిగిన 13వ సీనియర్ నేషనల్స్ డబుల్ వికెట్ క్రికెట్ టోర్నీ టైటిల్‌ను ఆంధ్రప్రదేశ్ జట్టు చేజిక్కించుకుంది. జనవరి 8న జరిగిన ఫైనల్లో ఆంధ్రా జట్టు కేరళ జట్టుపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కేరళ నిర్ణీత 8 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. 73 పరుగుల లక్ష్యాన్ని ఆంధ్రప్రదేశ్ జట్టు 7.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా ఛేదించింది. దీంతో తొలిసారి ఆంధ్రప్రదేశ్ జట్టు డబుల్ వికెట్ టోర్నీ విజేతగా అవతరించింది. క్రీడాకారులను ఆంధ్ర డబుల్ వికెట్ టోర్నీ గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్, వెంకట్ అభినందించారు.

కిదాంబి జాక్‌పాట్

చైనా స్పోర్ట్స్ బ్రాండ్ లీ నింగ్‌తో రూ.35 కోట్ల ఒప్పందం

LI-NING

న్యూఢిల్లీ: తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ జాక్‌పాట్ కొట్టేశాడు. చైనా స్పోర్ట్స్ బ్రాండ్ లీ నింగ్‌తో నాలుగేళ్లకు భారీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీని విలువ రూ.35 కోట్లు. మాజీ ప్రపంచ నంబర్ వన్ శ్రీకాంత్ భారత్ తరఫున ఆరు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచిన ఒకే ఒక్క ఆటగాడు కావడం విశేషం. ఇక లీ నింగ్ చైనాలో అతిపెద్ద స్పోర్ట్స్ బ్రాండ్. స్పాన్సర్‌షిప్‌తో పాటు క్రీడా సామగ్రిని అందజేస్తుంది. చైనా, ఇండోనేసియా, సింగపూర్, ఆస్ట్రేలియాలో బ్యాడ్మింటన్ జట్లకు లీ నింగ్ తమ ఉత్పత్తులను పంపుతోంది. 2018 ఆసియా క్రీడల్లోనూ భారత జట్టుకు అధికారిక స్పాన్సర్‌గా వ్యవహరించింది. టోక్యోలో 2020 ఒలింపిక్స్ జరిగే వరకు టీమిండియా అధికారిక దుస్తుల స్పాన్సర్‌గానూ ఉంటుంది. లీ నింగ్ అంటే నాణ్యత, నిలకడ అని శ్రీకాంత్ ఇందుకు సరిగ్గా సరిపోతాడని లీ నింగ్ ఇండియా భాగస్వామి సన్‌లైట్ స్పోర్ట్స్ డైరెక్టర్ మహేందర్ కపూర్ తెలిపారు.

దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్

మూడోటెస్ట్‌లోనూ పాకిస్తాన్ చిత్తు



జోహాన్స్‌బర్గ్ : మూడు టెస్టుల సిరీస్‌ను ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు 3-0తో చేజిక్కించుకుంది. 381 పరుగుల భారీలక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ జట్టు సఫారీబౌలర్లు ఓలీవర్, రబాడా దెబ్బకు 65.4 ఓవర్లలో 274 పరుగులకే పరిమితమైంది. ఓవర్‌నైట్‌స్కోర్ మూడోరోజు మూడు వికెట్ల నష్టానికి 153 పరుగులతో సోమ వారం బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు వైట్‌వాష్ నుండి తప్పించుకునే ప్రయత్నం చేసినా ఫలించలేదు. నాల్గోరోజు అసద్ షఫీక్ (65), ఇమాముల్ హక్(35), షాన్ మసూద్(37) రాణించినా మిగతా బ్యాట్స్‌మన్లు నిరాశపర్చడంతో ఆతిథ్య సఫారీజట్టు చేతిలో పాకిస్తాన్ 107 పరుగులతో పరాజయం పాలైంది. రబాడా, ఓలీవర్‌కు మూడేసి, స్టెయిన్‌కు రెండు వికెట్లు లభించాయి. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ డికాక్‌కు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఓలీవర్‌కు లభించాయి.

అభ్యంతరకర పోస్టులపై షర్మిల ఆగ్రహం

భర్త అనిల్, పార్టీ నేతలతో కలిసి పోలీసులకు ఫిర్యాదు



ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

అసత్య ప్రచారాలు, పుకార్లు సృష్టిస్తూ తన ఆత్మగౌరవంపై దెబ్బకొట్టాలని చూసే ఊరుకునేది లేదని వైఎస్ షర్మిల హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో తనపై చేస్తున్న ప్రచారాలను తీవ్రంగా ఖండించిన ఆమె...దీని వెనుక టిడిపి నేతల హస్తముందని ఆరోపించారు. జగన్‌ను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యంలేక ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం భర్త అనిల్, వైసిపి నేతలతో కలిసి హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్‌ను కలిశారు. సోషల్ మీడియాలో తనపైనా, తన కుటుంబ సభ్యులపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

సైబర్ క్రైమ్‌కు కేసు బదిలీ

సోషల్ మీడియాలో తనపై అసభ్య పోస్టులపై వైఎస్ షర్మిల ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసు యంత్రాంగం కదిలింది. షర్మిల ఫిర్యాదును సైబర్ క్రైం విభాగానికి హైదరాబాద్ సిపి అంజనీకుమార్ బదిలీ చేయడంతో సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. సెక్షన్ 67 ఐటి యాక్ట్ -2000 (ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా అసత్య ప్రచారాలు చేయడం), ఐపిసి సెక్షన్ 509 (మహిళలను ఉద్దేశపూర్వకంగా కించపర్చడం) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు. అదనపు డిసిపి రఘువీర్ నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేయనుంది. ఇప్పటికే కొంత సమాచారాన్ని షర్మిల నుంచి తీసుకున్న పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఐపి అడ్రస్‌ల ఆధారంగా పోస్ట్ పెట్టిన వారిని గుర్తించనున్నారు. గతంలో వైఎస్ షర్మిల ఇచ్చిన ఫిర్యాదును కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. అప్పట్లో పోస్టులు పెట్టిన వారి ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మహిళల్ని కించపర్చే సంస్కృతి వైసిపిదే

మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళల్ని కించపర్చే సంస్కృతి వైసిపిదేనని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. లక్షకోట్ల అవినీతి దాహాన్ని తీర్చుకోవడానికి ఐఎఎస్ అధికారులనూ, మహిళా మంత్రులను జైలుకు పంపించిన నేత జగన్ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలనీ, షర్మిలపై జరుగు తున్న ప్రచారానికీ, టిడిపికి ఎలాంటి సంబంధంలేదని ఆమె స్పష్టంచేశారు. షర్మిలతోపాటు ఏ మహిళపై ఇలాంటి ప్రచారం జరిగినా టిడిపి ఖండిస్తుందని తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు పెంచడం, రేషన్ డీలర్లకు కమిషన్లు పెంచడంతో అన్ని వర్గాల నుండి ప్రభు త్వానికి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వైఎస్ కుటుం బం దుష్ప్రచారానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.

ఆ ఓట్లను తిరిగిచ్చేయాలి..

పౌరసత్వ బిల్లుపై

అసోం గాయకుడు జుబీన్ ఆగ్రహం

న్యూఢిల్లీ : పౌరసత్వ బిల్లు పట్ల అసోం గాయకుడు జుబీన్ గార్గ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లును తిరస్కరించాలంటూ అసోం సీఎం సోనోవాల్‌ను కోరారు. అలా చేయలేకపోతే 2016లో తన పాటలను వాడుకుని గెలిచిన ఓట్లను తిరిగిచ్చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ జుబీన్ గార్గ్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తాజాగా పేర్కొన్నారు. ఇందులో ఏముందంటే..“డియర్ సర్వానంద సోనోవాల్ కొన్ని రోజుల క్రితం పౌరసత్వ బిల్లును ఉద్దేశిస్తూ మీకు లేఖ రాశాను. కానీ మీరు దీనిని పట్టించుకోలేదు. 2016లో నా పాటలతో గెలిచిన ఓట్లను తిరిగిచ్చేస్తారా? కావాలంటే మీరు నాకు ఇచ్చిన పారితోషికాన్ని వెనెక్కి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా”నని పేర్కొన్నారు. జుబీన్ పెట్టిన ఈ ఫేస్‌బుక్ సందేశం సామాజిక మాధ్యమంలో సంచలనమైంది. పౌరసత్వ బిల్లును తిరస్కరించకపోతే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని జనవరి 8న అసో సీఎం సోనోవాల్‌కు జుబీన్ లేఖ రాశారు.

వారిని తగలబెట్టండి

యూపీ మంత్రి సంచలన వ్యాఖ్యలు

లక్నో: మత కల్లోలాలను ప్రేరేపిస్తూ రెండు వర్గాల ప్రజల మధ్య గొడవలు సృష్టించే రాజకీయ నాయకులను మంటల్లో తగలబెట్టండంటూ బీజేపీ మిత్ర పక్ష నాయకుడు, ఉత్తరప్రదేశ్ మంత్రి ఓ పి రాజ్‌భర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అలీగఢ్‌లో ఓ ర్యాలీలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్‌భర్ మాట్లాడుతూ.. ‘ఇంత వరకు ఎప్పుడైనా హిందు ముస్లింల అల్లర్లలో ఏ పేరు మోసిన రాజకీయ నాయకుడైనా చనిపోయారా..? రాజకీయ నాయకులు ఎందుకు చనిపోరు..? మతం పేరిట రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి మిమ్మల్ని (ప్రజలనుద్దేశించి) హింసకు ప్రేరేపిస్తున్న నాయకులనే మంటల్లో తగలబెట్టండి’ అంటూ వ్యాఖ్యానించారు. ప్రజలు అలా చేసినప్పుడే నాయకులకు అర్థమౌతోందని.. దాంతో వారు ఈ తరహా అల్లర్లకు పాల్పడరని చెప్పారు. రాజ్‌భర్.. గతంలోనూ యోగీ సర్కారు పాలనపై బహిరంగంగానే విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే.

మహిళలను కించపరచడం తగదు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాజకీయాలలో మహిళలను కించపరచే విధంగా అసత్య ప్రచారాలు చేయడం తగదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా వైయస్ షర్మిలపై దుష్ప్రచారాలు చేయడాన్ని ఖండిస్తున్నామని, కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఏ రాజకీయ పార్టీల వారైనప్పటికీ తల్లి, చెల్లిలా గౌరవించాలని, రాజకీయ కుయుక్తుల కోసం మహిళలను బలి పశువులను చేయడం తగదని సూచించారు. షర్మిలపై తప్పుడు ప్రచారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుల్ని శిక్షించి, షర్మిలకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను కోరారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతి సందర్భంగా తెలుగు ప్రజలందరికీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో కరువు, తుఫానుల వల్ల నష్టపోయిన ప్రజలు కూడా ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ వేడుకలకు, సాంప్రదాయానికి సంక్రాంతి అద్దం పడుతుందని, గ్రామీణులంతా ఆనందోత్సాహాలతో ఈ సంక్రాంతిని జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మెరిట్ రిజర్వుడు అభ్యర్థులకు ఓపెన్ కేటగిరీలో ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెరిట్ రిజర్వుడు అభ్యర్థులకు ఓపెన్ కేటగిరీలో ఉద్యోగాలివ్వాలని డివై ఎఫ్ఐ-కెవిపిఎస్-చేతివృత్తి దారుల సమన్వయ కమిటీ ఉమ్మడిగా డిమాండ్ చేశా యి. ఈ మేరకు కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు, చేతివృత్తి దారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం రామ కృష్ణ సోమవారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్‌లో లేని నిబంధ నలను ఇప్పుడు చర్చకు పెట్టి రిజర్వుడు అభ్యర్థులకు ఓపెన్ కోటాలో ఉద్యోగాలి వ్వకుండా ఎగనామం పెట్టేందుకు పూనుకుందని విమర్శించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే ఈ ప్రతిపాదనను విరమించుకొని పాతపద్ధతిలో నియామ కాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యుపిపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్షల్లో సైతం కటాఫ్ కేటగిరీ వారీగా ప్రతి ఏటా నోటిఫికేషన్ విడుదల చేస్తోందని పేర్కొన్నారు. ఎపిపిఎస్‌సి దీన్ని అమలు చేయడంలేదని తెలిపారు.

ఉద్యోగాల్లో దళిత, గిరిజన, బిసి వర్గాలకు మెరిట్ ఉన్న వయోపరిమితిలో మినహాయింపు ఇచ్చినందున నియామకాల్లో మెరిట్ ప్రాతిపదిక ఉద్యోగాలివ్వకుండా రిజర్వుడ్ పోస్టులకు పరిమితం చేసి ఓపెన్ ఉద్యోగాలన్నీ ఓసిలకిచ్చేందుకు నిర్ణయించిందని విమర్శించారు. రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, ఎపిపిఎస్‌సి చైర్మన్ తలతిక్క నిర్ణయాలకు వ్యతిరేకంగా అన్ని సామాజిక సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకొని ఈ నెల 18న చర్చావేదిక, అనంతరం ఉమ్మడిగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68